మన సమగ్ర
# ప్రజావాణి
తెలుగు డైలీ
RNI NO:TGTEL/25/A5443
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

| రాజన్న సిరిసిల్ల | గురువారం | 17.09.2026 | సంపుటి : 01 | సంచిక : 258 | పేజీలు : 12 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| RAJANNA SIRICILLA | THURSDAY | 17.09.2026 | Volume : 01 | Issue :258 | Pages : 12 | Cost : 2/- |






## సంస్కరణలను తీసుకువచ్చే
# దిశగా చర్యలు

- దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుని రావాల్సిన అవసరం ఉందని అన్నారు. పన్ను నిబంధనలలో మార్పుల కోసం వ్యక్తిగత ప్రయోజనాల ఆధారంగా కాకుండా వ్యవస్థకు ఉపయోగపడే రీతిలో విశ్లేషణాత్మక ప్రతిపాదనలతో ముందుకు రావాలని సూచించారు. బెంగళూరులో ఇంటర్నేషనల్ ట్యాక్స్ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ ఫౌండేష న్ 8వ అంతర్జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ప్రసంగించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కొన్ని నిబంధనల వల్ల కొందరు పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం కలుగుతోందని అన్నారు. అయినప్పటికీ.. ఈ నిబంధనలు పన్ను వ్యవస్థ సమర్థతను దెబ్బతీసేలా ఉంటే వాటిని తొలగించాలనే గళాన్ని వినిపించే వాళ్లు

మిగతా2లో...

## 22ఏ భూములకు త్వరలో
# పరిష్కారం

- యూఎల్‌సీ భూములపై త్వరలో కొత్త విధానం
- 22ఏ సమస్యల్లో 12 అంశాలను గుర్తించాం
- పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తాం
- పొరపాటున 22ఏలో చేరిన భూములు తొలగిస్తాం
- క్రమబద్ధీకరించిన, వేలం భూములకు విముక్తి
- ధరణి పేరిట గత ప్రభుత్వంలో దోపిడీ జరిగింది
- రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది
- బీఆర్ఎస్ భూములను ఇష్టారాజ్యంగా బదిలీ
- కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ చేస్తాం
- ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి
- ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతాం
- ఫాంహౌస్ భూములపై 30 రోజుల్లో నివేదిక
- శాసనసభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన



హైదరాబాద్,సెప్టెంబర్ 16 : 22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు. ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. జీవో 166, జీవో 59, జీవో 58 కింద క్రమబద్ధీకరించిన భూములకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. వేలంలో కొనుగోలు

మిగతా2లో...

## ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంలో విచారణ




2లో

## 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే
# పట్టా భూములు

- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి తప్పే
- హరీశ్‌రావు మామ భూములకు ఎలా జరిగింది?
- అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది హరీష్?
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫైర్



హైదరాబాద్,సెప్టెంబర్ 16 : మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. "అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?" అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో

మిగతా2లో...

## ఉద్యాన పంటల విస్తరణకు
# ప్రభుత్వం పెద్దపీట

ఈ ఏడాది అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు లక్ష్యం

ఉద్యాన రంగ అభివృద్ధికి రూ.1,000 కోట్లతో కార్యాచరణ

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



2లో



## యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

- కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 : యూపీఐ వినియో గదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)

మిగతా2లో...




## పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం

51 లక్షల మంది లబ్ది పొందే చాన్స్

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 : దేశంలో పనిచేస్తున్న కోట్లాది మంది వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన వార్త అందించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోకి వచ్చే సేవకుల వేతన పరిమితిని భారీగా పెంచుతూ కేంద్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.

మిగతా2లో...

## ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా
# ప్రభుత్వానికే...

అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు

తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత విమర్శ



2లో

# అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

- సీఎం కుటుంబానికి 308 ఎకరాల భూమి
- కాంగ్రెస్ అక్రమాలు బయటపెడతామనే మాపై సస్పెన్షన్
- భూభారతి, 22ఏపై సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్




హైదరాబాద్,సెప్టెంబర్ 16 : అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి కుటుంబానికి 308 ఎకరాలు భూమి ఉందన్నారు. వెల్దండ మండలం కొట్ర గ్రామంలోనే 175 ఎకరాలు, వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో 79 ఎకరాలు, ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఇతర భూమి 54

మిగతా2లో...

# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ దృష్టి భూములపై పడిందని ఆరోపించారు. భూదోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్నారు. కేసీఆర్, సోమేశ్‌కుమార్ కలిసి ధరణిని రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందన్న ఆరోపణలపైనా రేవంత్ స్పందించారు. అసలు వివాదం 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనన్నారు. వాటిని చూపించి కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామని సీఎం తెలిపారు. ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. భూ దోపిడీ గురించి చేసిన ఆలోచనల నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని, అదే భూతమై సమాజాన్ని పట్టి పీడిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన డేటా మాఫియా చేతిలో బీఆర్ఎస్ నాయకులు పెట్టారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ధరణిపై జరిగిన చర్చలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ తమ మెదడు రంగరించి ధరణి తయారు చేశామని గొప్పలు చెప్పారని, ఆయన చెప్పింది పచ్చి అబద్ధమని సీఎం మండిపడ్డారు. ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టానుసారం బదిలీ చేసుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తప్పు చేసిన వారు సభకు రాకుండా తప్పించుకుందామనే చూస్తారని సీఎం ఎద్దేవా చేశారు. పట్టుకుని రమ్మని ఆదేశాలిస్తే తప్ప కేసీఆర్ సభకు వచ్చేటట్టు లేరని అన్నారు. రెవెన్యూ సమాచారం కేంద్ర సంస్థ ఎన్ఐసీకి ఇవ్వకుండా ప్రైవేటుకు ఎందుకు ఇచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. రూ. 110 కోట్ల విలువైన కాంట్రాక్టు రూ.1400 కోట్ల వాల్యూకు ఎలా వచ్చిందన్న సీఎం, దీనిపై విచారణ చేయాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. 1982లో వచ్చిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ ఏర్పాటు కాగానే కేసీఆర్ రద్దు చేశారని గుర్తుచేశారు. ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో కేసీఆర్ చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి వస్తుందనే సభ నుంచి పారిపోయారని విమర్శించారు. 2021 నాటికి 21 లక్షల 93వేల 50 ఎకరాలను పార్టు బి కింద నిషేధిత జాబితాలో పెట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2023 నాటికి ధరణితో తెలంగాణ సమాజానికి కేసీఆర్ గుండు కొట్టారని విమర్శించారు. ధరణిని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు విచ్చల విడిగా సంపాదించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, దళారీలు వేర్వేరు కాదని ఇద్దరూ ఒకటేనని రేవంత్ రెడ్డి అన్నారు. కండువా వేస్తే బీఆర్ఎస్ నేత, కండువా తీస్తే దళారీ అని అభివర్ణించారు. అధికారంలోకి వచ్చాక భూముల సమస్య పరిష్కారం కోసం తలలు బద్దలు కొట్టుకున్నామన్నారు. తెలంగాణకు చెందిన 2.5కోట్ల ఎకరాల భూమి డేటా మాఫియా చేతికి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సభలో ఉన్నప్పుడే 22ఏ బండారం బయటపెట్టాలని భావించానని తెలిపారు. ఆ విషయం తెలిసి కావాలనే బీఆర్ఎస్ సభ్యులు సస్పెండ్ అయ్యేలా వ్యవహరించారన్నారు. బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ధరణి 2010లో ఒడిశాలో మొదలైందని రేవంత్ రెడ్డి అన్నారు. 2014లో కాగ్? ధరణిపై తీవ్రంగా ఆక్షేపించిందన్నారు. 2018లో ధరణి కాంట్రాక్టును ఐఎల్?ఎఫ్?ఎస్? దక్కించుకుందని వివరించారు. ఐఎల్?ఎఫ్ఎస్?, ధరణిని టెరాసిస్ అనే కంపెనీకి అమ్ముకుందని విమర్శించారు. టెరాసిస్ కంపెనీలో శ్రీధరరాజుకు వాటా ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. జోగినపల్లి సంతోష్ కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్ రావుకు 52 ఎకరాలు, కొండల్ రావుకు 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్‌పై తాను బాంబులు ఎందుకు వేస్తానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నేనేమైనా బిన్ లాడెన్నా అని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. అదే సమయంలో, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై కూడా సీఎం కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సుమారు 9,500 మందికి త్వరలోనే శుభవార్త అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాల చొప్పున ఉందని వివరించారు. రేవంత్‌రెడ్డి కుటుంబ భూముల వివరాలు అన్ని త్వరలో మరిన్ని బయటకి వస్తాయని చెప్పారు. ప్రజల సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలుపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంటే, డైవర్షన్ రాజకీయాలకు సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కుట్రపూరితంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిందని చెప్పారు. ప్రభుత్వ అక్రమాలను బయటపెడతామనే సభలో లేకుండా చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడినవన్నీ అర్ధసత్యాలు, అబద్ధాలని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటుకు టీ షర్ట్, స్టిక్కర్లు వేసుకుని వెళ్తే ఒప్పు, తాము టీ షర్టు వేసుకుని అసెంబ్లీకి వస్తే తప్పా? అని ప్రశ్నించారు. పార్లమెంటు, అసెంబ్లీ నియమాలు వేరా? అని అడిగారు. **పథకం ప్రకారమే గెంటేశారు** వృద్ధులకు రూ.నాలుగు వేల పెన్షన్, మహిళలకు రూ.2500 ఇవ్వలేదనీ, విద్యార్థులకు భరోసా కార్డు ఇవ్వలేదని హరీశ్‌రావు విమర్శించారు. ఈ వైఫల్యాలను టీ షర్ట్ మీద రాసుకొస్తే తమను సస్పెండ్ చేశారని అన్నారు. తాము కావాలని అసెంబ్లీ నుంచి బయటకు రాలేదనీ, పక్కా పథకం ప్రకారమే గెంటేశారని విమర్శించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికి, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగితే.. కనీసం మైక్ ఇవ్వాలని అడిగినందుకు సస్పెండ్ చేశారని అన్నారు. తాము సభలో ఉంటే కాంగ్రెస్ కుంభకోణాలు, రేవంత్‌రెడ్డి కుటుంబ అవినీతి బయటపడుతుందనే భయంతోనే మొత్తం సెషన్‌కి తమను సస్పెండ్ చేశారని వివరించారు. సస్పెన్షన్ ఎత్తేస్తే ఆధారాలతో సభకు వస్తామని తమ ఎమ్మెల్యేలు సవాల్ చేశారని గుర్తు చేశారు. సీపీఐ, బీజేపీలు అడిగినా సస్పెన్షన్ ఎత్తేసే దమ్ము సీఎంకు లేదన్నారు.

# ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :** రాష్ట్రంలో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఉద్యాన పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నా మని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత–జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం శాసనసభలో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో వివిధ పథకాల కింద అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. పండ్లు, కూరగాయలు, ఆయిల్‌పామ్ తదితర పంటల వైపు రైతులను మళ్లించేందుకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యాన పంటల సాగు విస్తరణకు అవసరమైన మొక్కలు, ఎరువులు, మల్చింగ్, షేడ్‌నెట్, ఫామ్‌పాండ్లు, శీతల గిడ్డంగులు, శాశ్వత పందిళ్లు, బిందు, తుంపర సేద్యం వంటి సదుపాయాలను నిబంధనల ప్రకారం 40 శాతం నుంచి 90 శాతం వరకు రాయితీపై అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. 2026--27లో మొక్కలు, మల్చింగ్, షేడ్‌నెట్, కోత అనంతర నిర్వహణ సదుపాయాలు, శీతల గిడ్డంగులు, ఉద్యాన యాంత్రీకరణ, శాశ్వత పందిళ్ల కోసం రూ.150 కోట్లు, బిందు, తుంపర సేద్యం కోసం రూ.243 కోట్లు, ఆయిల్‌పామ్ అభివృద్ధికి రూ.261 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 88,282 మంది రైతులు 3.20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని మంత్రి తెలిపారు. చీవీజూ–ఞా పథకం కింద 2021--22 నుంచి ఇప్పటివరకు 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. 2023 డిసెంబర్ నుంచి 1.37 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును విస్తరించామని చెప్పారు. 2026--27 సంవత్సరానికి 85 వేల ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 29,053 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు మంత్రి వెల్లడించారు. సాంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు ఉన్న ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణలో భాగంగా ప్రభుత్వం ఈ పంటను ప్రోత్సహిస్తోందన్నారు. రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు మొక్కలు, డ్రిప్, మొదటి నాలుగేళ్లకు ఎరువులు, అంతర పంటల సాగు తదితరాలకు కలిపి ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ఫామ్‌పాండ్లు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కూడా రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ చట్టం--1993 ప్రకారం ఫ్యాక్టరీ జోన్ కేటాయించిన ప్రతి ఆయిల్‌పామ్ కంపెనీ ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రతి నెలా ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేయాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.24,025 ధర ఉందన్నారు. కనీస హామీ ధర (వీ+ఞా) ప్రకటించాల్సింది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, అయినప్పటికీ రైతులకు మరింత భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని వీ+ఞా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నాలుగు ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు.

# ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే...

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు.

కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ – గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

# సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు అవసరం అయ్యారని వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, పన్నుల వసూళ్ల రంగానికి దీర్ఘకాలి కంగా ప్రయోజనం చేకూర్చే అంశాలపైనే ప్రతి ఒక్కరూ ప్రధానంగా దృష్టి సారించాలని నిర్మల సీతారామన్ చెప్పారు. పన్ను నిబంధనల సవరణలపై ప్రతిపాదనలు చేసేటప్పుడు పూర్తి సమాచారంతో కూడిన నివేదికలను సమర్పించాలని కోరారు. ఏదైనా నిబంధన వల్ల పన్ను చెల్లింపుదారులపై అదనపు భారం పడుతుంటే, దాని వల్ల ఎంతమంది ప్రభావితమవుతున్నారు, ఎంత సమయం, వ్యయం వృథా అవుతుందనే వివరాలను గణాంకాలతో సహా నిరూపించాలని కోరారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటో కూడా ప్రతిపాదించాలని, ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఆదాయంపై పడే ప్రభావాన్ని నిశితంగా అంచనా వేయాలని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. వీటి వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుంది, పన్ను పరిధి ఏ మేరకు ప్రభావితమవుతుంది, పన్నుల నిర్వహణపై ఎలాంటి ఫలితాలు ఉంటాయనే విషయాన్ని సమగ్రంగా విశ్లేషించడం ఎంతైనా అవసరమని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పన్ను విధానాలను సరళీకరిస్తూనే, దేశ ఆర్థిక వృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటోందని గుర్తుచేశారు. నిబంధనల మార్పు ఒక వర్గానికి మాత్రమే కాకుండా, మొత్తం ఆర్థిక రంగానికి మేలు చేసేలా ఉన్నప్పుడే నిజమైన సంస్కరణలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు. పన్నుల పరిధిని విస్తృతం చేస్తూనే, విధానపరమైన అడ్డంకులను తొలగించడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

# యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

(మొదటి పేజీ తరువాయి)

విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, చార్జ్‌బ్యాక్‌లు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు. యూపీఐ కొత్త ఆదాయ విధానం వల్ల ఫిన్‌టెక్ సంస్థలు మార్కెటింగ్, ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిపై మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుందని నిగమ్ పేర్కొన్నారు. 2020 నాటికి యూపీఐ వినియోగదారులు దాదాపు 20 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50–55 కోట్లకు చేరిందని తెలిపారు.

# పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు నెలకు రూ. 15,000 ఉన్న ఈ పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితిని ఏకంగా రూ. 25,000కు పెంచుతూ కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన బిల్లుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ సంచలన నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 51 లక్షల మంది ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుందని ఆయన తెలిపారు. ఈ సామాజిక భద్రతా పథకం విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం తరపున రూ. 11,339 కోట్ల నిధులను ఖర్చు చేయబోతోంది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 17 నుంచే అమలులోకి రానుంది. గతంలో 2004 నుంచి 2014 వరకు పీఎఫ్ వేతన పరిమితి ఎలాంటి మార్పూ లేకుండా కొనసాగింది. అనంతరం సెప్టెంబర్ 2014లో దీనిని రూ. 15,000కు పెంచారు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు రూ. 25,000కు పెంచడం విశేషం. అనేక రాష్ట్రాల్లో కనీస వేతనాలు ఇప్పటికే రూ. 15,000 కంటే దాటిపోయిన నేపథ్యంలో 2014 పరిమితి కాలం చెల్లినదైందని, అందుకే సమగ్ర సంప్రదింపుల తర్వాత ఈ సీలింగ్‌ను రూ. 25 వేలకు పెంచినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రూ. 15,000 కంటే ఎక్కువ జీతంతో కొత్తగా ఉద్యోగంలో చేరే చాలామందికి పీఎఫ్, పెన్షన్, సంబంధిత బీమా రక్షణ లభించేది కాదు. తాజాగా వేతన సీలింగ్‌ను రూ. 25,000కి పెంచడం వల్ల రూ. 15,000 నుంచి రూ. 25,000 మధ్య సంపాదించే మధ్యతరగతి ఉద్యోగులందరూ ఇకపై చట్టబద్ధంగా ఈపీఎఫ్ పరిధిలోకి వస్తారు. ఇది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లను పెంచడమే కాకుండా, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు తమ సిబ్బందికి మెరుగైన సామాజిక భద్రత కల్పించేందుకు ఉపయోగపడుతుంది.

# ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

# 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

# స్వగ్రామమైన పోత్రియా లో అమరుడు సీతారాములు సంతాపం సభ జరిగింది



పలాస ప్రజావాణి ప్రతినిధి జనశక్తి రాష్ట్ర నేత కోనేరు రమేష్ ఆధ్వర్యములో జరిగిన సభ లో ఆయన మాట్లాడుతూ 52 యేళ్ళ అరుణోదయ ప్రస్థానం సందర్భంగా... పలాస మండలం లో తర్లకోట పంచాయతీ పొత్రియ గ్రామం అమరుడు కామ్రేడ్ సవర సీతారాములు స్వగ్రామంలో ...50 గంటల "ప్రజాకళా జాతర కరపత్రం" ను కామ్రేడ్ కోనేరు రమేష్ చేతుల మీదుగా విడుదల చేశారు..

# ఇందిరమ్మ ఇళ్లపై అర్హుల ఎదురుచూపులు

● ఆంగోత్ తండాలో ఆరుగురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్









మంచాల, (ప్రజావాణి ):సెప్టెంబర్ 16: ఆంగోత్ తండ గ్రామపంచాయతీలో గుడిసెల్లో. నివసిస్తున్న అర్హులైన ఆరుగురు నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో ఆరుగురు అర్హులుగా గుర్తించినట్లు జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి డా. బాలకోటి నాయక్ తెలిపారు.గతంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై నిర్వహించిన లబ్ధిదారుల ముఖాముఖి కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించినప్పటికీ, అర్హులైన వారందరికీ ఇళ్లు కేటాయించలేదని బాలకోటి నాయక్ ఆరోపించారు. సర్వేలో అర్హులుగా గుర్తించిన ఆరుగురిలో కేవలం ఇద్దరికే ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పడం వల్ల మిగిలిన అర్హుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు.ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా గుడిసెల్లో నివసిస్తున్న నిజమైన అర్హులకు ఇళ్లు మంజూరు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆరుగురు అర్హులకూ ఇళ్లు మంజూరు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తామని డా. బాలకోటి నాయక్ తెలిపారు.

# గణనాథుని సన్నిధిలో సేవా స్ఫూర్తి

● భక్తులకు అల్పాహారం అందించిన మొలుగు రామారావు



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16 (ప్రజావాణి) కూకట్‌పల్లిలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. దేవిస్థాన హోమ్స్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దేవిస్థాన హోమ్స్ విల్లా నం.44కు చెందిన మొలుగు రామారావు ఆధ్వర్యంలో భక్తులు, మిత్రులకు అల్పాహారం ఏర్పాటు చేసి పంపిణీ చేశారు. గణనాథుని సన్నిధిలో భక్తులకు సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో గణేష్ కమిటీ సభ్యులు కమలాకర్, నరేష్, మొలుగు ఆనంద్‌రావు, మక్కపాటి రంగరాజు తదితరులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.

# కూకట్‌పల్లిలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

● కుటుంబ సమేతంగా వినాయకుడిని దర్శించుకున్న మక్కపాటి రంగరాజు



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16 (ప్రజావాణి)కూకట్‌పల్లిలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. దేవిస్థాన హోమ్స్‌లోని విల్లాస్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడిని మక్కపాటి రంగరాజు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి పూజలు చేసి, వినాయకుడి ఆశీస్సులు పొందారు. పరిసర ప్రాంతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయకుడిని దర్శించుకుంటున్నారు.

# భక్తిశ్రద్ధలతో వినాయక చవితి శుభాకాంక్షలు



కూకట్పల్లి : బాలాజీ నగర్ (ప్రజావాణి) సెప్టెంబర్ 16కూకట్‌పల్లి: బాలాజీనగర్‌లోని అయ్యప్ప మొబైల్స్ అండ్ ప్రింటింగ్ నిర్వాహకులు క్రాంతి కుమార్ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి ప్రజలకు, భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని క్రాంతి కుమార్ కోరారు.

# పవన్ కళ్యాణ్ దృష్టికి ఉదయభాను ద్వారా ఇనాం భూబాధితుల సమస్య

● ఇనాం రిలే నిరాహార దీక్ష శిబిరంలో వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ హామీ





జగ్గయ్యపేట సెప్టెంబర్ 16 మన ప్రజావాణి ఇనాం బాధితులు 10 సం.లుగా పడుతున్న అవస్థలను జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు స్వామినేని ఉదయభాను ద్వారా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్తామని వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ చెప్పారు. ఆయన బుధవారం ఎన్టీఆర్ సర్కిల్లో ఇనాం భూబాధిత సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న 9వ రోజు రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని కౌన్సిలర్లు కొలగాని రాము, కాశీ అనురాధ కిషోర్, షేక్ సత్తార్, ఆవుల భవాని ప్రసాద్ తదితరులతో కలిసి ప్రారంభించారు.సమస్య గత పదేళ్ల గా అన్ని రాజకీయ పార్టీల మేనిఫెస్టో పేర్కొంటున్నప్పటికీ పరిష్కారం కాకపోవటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.ఇనాం బాధితులు సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కొనసాగించాలని, తమ సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. కౌన్సిలర్ కొలగాని రాము మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఈ సమస్యపై కనీస సానుభూతి లేదని జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా ఉదయభాను ఉన్న సమయంలో సమస్య పరిష్కారానికి కృషి చేసిన జగన్ పాదయాత్రలో సమస్య రాలేదని పట్టించుకోలేదని విమర్శించారు. ఈసారి సమస్య పరిష్కారం కావాల్సిందేనని అందుకు బాధితులు చేస్తున్న న్యాయబద్ధమైన ఆందోళనకు మద్దతు ఇస్తామని చెప్పారు.

# పశువుల పాలిట ఆపద్బాంధవుడు.. డాక్టర్ దినేష్‌రెడ్డి!

● ఎనిమిదిన్నరేళ్ల విశిష్ట సేవలకు ఘన సత్కారం
● పదోన్నతిపై అనంతపురం జిల్లాకు బదిలీ



మన ప్రజావాణి చౌడేపల్లి, సెప్టెంబర్ 16పశువుల అనారోగ్య సమాచారం అందితే చాలు.. రైతు ఇంటి ముంగిట వాలిపోయి వైద్య సేవలు అందించిన పశువైద్యాధికారి డాక్టర్ దినేష్‌రెడ్డి. చౌడేపల్లి మండలంలో ఎనిమిదిన్నర సంవత్సరాల పాటు రైతులకు, పశుపోషకులకు అందుబాటులో ఉంటూ పశువులకు ఉచిత వైద్య సేవలు అందించిన ఆయనకు బుధవారం వెలుగు కార్యాలయంలో ఘన సన్మానం నిర్వహించారు.పశువైద్యాధికారిగా సేవలందిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో పశువుల ఆరోగ్య పరిరక్షణకు విశేష కృషి చేసిన దినేష్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో ఉత్తమ పశు వైద్యాధికారిగా గుర్తింపు పొందారని పలువురు ప్రశంసించారు. పశువుకు అనారోగ్యం వచ్చిందని సమాచారం అందిన వెంటనే ఆలస్యం చేయకుండా రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించేవారని కొనియాడారు.తన సేవా కాలంలో రైతులతో సన్నిహితంగా మెలుగుతూ పశువుల సంరక్షణపై అవగాహన కల్పించారని తెలిపారు. ఆయన సేవలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ రైతులకు మెరుగైన పశువైద్య సేవలు అందించాలని అధికారులు సూచించారు.

పదోన్నతిపై అసిస్టెంట్ డైరెక్టర్‌గా అనంతపురం జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసనాయుడు, అడిషనల్ డైరెక్టర్ మనోహర్, పశువైద్యాధికారులు వెంకటసాయికృష్ణకాంత్, పవన్‌కుమార్, జేఈవో అలీహమాద్, అనుష, ఎల్‌ఏ సుబ్రమణ్యం, అనిత, వీఏ జానకిరామ్, మంజునాథ్, ఏహెచ్ గోవర్ధన్, దాము, గోకుల్, హరిత, కీర్తన, మౌనిక, కుమారిరెడ్డి, ప్రసాద్, రామకృష్ణ, భాస్కర్, రాజేష్, హరి తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# చెరువులు నింపండి. పంటలు కాపాడండి.

■ శ్రీశైలం నుంచి నీళ్లు వస్తున్నా.. అనంత చెరువులు ఎందుకు నిండడం లేదు?
■ కరువు కాటుకు రైతన్న విలవిల.. అనంతకు నీళ్లివ్వండి.. రైతుల కన్నీళ్లు తుడవండి
■ రైతన్నను బతికించండి. . హంద్రీ--నీవా నీళ్లు విడుదల చేయండి
■ శ్రీశైలంలో నీళ్లున్నా.. అనంత రైతులకు కన్నీళ్లేనా?
■ 50 రోజులుగా నీటి కోసం ఎదురుచూపులు.. చెరువులకు చుక్క నీరు లేదు
■ శ్రీశైలం నుంచి ఇంకా 17 టీఎంసీల వరకు తెచ్చుకునే అవకాశం ఉంది
■ కరువుతో ఎండిపోతున్న పంటలు.. చెరువులు నింపాలని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి డిమాండ్



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 16 ప్రజా వాణి అనంతపురం జిల్లా తీవ్ర కరువుతో అల్లాడుతోందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. శ్రీశైలం డ్యాం నుంచి ఆగస్టు 5న నీటి విడుదల ప్రారంభమైనా సుమారు 50 రోజులు గడిచినప్పటికీ అనంతపురం జిల్లాలో చెరువులకు నీటిని విడుదల చేయలేదన్నారు. చెరువులకు నీళ్లు వదిలే ఆదేశాలు తమకు లేవని అధికారులు చెబుతున్నారని తెలిపారు. బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.శ్రీశైలం డ్యాంలో 180 టీఎంసీల నుంచి 112 టీఎంసీలకు నీటిమట్టం తగ్గిందని, అయినా 835 అడుగుల వరకు నీటిని డ్రా చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత నీటి లభ్యత, వివిధ ప్రాజెక్టులకు విడుదలను పరిశీలిస్తే హంద్రీ--నీవా ద్వారా ఇంకా దాదాపు 17 టీఎంసీల వరకు నీటిని పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు."పంటలు ఎండిపోతున్నాయి.. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి.."చీనీ, అరటి, మిరప, టమాట తదితర పంటలు నీరందక ఎండిపోతున్నాయని ప్రకాష్ రెడ్డి తెలిపారు. భూగర్భజలాలు పడిపోవడంతో రైతులు సాగు చేసిన పంటలను వదిలేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతాంగాన్ని కాపాడేందుకు హంద్రీ--నీవా కింద ఉన్న చెరువులన్నింటినీ వెంటనే నింపాలని కోరారు."వెలిగొండ ట్రయల్ రన్ కంటే.. కరువు రైతులే ముఖ్యం"వెలిగొండ ప్రాజెక్టు ప్రస్తుతం ట్రయల్ రన్‌లోనే ఉందని, ప్రధాన సొరంగం పూర్తయినా కాలువలు, బ్రాంచ్ కాలువలు, పంపిణీ వ్యవస్థ ఇంకా పూర్తికావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం వెలిగొండకు విడుదల చేస్తున్న నీటిని తగ్గించి హంద్రీ--నీవా, ముచ్చుమర్రి ద్వారా రాయలసీమ ప్రాంతాలకు అందించాలని కోరారు."49 చెరువులకు తుంగభద్ర నీళ్లు ఇవ్వాలి"తుంగభద్ర డ్యాం నుంచి పీఏబీఆర్‌కు నీటిని విడుదల చేసి పీఏబీఆర్ కుడికాలువ కింద ఉన్న 49 చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. హంద్రీ--నీవా కింద ఉన్న అన్ని చెరువులతో పాటు పేరూరు డ్యాంకు కూడా నీటిని విడుదల చేయాలని కోరారు.నేడు హంద్రీ--నీవా సీఈ కార్యాలయం ఎదుట జలదీక్ష.రైతుల నీటి సమస్య పరిష్కారం కోసం గురువారం హంద్రీ--నీవా సీఈ కార్యాలయం ఎదుట జలదీక్ష చేపడుతున్నట్లు ప్రకాష్‌రెడ్డి తెలిపారు. రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు పాల్గొంటారని చెప్పారు. తొమ్మిది నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివస్తారని వెల్లడించారు.

# సోషల్ మీడియాకు భయపడుతున్న నేతలు...

■ యాప్స్ డిలీట్..!
■ అప్పుడు తీపి-ఇప్పుడు చేదు..
■ అందరికీ సోషల్ మీడియా టీమ్స్..!
■ పరేషాన్‌లో మంత్రులు..!



సెప్టెంబర్ 16 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మొన్నటివరకు సోషల్ మీడియాను తరచూ ఫాలో అయ్యే కొందరు లీడర్లు ఇప్పుడు వాటిని చూసేందుకు జంకు తున్నారు. ఎందుకంటే వారికి వ్యతిరేకంగా ఎక్కువ సంఖ్యలో రీల్స్, షార్ట్స్ , పోస్టులు రావడమే అందుకు కారణం. నెగెటివ్ పోస్టులు చూసి కంగారు పడటమో, తీవ్ర మనస్తాపానికి గురి కావడం జరుగుతున్నట్టు తెలిసింది. అందుకే సోషల్ మీడియాకు దూరంగా ఉండటమే బెటర్ అనుకుని , తమ స్మార్ట్‌ఫోన్లలోని సోషల్ మీడియా యాప్స్ మొత్తాన్ని డిలీట్ చేసి ప్రశాంతంగా ఉంటున్నట్టు తెలుస్తుంది.

అప్పుడు తీపి.. ఇప్పుడు చేదు

ఎన్నికల్లో గెలవకముందు, పదవి రాకముందు సోషల్ మీడియా వేదికగా ప్రత్యర్థి పార్టీకి చెందిన లీడర్ల పై వ్యతిరేక పోస్టులు పెట్టేందుకు లీడర్లు పోటీలు పడేవారు. ఒక పోస్టుకు కౌంటర్‌గా పదిపైగా పోస్టులు , రీల్స్ , షార్ట్స్ పెట్టించేవారు. తీరా ఎమ్మెల్యే , ఎంపీగా గెలిచిన తరువాత సోషల్ మీడియా విషయంలో యూటర్న్ తీసుకున్నారు. అసలు సోషల్ మీడియా యాప్స్‌ను ఓపెన్ చేసి అందులోని కంటెంట్‌ను చూసేందుకు జంకు తున్నారు. తమకు వ్యతి రేకంగా వచ్చే పోస్టులు , రీల్స్ , షార్ట్స్‌ను చూస్తేందు కు ధైర్యం చేయలేక పోతున్నారు. ప్రత్యర్థులు ఉపయోగించే భాష , బాడీ షేమింగ్ పదాలు , ఫ్యామిలీ మెంబర్లను టార్గెట్ చేస్తూ పెట్టే పోస్టులు ఇబ్బందికరంగా ఉంటున్నాయి. దీంతో వాటిని చూసినప్పుడల్లా మానసికంగా కృంగి పోవడం కంటే వాటి జోలికి వెళ్లకుండా దూరంగా ఉండటమే మేలని భావిస్తున్నారు. అందుకని తమ ఫోన్ల నుంచి సోషల్ మీడియా యాప్స్ మొత్తాన్ని డిలీట్ చేసి కేవలం నార్మల్ కాల్స్ కోసం మాత్రమే స్మార్ట్ ఫోన్లను ఉపయో గిస్తున్నారు. ఈ పరిస్థితి అధికార పార్టీలోని ప్రజా ప్రతినిధులతో పాటు ప్రతి పక్షపార్టీ లీడర్లలోనూ సైతం ఉంది.

పరేషాన్‌లో మంత్రులు...

ఈ మధ్య వార్తల్లో నిలిచిన కొందరు మంత్రులు సోషల్ మీడియా పేరెత్తితే చాలు అంతెత్తున లేస్తున్నారు. పిచ్చి సోషల్ మీడియా అంటూ తమదైన శైలిలో విమర్శలు చేస్తున్నారు. ఎందుకంత కోపం అంటే.. ఏదిపడితే అది పెడితే కోపం రాదా..? మీపై కూడా అట్లే పోస్టులు ,రీల్స్ చేస్తే ఊరుకుంటారా..?అని ప్రశ్నిస్తున్నారు. విమర్శ లకు సైతం ఓ హద్దు ఉంటుందని , తమపై పెట్టిన పోస్టుల వివరాలు చెప్పి ఆవేదన వ్యక్తం చేశారు. 'మేం అసలు సోషల్ మీడియా చూడ ట్లేదు. వాట్సాప్ , ఫేస్‌బుక్ , ఇన్‌స్టాగ్రామ్ , థ్రెడ్స్ ఇలా అన్ని తీసేసి.. కేవలం కాల్స్ కోసం మాత్రమే ఫోన్ వాడు తున్నాం' అంటూ వివరించారు. మరి మీకు వ్యతిరేకంగా వచ్చిన పోస్టుల గురించి ఎలా తెలుసుకుంటారు అని అడిగితే "పీఏనో, ఫాలోవరో ఎవరో ఒకరు చెప్తారు కదా..? అప్పుడు తెలుసుకుంటాం. కానీ వాటిని చూడం. వాటికి కౌంటర్‌గా పోస్టులు పెట్టాలని చెప్తాం' అంటూ అసలు విషయాన్ని వివరించారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉమ్మడిగా కృషి చేయాలి..

- కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లాలో సజావుగా అమలు చేయాలి
- పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణలి
- జిల్లా లో కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్





**అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 16 ప్రజా వాణి** జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉమ్మడిగా కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లాలో సక్రమంగా, మరింత బాగా అమలు చేయాలని పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలోని డిపిఆర్సీ సమావేశ మందిరంలో దిశా (జిల్లా అభివృద్ధి సమన్వయ ు పర్యవేక్షణ కమిటీ) సమావేశాన్ని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించగా, జడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, ఆయా శాఖల జిల్లా అధికారులు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు అంబికా మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు కలసికట్టుగా ముందుకు సాగాలన్నారు. జిల్లాలోని ప్రధాన సమస్యలను గుర్తించి, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అధికారుల బాధ్యతను మరింత సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా జిల్లాను 'సస్యశ్యామలం' చేయడమే ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి దిశా సమావేశం ఏర్పాటు చేయనున్నామన్నారు. దాదాపు 108 కేంద్ర ప్రయోజిత పథకాలు అమలులో ఉన్నాయని, జిల్లా ప్రయోజనాల కోసం నిధుల విడుదలకు కేంద్ర స్థాయిలో బలంగా స్వరం వినిపిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి గారిని నేరుగా కోరిన మీదట 'జలజీవన్ మిషన్' ద్వారా జిల్లాకు అవసరమైన నిధుల మంజూరు ప్రక్రియ వేగవంతమైందన్నారు. రాయలసీమ వెనుకబడిన జిల్లాల అభివృద్ధి ఫండ్ కింద గతంలో నిలిచిపోయిన నిధులను, పార్లమెంట్ లో ప్రశ్నించడం ద్వారా తిరిగి ప్రతి సంవత్సరం ?50 కోట్లు చొప్పున జిల్లా అభివృద్ధికి వచ్చేలా కృషి చేయడం జరిగిందన్నారు. నిధుల వినియోగం, పథకాల పురోగతిపై అధికారులు సరైన వివరాలు సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మరిన్ని నిధులు తీసుకురావడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఐక్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఎంపీ నిధులకు సంబంధించి 12.54 కోట్ల రూపాయలు 154 పనులకు మంజూరు కాగా, అందులో 6.31 కోట్ల రూపాయలకు సంబంధించి పనులను గుర్తించాలన్నారు. ఎంపీ నిధుల కింద ఎక్కువ నిధులు జిల్లాకు తీసుకురావడం జరిగిందని, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు చేపట్టాలన్నారు. జిజిహెచ్ లో విశ్రాంతి భవనంలో అవసరమైన సదుపాయాలు కల్పించి దానిని త్వరగా ప్రారంభించాలన్నారు. ప్రజలకు అవసరమైన అత్యాసర పనులను వేగంగా చేపట్టాలని, త్రాగునీటికీ అవసరమైన నిధులు కేటాయిస్తామని, ఎక్కడైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలన్నారు. జల్ జీవన్ మిషన్ పనులను తొందరగా చేయించాలని, 136 కోట్ల రూపాయలు ఇప్పటివరకు ఖర్చు చేయగా, ఆన్లైన్లో మాత్రం 7.68 కోట్లు ఖర్చు చేసినట్లు వస్తోందని, పూర్తయిన పనులకు బిల్లులు అప్లోడ్ పెండింగ్ ఉంచరాదన్నారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి సురక్షితమైన త్రాగునీరు అందించాలన్నారు. అనంతపురం నగరంలోని ట్రెల్లిస్ స్కూల్ ఘటనలో చిన్నారి తల్లిదండ్రులను బెదిరిస్తున్నారని చెబుతున్నారని, ట్రెల్లిస్ పాఠశాల లైసెన్స్ ని రద్దు చేయించాలని, త్రీ మెన్ కమిటీ నివేదిక వచ్చాక తగిన చర్యలు తీసుకోవాలని డిఈఓని ఆదేశించారు. ఓఎన్జిసి వారు ఐదువేల యూనిఫార్మ్స్ ఇవ్వడం జరిగిందని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టల్స్ లలో యూనిఫాం అందించేందుకు విద్యార్థులను గుర్తించాలన్నారు. మధ్యాహ్న భోజనంపై ఫిర్యాదులు వస్తే క్షేత్రస్థాయిలో డీఈవో పర్యటించాలని, స్పెషల్ డ్రైవ్ చేయాలని, సోమవారం నుంచి శుక్రవారం వరకు పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలన్నారు. ఆయా పాఠశాలల్లో అవసరమైతే ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటుకు ఎంపీ నిధులను కేటాయిస్తామన్నారు. పాఠశాలల్లో బాలికలకు సమాజంలో పరిస్థితి ఎలా ఉంది, భవిష్యత్తుపై భయాలు తొలగించేలా, వారిలో ధైర్యం నింపేలా మోటివేట్ చేయాలన్నారు. అర్హత కలిగిన వారికి పెన్షన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత ఎల్.నినో పరిస్థితులలో వరి, మిరప సాగు చేయొద్దని రైతులకు తెలియజేశామని అధికారులు తెలపగా, వచ్చే జూన్ వరకు వర్షాలు వచ్చే పరిస్థితి లేదని, మొదట త్రాగునీటికి, తర్వాత పశు గ్రాసం సాగు కోసం నీటిని అందించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎల్.నినో వేళ ఉద్యాన మొక్కలను సంరక్షించుకోవాలని, నీటి సమస్య వల్ల మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందని, వాటికి నీరు ఇచ్చేలా చూడాలన్నారు. జాతీయ రహదారి కింద రుద్రంపేట జంక్షన్ లో వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఇబ్బంది పడడం జరుగుతుందని, అక్కడ రహదారిని విస్తరించాలన్నారు. కల్లూరు ఆర్ఓబిలో ఎప్పుడు నీరు నిల్వ ఉంటుందని, రైల్వే బ్రిడ్జి కిందకు నీరు వెళ్లకుండా డైవర్ట్ చేయాలన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రోటోకాల్ పాటించాలన్నారు. ఆయా శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రస్తుత ఎల్.నినో పరిస్థితుల్లో త్రాగునీటికి నిధులను కేటాయించాలని, కమ్యూనిటీ భవనాలకు కూడా ఎంపీ నిధులను కేటాయించాలన్నారు. జిల్లా పరిషత్ నుంచి త్రాగునీటికి నిధులు కేటాయిస్తున్నామని, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపాలిటీల నుంచి యూజర్ చార్జెస్ రావడంలేదని, అవి వచ్చేలా చూడాలన్నారు. పాఠశాలలు, గురుకులాల్లో చిన్నారులకు భద్రత కరువైందని, బాలికలను ఇబ్బంది పెడుతున్న వారికి కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. పిల్లల ఆరోగ్యం, భద్రత, రక్షణ చాలా ముఖ్యమైనదని, ట్రెల్లిస్ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కంబదూరు, నార్పల, తదితర ప్రాంతాల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అమలు చేయడం లేదని, డిఈఓ క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ప్రస్తుతం టీనేజీ ప్రెగ్నెన్సీలు ఎక్కువ అవుతున్నాయని, వాటిని అరికట్టాలన్నారు. కొన్ని పాఠశాలల్లో పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయని, వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. పెన్షన్స్ కోసం దరఖాస్తు చేయడానికి సచివాలయానికి వెళ్తే అక్కడ సిస్టమ్స్ పనిచేయడం లేదని, వాటిని సరిచేయాలన్నారు. మహిళలకు బ్యాంకు లింకేజీ, రుణాల మంజూరులో సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా పరిషత్ కి 16వ ఫైనాన్స్ నిధులు రావడం లేదని, వచ్చేలా చూడాలన్నారు. ఎల్.నినో పరిస్థితులతో నష్టపోయిన వ్యవసాయ, ఉద్యాన రైతులకు సహాయం చేయాలన్నారు. ఎల్.నినో పరిస్థితిలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ దిశా సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఇంజనీరింగ్ శాఖల అధికారులు ఆయా నియోజకవర్గాల్లో పూర్తయిన పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్.నినో పరిస్థితుల నేపథ్యంలో ఉద్యాన పంటల మొక్కలను బతికించాలని ఇందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఏపీఎమ్ఐపి నుంచి నాన్ సబ్సిడీ కనెక్షన్స్ లక్ష్యం మేరకు చేపట్టాలన్నారు. మహాప్రస్థానం వాహనం కోసం డ్రైవర్ నియామకానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఆయా పాఠశాలల్లో అవసరమైన చోట అదనంగా గదులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. అందరు హెచ్ఓడీలు స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు చేపట్టాలని, ఇందులో క్షేత్రస్థాయిలో సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఓ బాలాజీ నాయక్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, డిపిఓ నాగరాజునాయుడు, డ్వామా పిడి సలీమ్ భాష, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్బరాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, పశు సంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, హౌసింగ్ పిడి శైలజ, డిఆర్డీఏ పిడి శైలజ, మైన్స్ డిడి ఆదినారాయణ, నాబార్డు ఏజిఎం అనురాధ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసరావు, మెప్మా పిడి విశ్వజ్యోతి, ఎస్సి కార్పొరేషన్ ఈడి కుముద, డిఎంహెచ్ఓ కట్ట వెంకటేశ్వర్లు, డిఎండబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి, డిటిడబ్ల్యూఓ శ్రీనివాసరావు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి అర్చన, డిఈఓ అయూబ్ హుస్సేన్, ఆర్ఐఓ వెంకటరమణనాయక్, రెడ్స్ సంస్థ భానుజా, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, డి.ఎస్.ఓ శోభారాణి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.మల్లీశ్వరి, కమిటీ మెంబర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో మార్మోగిన వినాయక నామస్మరణ.. బజరంగ్ యూత్ ఆధ్వర్యంలో ఘన వేడుకలు!



**కూకట్పల్లి : (ప్రజావాణి) సెప్టెంబర్ 16** వినాయక చవితి సందర్భంగా కూకట్‌పల్లి విలేజ్‌లో బజరంగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని మక్కపాటి రంగరాజు, సాయి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. వినాయక చవితి వేడుకలతో కూకట్‌పల్లి విలేజ్‌లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. బజరంగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.

## వినాయక పూజలో ఆధ్యాత్మిక సందడి

- మక్కపాటి రంగరాజుకు శాలువా కప్పి సత్కారం
- కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు



**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16 (ప్రజావాణి):** కూకట్‌పల్లి భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో వినాయక భక్తి బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో చౌదరి నర్సింగరావు, మక్కపాటి రంగరాజు, అర్చనపల్లి సూర్యారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చౌదరి నర్సింగరావు చేతుల మీదుగా మక్కపాటి రంగరాజుకు శాలువా కప్పి సత్కరించారు. భక్తులు, నిర్వాహకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## దక్షిణ అయోధ్య భద్రాచలం టూరిజంలో సరికొత్త ఆకర్షణ: "భద్రగిరి మార్ట్"!




**భద్రాచలం/మన ప్రజావాణి (16 సెప్టెంబర్ 26):** దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలానికి వచ్చే పర్యాటకులను ఆకర్షించడానికి భద్రగిరి మార్ట్ ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా మారుతోంది. భద్రాచలం గిరిజన సంక్షేమశాఖ పర్యవేక్షణలో నడుస్తున్న ఈ మార్ట్, స్థానిక గిరిజన సంస్కృతిని, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేస్తోంది. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు, భద్రాచలం అడవుల నుండి సేకరించిన స్వచ్ఛమైన ఉత్పత్తుల కోసం ఈ మార్ట్‌ను సందర్శిస్తున్నారు. ప్రధానంగా మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించిన చిరుధాన్యాలు, బిస్కెట్లు, ఇప్పపువ్వు లడ్డూలు, మహువా బర్ఫీ, అటవీ తేనె పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఇక్కడి స్థానిక గిరిజన జాతుల సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ, గిరిజన మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన సహజసిద్ధమైన నూనెలు, హస్తకళలు పర్యాటకులకు ప్రత్యేక జ్ఞాపకాలుగా మారుతున్నాయి. దూర ప్రాంతాల టూరిస్టుల కోసం భద్రగిరి మార్ట్ ఇప్పుడు అంతర్జాలం, వాట్సాప్ వ్యాపార ఖాతా ద్వారా ఆన్‌లైన్ ఆర్డర్లను కూడా స్వీకరిస్తోంది.

## పోషకాహార వంటకాల ప్రదర్శన.. అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహణ





**దండేపల్లి, సెప్టెంబర్ 16 (సక్రమ ప్రజావాణి):** ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9వ రాష్ట్రీయ పోషణ్ మాస ఉత్సవాల్లో భాగంగా దండేపల్లి మండలం గూడెం సెక్టార్ పరిధిలోని మేదరిపేట--1 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార వంటకాల ప్రదర్శన, మెనూ బోర్డుల ఏర్పాటు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు చేపట్టారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు, ఆరు నెలల నుంచి ఆరు సంవత్సరాల లోపు చిన్నారుల సంరక్షకులకు అనుబంధ పోషకాహార పథకం ద్వారా అందించే ఇంటికి తీసుకెళ్లే పోషకాహారంతో తయారుచేసే వంటకాల వివరాలు, తయారీ విధానాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వారపు భోజన పట్టికలు, పోషకాహార వివరాలను మెనూ బోర్డుల ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు మమత, సర్పంచ్ సీహెచ్ అనూష రాజేష్, పల్లె దవాఖానా వైద్యురాలు డాక్టర్ శ్వేత, ఏఎన్ఎం సంపూర్ణ, పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సుజాత, పుష్పలత, సుమలత, ఆయాలు సుజాత, కరుణ, ఆశా కార్యకర్త కవితతో పాటు తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 47వ ఆవిర్భావదినోత్సవం



**మన ప్రజావాణి. మంతని ప్రతినిధి.** ఈరోజు స్టాఫ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 47వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మంతిని డిపో వద్ద జెండా ఆవిష్కరించడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి డిపో సెక్రటరీ రాపెల్లి రాజయ్య అధ్యక్షత వహించగా, డిపో అధ్యక్షులు పల్లెర్ల ఆంజనేయులు జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు బూడిద గణేష్ మాట్లాడుతూ 1971 సెప్టెంబర్ 16వ తేదీన స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సంఘాన్ని స్థాపించడం జరిగింది అన్నారు. ఆ రోజుల్లో కార్మిక వర్గం అంతా రెండు శత్రు వర్గాలుగా చీలిపోయిందని, కార్మికులను ఐక్యం చేసి, హక్కులు సాధించటం కోసమే స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఆ క్రమంలోనే అనేక సందర్భాల్లో అన్ని సంఘాలను ఐక్యం చేసి, ఐక్య పోరాటాలు నిర్వహించడం జరిగిందని, కార్మికుల హక్కుల సాధన కోసం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నిరంతరం కార్మికులను చైతన్యం చేయడంతో పాటు, కార్మిక సంఘాలను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తోందని చెప్పారు. ఇటీవలి కాలంలో కార్మికులపై యాజమాన్యం విపరీతమైన పని భారాన్ని పెంచుతుందని, డ్యూటీలకు గా.ు. తగ్గిస్తోందని, రెండు రోజుల పని దినాలు కలిగిన డ్యూటీలను ఒకరోజుగా (సింగిల్ క్రూ) మార్చి వేస్తోందని, ఉన్న సర్వీసులకు అదనపు కిలోమీటర్లు జోడిస్తుందని, కార్మికులకు నష్టం చేసే విధానాలను యాజమాన్యం అనుసరిస్తుందని ఆయన మండిపడ్డారు. యాజమాన్యం పనిభారాలను ఉపసంహరించుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టడానికి వెనుకాడ బోమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వేల్పుల సురేష్ పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న గుమ్మడి రాజలింగు ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని మండల విద్యాధికారి మంత్రి రాజు అన్నారు.



**దండేపల్లి, సెప్టెంబర్ 16 (సక్రమ ప్రజావాణి):** నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న గుమ్మడి రాజలింగు ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని మండల విద్యాధికారి మంత్రి రాజు అన్నారు. బుధవారం దండేపల్లి మండలం తాళ్లపేట ప్రాథమిక పాఠశాలలో గుమ్మడి రాజలింగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా, క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మంత్రి రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు విద్యా, క్రీడా సామగ్రిని అందజేసి వారి భవిష్యత్తుకు తోడ్పాటునందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు అందించిన సామగ్రిని సద్వినియోగం చేసుకుని చదువులు, క్రీడల్లో రాణించాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కంది హేమలత--సతీష్ కుమార్, మాజీ సర్పంచ్ అడాయి కాంతారావు, సముదాయ ప్రధానోపాధ్యాయురాలు రోజీ వరకుమారి, గుమ్మడి రాజలింగు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ గుమ్మడి కిరణ్ కుమార్, శివ గణేష్ యువజన సంఘం అధ్యక్షుడు దుర్గం రవి, మడావి శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు వినయ్ రాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అడవిదేవులపల్లి ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో -వెలవెలబోతున్న హాజరు: సిబ్బంది కొరతతో

- కనీసం అంగన్వాడీ నేమ్ బోర్డు లేదు
- మొత్తం విద్యార్థులు 11మందికి 3హాజ రు
- అంగన్వాడీ సూపర్ వైజర్
- విజిటింగ్ చేయాలి అని కోరుతున్నా విద్యారి తల్లిదండ్రులు





**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం సెప్టెంబర్ 16**అడవిదేవులపల్లి ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో వెలవెలబోతున్న హాజరు: సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్న పిల్లలు అడవిదేవులపల్లి:మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రం నిర్వహణ అధ్వానంగా మారింది. కేంద్రంలో కనీసం నలుగురు పిల్లలు కూడా హాజరుకాని పరిస్థితులు నెలకొన్నాయి. ?అంగన్వాడీ హెల్పర్ (ఆయా) పోస్ట్ ఖాళీగా ఉండటంతో రోజువారీ పర్యవేక్షణ, నిర్వహణ కష్టంగా మారింది. చిన్నపిల్లలకు సహాయం చేసే ఆయా లేకపోవడంతో, అంగన్వాడీ కేంద్రానికి వెళ్లాలంటేనే పిల్లలు తీవ్రంగా జంకుతున్నారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రానికి పంపేందుకు వెనుకాడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి, ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రానికి వెంటనే హెల్పర్‌ను నియమించాలని మరియు కేంద్రంలో మౌలిక వసతులు మెరుగుపరిచి పూర్వ వైభవం తీసుకురావాలని కాలనీవాసులు, పిల్లల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు

# ఈనెల 19న కోదాడలో మెగా జాబ్ మేళా...

- యువత ఈ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.
- నెడోక ప్రకటనలో తెలిపిన జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు.



**సెప్టెంబర్ 16 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి** నిరుద్యోగ యువతకు విస్తృతమైన ఉద్యోగ అవకాశాలను కల్పించే ఉద్దేశంతో ఈ నెల 19.09.2026న కోదాడలో మెగా జాబ్ మేళా నిర్వ హించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు పాల్గొని ఉద్యోగ అవ కాశాలను అందించ నున్నాయని తెలిపారు. జిల్లాలోని చివరి సంవత్సరం విద్యార్థులు , డిగ్రీ , డిప్లొమా , ఐటీఐ , ఇతర కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు మరియు అర్హత కలిగిన ఇతర ఉద్యోగార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. మెగా జాబ్ మేళా విజయవంతం గా నిర్వహించేందుకు జిల్లాలోని విశ్వ విద్యా లయాలు , డిగ్రీ కళా శాలలు , జూనియర్ కళాశాలలు , ఐటీఐలు , ఇతర విద్యాసంస్థలు , పరి శ్రమలతో సమన్వయం చేస్తూ అభ్యర్థులను అధిక సంఖ్యలో సమీక రించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉద్యోగార్థు లకు ఒకే వేదికపై వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలను తెలుసు కునే అవకాశం లభి స్తుందని , అర్హత ఉన్న ప్రతి యువతీ యువకుడు ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేత

- పదవులను బాధ్యతగా స్వీకరించి, పార్టీకి, ప్రజలకు సేవచేసే అవకాశంగా భావించాలి.
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి:



**ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సెప్టెంబర్ 16 (ప్రజావాణి న్యూస్):** నియోజకవర్గానికి చెందిన ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, యాచారం, మంచాల మండలాలు, మరియు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, తొర్రూర్, తుర్కయంజాల్, కొంగర, కుంట్లూర్, పెద్దఅంబర్‌పేట్, ఆదిభట్ల డివిజన్లకు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులకు ఆయన అభినందనలు తెలిపారు. మంగళవారం సాయంత్రం తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి తో కలిసి నూతన అధ్యక్షులకు ఆయన నియామకపత్రాలు అందజేశారు. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతానికి నాయకులంతా ఐక్యంగా పనిచేస్తూ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, కార్యక్రమాలు గడపగడపకు తీసుకెళ్లాలని చెప్పారు. ప్రత్యర్థులు చేస్తున్న ఆరోపణలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్లు చిలుక మధుసూధన్‌రెడ్డి, గురునాథ్ రెడ్డి, పార్టీ నేతలు పాండురంగారెడ్డి, భూపతిగల్ల మహిపాల్, భాస్కరాచారి, ఈసీ శేఖర్‌గౌడ్, రాచర్ల వెంకటేశ్వర్లు, కొత్తకుర్మ శివకుమార్, ధనరాజ్ గౌడ్, కొత్తపల్లి జైపాల్ రెడ్డి, దాసు, జడల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పందుల పల్లి లో భూ సమగ్ర సర్వే



**మన ప్రజావాణి. మంథని ప్రతినిధి.** మంథని మండలం పందులపల్లిలో ఈరోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భూ సమగ్ర రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.మంథని మండల సర్వేయర్ రాజశేఖరా చారి పందులపల్లి మరియు నాగారం శివారు హద్దులు చూపించారు. అనంతరం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని పందులపల్లి శివారు చివరి మొత్తానికి హద్దులు నిర్వహించడం జరిగింది. రైతులు భూ సమగ్ర సర్వేకు సహకరించాలని రైతులను అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో కన్నాల గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ నాగారం గ్రామ సర్పంచ్ బెల్లంకొండ శ్రీదేవి సత్యనారాయణ రెడ్డి కన్నాల గ్రామ ఉప సర్పంచ్ దివ్య సంజీవరెడ్డి కన్నాల గ్రామ జిపిఓ సతీష్ అధికారులు పాల్గొన్నారులి

# మాదాపూర్ హనుమాన్ ఆలయం వద్ద గణనాథునికి ప్రత్యేక పూజలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు చీటి సత్యంరావు--జ్యోతి



**దండేపల్లి, సెప్టెంబర్ 16 (సక్రమ ప్రజావాణి):** దండేపల్లి మండలం మాదాపూర్ హనుమాన్ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు చీటి సత్యంరావు--జ్యోతి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి సమాధానాలు కలగాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో దండేపల్లి మండల మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, ఆలయ కమిటీ ఛైర్మన్ గాదె శ్రీనివాస్, ఆలయ కమిటీ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఈరోజు ఉదయం చీన్యతండ బీఆర్ఎస్ సర్పంచ్, బంజారా సేవాలాల్ మండల అధ్యక్షులు జాటోత్ హరిశ్చంద్ గణపతి నవరాత్రి ఉత్సవాల



ఈరోజు ఉదయం చీన్యతండ బీఆర్ఎస్ సర్పంచ్, బంజారా సేవాలాల్ మండల అధ్యక్షులు జాటోత్ హరిశ్చంద్ గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చిన్యా తండ గ్రామపంచాయతీలోని 100మంది ఆడపడుచులకు రూపాయలు 30 వేల విలువగల చీరలు పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా ఇనుగుర్తి మండల కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ యూత్ గణనాథునికి రూపాయలు 25 వేల విలువ గల రెండు సౌండ్ బాక్స్ లను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగులోతు కవిత, వార్డు సభ్యులు గుగులోతు బిచ్చ, అజ్మీర లక్ష్మి, ఇస్లావత్ చందులాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండ ఆడపడుచులు హరిచంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా విశ్వబ్రాహ్మణ యూత్ అధ్యక్షులు బొల్లోజు ప్రభాకరాచారి సౌండ్ సిస్టం అందించినందుకు గాను ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులే

- జిల్లా కార్యవర్గ సభ్యులు వై.ఓమయ్య.
- రైతాంగ సాయుధ పోరాట చ రిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి.
- నియోజకవర్గ కార్యదర్శి దుబాస్ రాములు.
- తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి.
- మండల కార్యదర్శి విఠల్ గౌడ్.
- కోటగిరిలో ఘనంగా తెల ంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు.





**కోటగిరి/ప్రజావాణి:**-తెలంగాణ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులే అని నిజామాబాద్ జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు వై.ఓమయ్య పేర్కొన్నారు.రైతాంగ సాయుధ పోరాట చరిత్రను రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో చేర్చాలనీ బాన్సువాడ నియోజకవర్గ సిపిఐ పార్టీ కార్యదర్శి దుబాస్ రాములు డిమాండ్ చేశారు.తెలంగాణ విలీన దినోత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలనీ కోటగిరి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు.బుధవారం కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ నలంద పాఠశాలలో మండల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మండల సిపిఐ కార్యదర్శి విఠల్ గౌడ్ అధ్యక్షతన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు.ఈ వారోత్సవాలకు నిజామాబాద్ జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు వై.ఓమయ్య,బాన్సువాడ నియోజకవర్గ సిపిఐ పార్టీ కార్యదర్శి దుబాస్ రాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11 నుండి 17వ తేదీ వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ట్లు తెలిపారు.1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ప్పటికీ,1948 సెప్టెంబర్ 17 వరకు తెలంగాణ ప్రాంతం భారతదేశంలో అంతర్భాగం కాలేదని హైదరాబాద్ సంస్థానంగా నిజాం నవాబు ఆధీనంలో ఉండేదని గుర్తుచేశారు.1946 నుండి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో లక్షలాది మంది తెలంగాణ ప్రజలను సమీకరించి నిజాం నవాబుకు వ్యతిరేకంగా,తెలంగాణ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేయాలని పోరాటం చేశామన్నారు.ఈ ప్రాంతంలో పేద రైతుల భూములను ఆక్ర మించిన పటేల్,పట్వారీలు,రజాకార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడినట్లు తెలిపారు.దొరలను గడిల నుంచి తరిమికొట్టాలి అనే నినాదాన్ని ఇచ్చిన పార్టీ సిపిఐ అని.ఈ పోరాటంలో నాల్గున్నర వేల మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు అమరులయ్యారని పేర్కొన్నారు.అంతటి చారిత్రాత్మ కమైన పోరాటాన్ని బిజెపి హిందూ,ముస్లిం పోరాటంగా చిత్రీకరించే కుట్ర చేస్తోందని మండిపడ్డారు.ఈ పోరాటంలో హిందువులతో పాటు ముస్లింలు కూడా నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమించి తమ ప్రాణాలను అర్పించారని తెలిపారు.షేక్ బందగి వేలాది మంది ప్రజలను నిజాంకు వ్యతిరేకంగా సమీకరించగా, మగ్దూం మోహినుద్దీన్ తన కవిత్వాల ద్వారా ప్రజలను చైతన్యం చేశారని కొనియాడారు.రావి నారాయణ రెడ్డి,బద్దం ఎల్లారెడ్డి,పుచ్చలపల్లి సుందరయ్య లాంటి అనేక మంది వీరులు పోరాడగా దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ లాంటివారు రజాకార్ల చేతిలో ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు.చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విలీన దినోత్సవం నిర్వహించాలని అలాగే పాఠ్యపుస్తకాల లో రైతాంగ సాయుధ పోరాట చరిత్రను చేర్చాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు నల్ల గంగాధర్,కొట్టే ప్రసాద్,వీరేశం,కే.రాజు, శంకర్,కప్ప సాయిలు,మండల పరిధి లోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈనెల 19న నిజామాబాద్‌లో మాదిగ మహిళా సమాఖ్య జిల్లా సదస్సు

- సందీప్ గార్డెన్స్‌లో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలి.
- కులమతాల కు అతీతంగా మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలి.
- సదస్సు అనంతరం నూతన జిల్లా కమిటీల ఎన్నిక.
- మహిళ లపై లింగవివక్ష,అసమానతలపై పోరుకు సిద్ధం కావాలి.
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ మాదిగా.



**కోటగిరి/ప్రజావాణి:**-ఈ నెల 19న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సందీప్ గార్డెన్స్‌లో జరగనున్న మాదిగ మహిళా సమాఖ్య,మహాజన మహిళా మండలి జిల్లా సదస్సును విజయవంతం చేయాలని,మహిళలపై లింగవివక్ష, అసమానతలపై పోరుకు సిద్ధం కావాలని మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్ముటు పద్మ మాదిగ పిలుపునిచ్చారు.బుధవారం కోటగిరి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో కోటగిరి, పోతంగల్ మండలాల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొండాపురం పోశట్టి మాదిగ, నేర్రోల్ల అశోక్ మాదిగ అధ్యక్షతన సదస్సుకు సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న లింగవివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నూతన ఉద్యమానికి మహిళలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే నిజామాబాద్‌లో జిల్లా మహిళా సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ జిల్లా సదస్సు అనంతరం మాదిగ మహిళా సమాఖ్య,మహాజన మహిళా మండలి నూతన జిల్లా కమిటీలను ఎన్నుకుంటామన్నారు.కావున జిల్లాలోని మాదిగ మహిళలు కులమతాలకు అతీతంగా మహాజన మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జాతీయ పొలిట్ బ్యూరో నాయకురాళ్లు సత్తక్క మాదిగ,పెద్దొల్ల యమున మాదిగ,కన్నూరు సుధ మాదిగ, బాన్సువాడ నియోజకవర్గ మాజీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు సోంపూర్ పోచారం మాదిగ,కోటగిరి గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు హెచ్.లాలయ్య మాదిగ,ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు కన్నం శ్రీనివాస్,పేగు లాలయ్య,ఏ.సాయిలు, హెచ్.శ్రీకాంత్,జండా దినేష్,యాద్గాపూర్ కృష్ణ,పి.సుధాకర్, బి.సాయిరాం,బి.దత్తు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రజెండా నీడలో.. పోరాట చరిత్ర

- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి
- ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కన్నం వెంకన్న





**చెన్నారావుపేట సెప్టెంబర్ 16 ప్రజావాణి** తెలంగాణ గడ్డపై భూమి, భుక్తి,వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన రైతాంగ సాయుధ పోరాటం త్యాగాల చరిత్ర అని ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కన్నం వెంకన్న అన్నారు. ఆ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిస్తూ బుధవారం మండల కేంద్రంలోని పాపయ్యపేటలో మండల కార్యదర్శి జన్ను రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో పోరాటయోధుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. 1946 సెప్టెంబర్ 11 నుంచి 1951 అక్టోబర్ 21 వరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రజా ఉద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో నాటి పోరాటంలో రైతులు,కూలీలు, చేతి వృత్తిదారులు, బడుగు బలహీన వర్గాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం తదితరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. నాటి పోరాట ఘట్టాలను వక్రీకరణకు తావు లేకుండా భావితరాలకు చేరేలా ప్రభుత్వం పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పెరమండ్ల ఎల్లగౌడ్, ముర్రి శ్రీనివాస్ , ఎండి గోరెమియ , విద్యార్థి సంఘ నాయకులు పెరుక వంశీ, తిక్క ప్రకాష్ జన్ను హరిబాబు గ్రామ నాయకులు,మెతుకు పెల్లి రాజిరెడ్డి, బుడిగే నాగయ్య, కన్నం శోభ, తిక్క యాకయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యం కోసమే మెగా హెల్త్ క్యాంప్

- సర్పంచి అశోక్ కుమార్
- సాయిరాం గ్యాస్ట్రో, లివర్ సెంటర్ ఆధ్వర్యంలో
- హనుమాన్ నగర్ తండాలో ఉచిత హెల్త్ క్యాంప్





**ప్రజావాణి,నెల్లికుదురు:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం హనుమాన్ నగర్ తండా సర్పంచి గుగులోతు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ మెగా వైద్య శిబిరం ఖమ్మంలోని ప్రముఖ గ్యాస్ట్రో, లివర్ సెంటర్ గా గుర్తింపు పొందిన సాయిరాం హాస్పిటల్స్, జంగాల రాజేశ్వర్రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ సహకారంతో విజయవంతంగా నిర్వహించారు.ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ గుగులోతు అశోక్ కుమార్ మాట్లాడుతూ.. పేదలకు అతితక్కువకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సాయిరాం హాస్పిటల్స్ అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరంలో గ్యాస్ట్రో, లివర్, ఉదరకోశ వ్యాధులకు సంబంధించిన సమస్యలతో పాటు కిడ్నీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, సర్జికల్ గ్యాస్ట్రో, గ్యాస్ట్రో మెడిసిన్, ఆంకాలజీ, కార్డియాలజీ, అంకాలజీ, డయాబెటిక్, సైనస్, ఆప్తమాలజీ, జనరల్ సర్జన్, డెర్మటాలజీ, తదితర విభాగాలకు చెందిన గుర్తింపు పొందిన వైద్యులు పాల్గొని 120 మంది రోగులకు ఉచితంగా పరిక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జంగాల రాజేశ్వర్రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ద్వారా,సాయి రామ్ హాస్పిటల్స్ వారు ఎండి డిఎం డా. జంగాల సునీల్ కుమార్ జంగాల, డా.స్వాతి జంగాల,సాయిరామ్ హాస్పిటల్,సహకారంతో డా. ప్రశాంతి, డా.తబస్సుమ్,జంగాల రాజేశ్వర్రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ డైరెక్టర్ సామ్యూల్ గెద్దం,నర్సులు,ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ స్టాఫ్ ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు.

# అమర ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి

- పుస్తకాల విడుదలను నిలిపివేయాలని ప్రజాసంఘాల నాయకుల వినతి



**ఉమ్మడి రంగారెడ్డి. (ప్రజావాణి )మంచాల, సెప్టెంబర్ 16:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అవాస్తవ, అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని ఆరోపిస్తూ అమర ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం. మంచాల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా దేశానికి అందించిన సేవలను వక్రీకరించేలా అమర ప్రసాద్ రచించినట్లు పేర్కొంటున్న పుస్తకాలను ప్రభుత్వం విడుదల కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్‌ను కించపరిచేలా, ఆయన చరిత్రను వక్రీకరించేలా ఎలాంటి ప్రచారం జరిగినా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగం దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కల్పించిందని వారు పేర్కొన్నారు. గతంలో అణగారిన వర్గాలు విద్య, సామాజిక హక్కులకు దూరంగా ఉన్న పరిస్థితుల నుంచి నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో గౌరవంగా జీవించే స్థాయికి రావడానికి రాజ్యాంగం కీలక పాత్ర పోషించిందన్నారు. రాజ్యాంగ విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాయకులు తెలిపారు. రాజ్యాంగం, అంబేద్కర్‌పై తప్పుడు ప్రచారం జరిగితే ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, అభ్యుదయవాదులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ అంశంపై స్పందించి, పుస్తకాల విడుదల విషయంలో తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# అంబేద్కర్ యూనివర్సిటీ లో ఉద్యోగ-ఉపాధి అవకాశాల కోసం నూతన కోర్సులు...

- విద్యా ఉపాధి అవకాశాల గోడ పత్రికను ఆవిష్కరణ.
- మహిళా పారి శ్రామికవేత్తల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక.
- డాక్టర్ బి. ధర్మ నాయక్ యునివర్సిటీ ఎడ్యుకేషన్ ఎక్స్టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి.





**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ 16 జిల్లా ప్రతినిధి** విద్యను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యా లను , స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధునిక అవసరాలకు అనుగుణం గా నూతన కోర్సులు , విద్యా విధానాలను అమలు చేస్తోందని విశ్వ విద్యాలయ ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ బి. ధర్మ నాయక్ అన్నారు. మంగళవారం రోజు భువనగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళాశాల అధ్యయన కేంద్రంలో కౌన్సిలర్ల సమావేశంలో పాల్గొని అంబేద్కర్ యునివర్సిటీ విద్యా , ఉపాధి అవ కాశాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మానాయక్ మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరానికి బీఏ , బీకాం , బీఎస్సీ , పీజీ , మరియు డిప్లొమా , సర్టిఫికెట్ తదితర కోర్సు ల్లో నూతన ప్రవేశాలు కొనసాగుతున్నాయన్నారుఅర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30 లోగా దర ఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో విద్యార్థులు తమకు అనుకూలమైన సమయంలో చదువుకునే అవకాశం ఉంటుం దన్నారు. ఆదివాసీలకు , ట్రాన్స్ జెండర్ లకు, దివ్యాంగులకు ఎలాంటి ఫీజు లేకుండా ఉన్నత విద్య చదువుకునే అవకాశం వుందని ఆయన తెలిపారు. ఉద్యోగ , ఉపాధి అవకాశాలకు అను గుణంగా నూతన కోర్సులు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి ఆధ్వర్యంలో మారుతున్న కాలానికి , ఉద్యోగ , ఉపాధి అవ కాశాలకు అనుగుణంగా నూతన కోర్సులను రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. యూజీ , పీజీ కోర్సులతో పాటు డిప్లొమా , సర్టిఫి కెట్ , నైపుణ్యాధారిత కోర్సులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. సాంకేతికతను వినియో గించాలని విద్యను మరింత సులభతరం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. మహిళా విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాల పై శిక్షణ , మహిళా విద్యార్థుల్లో వ్యాపార ఆలోచనలను ప్రోత్సహించి , వారిని భవిష్యత్ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు బిఆర్ఏఓయూ--వీ హబ్ సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతు న్నట్లు ఆయన తెలిపారు. "మీ ఆలోచనను వ్యా పారంగా మార్చండి. మేము మీకు సహాయం చేస్తాము" అనే నినాదం తో రూపొందించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు వ్యా పారాభివృద్ధి , ఆవిష్కరణలు , నైపుణ్య శిక్షణ , మార్గదర్శకత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్దులకు ఉన్నత చదువుతోపాటు ఉద్యోగ , ఉపాధి అవ ఎకకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డాక్టర్ ధర్మ నాయక్ తెలిపారు. ఇప్పటికే టీసీఎస్ , ఐకాన్, రామానంద తీర్థ ఇన్స్టిట్యూట్ , రాశి , వి-హబ్ వంటి సంస్థలతో ఉద్యోగ , ఉపాధి అవకాశాల కల్పనకు ఒప్పందాలు కుదుర్చు కున్నట్లు గుర్తుచేశారు. అలాగే ఈ విద్యా సంవత్సరం నుండి మన కళాశాలలోనే సైన్సు ప్రాక్టికల్ తరగతులు నిర్వహించబడుతాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. శ్రీనివాస్ , కో-ఆర్డినేటర్ డాక్టర్ రమేశ్ గంజి , జాట్కో బొజ్జ బాలయ్య , అధ్యయన కేంద్ర కౌన్సిలర్లు డాక్టర్ బోడ జగన్నాథ్ , పన్నాల బాల్ రెడ్డి , ఎన్. సుధ , కనక బాలరాజు , పాండురంగం, ఆసిఫ్ అలీ , లింగ మూర్తి , అతర్ ఫరీన్ , రత్నపురం బాలరాజు , లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రజాకార్ల నరమేధానికి "బైరాన్ పల్లి"బురుజు సజీవ సాక్షి

- నేడు తెలంగాణ విమోచన దినోత్సవం







**మద్దూరు సెప్టెంబర్ 16, ప్రజా వాణి,**బైరాన్ పల్లి ఈ ఊరు పేరు తెలియని వారు ఉండరు.నిజాం పాలనలో రాజాకార్లను ఎదురొడ్డి పోరాడిన గ్రామం,ఫలితంగా రజాకార్లు దొరికిన వారిని దొరికినట్టు చంపి గ్రామంలో రక్తం ఏరులై పారేలా చేశారు. నిజాంకాలం నాటి దురాగాతాలు సంవత్సరానికి ఒకసారి గుర్తు చేస్తూనే ఉంటాయి. నేడు తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా అప్పటి పోరాటాన్ని గుర్తు చేసుకునేందుకు బైరాన్ పల్లి బురుజు సజీవ సాక్షిగా నిలిచింది.ఈ సందర్భంగా గ్రామస్తులు,యువకులను ఊచకోత కోసిన రజాకార్లు గ్రామంలోని బురుజు వద్ద మహిళలతో శవాల చుట్టూ నగ్నంగా బతుకమ్మ ఆడించారు. గ్రామంలో శవాలు గుట్టలు గుట్టలుగా పొగయ్యాయి, ఆ సమయంలో బైరాన్ పల్లి ప్రజలు రజాకార్లతో విరోచితంగా పోరాడారు.నిజాం రజాకారుల దాడులు పెరిగిపోతున్న సమయంలో కమ్యూనిస్టుల సహకారంతో దాడులను ఎదురించేందుకు శిక్షణ పొందిన యువకులంతా గ్రామ రక్షణ దళంగా ఏర్పడి పోరాటానికి సిద్ధమయ్యారు. నిజాం రజాకర్ల నాయకుడు అప్పల్ సాబ్ గ్రామస్తుల చేతిలో మరణించ డంతో గ్రామాన్ని ఎలాగైనా ధ్వంసం చేయాలని కంకణం కట్టుకున్న రజాకార్లు గ్రామంపై ఐదు సార్లు దాడి చేసి విఫలం అయ్యారు.1948 ఆగస్టు ఆఖరి వారంలో పోలీసులు మిలటరీ సహాయంతో పెద్ద ఎత్తున దాడికి దిగారు.రాత్రి 12 గంటలకు జనగామ నుండి 10 ట్రక్కుల్లో బయలుదేరి రాత్రి మూడు గంటల వరకు బైరాన్ పల్లి గ్రామ పొలిమేరలోకి చేరుకున్న రజాకార్లు తర్వాత ఊర్లోకి చొరబడి దొరికిన వారిని దొరికినట్టు చంపారు. గ్రామంలోని ప్రతి వ్యక్తి వారి శక్తి మేరకు రజాకారులతో పోరాడారు. గ్రామంలోని బురుజు పైనుండి ఎదురు కల్పులు జరుపుతున్న సమయంలో రజాకార్లు బురుజు పై ఉన్న మందు గుండుపై గురి చూసి కొట్టడంతో వారు కొందరు మరణించగా కొందరు గాయాలపాలు అయినారు. ఆ దాడిలో బైరాన్ పల్లి గ్రామస్తులు 98 మంది మర ణించారు.ఆడవాళ్ళను కొందరిని చెరిపేసి మరికొందరిని నగ్నంగా శవాలచుట్టూ బతుకమ్మ ఆడించారు.తెలంగాణ రజాకార్లనుండి విమోచన పొందడంలో బైరాన్ పల్లి పోరాట పాత్ర గొప్పదని తెలిపారు.

# దాతల సహకారంతో దేవాలయాల అభివృద్ధి



**గరిడేపల్లి, సెప్టెంబరు 16(ప్రజావాణి )**దాతల సహకారంతో దేవాలయాలు మరింత అభివృద్ధి సాధిస్తాయని గరిడేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు త్రిపురం అంజన్ రెడ్డి అన్నారు.గరిడేపల్లి మండల కేంద్రంలోని పాండవుల వారి గుడి వద్ద బుధవారం గ్రామానికి చెందిన కర్నె అరుణ--లక్ష్మీనారాయణ దంపతులు సుమారు రూ.15 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన బోరును త్రిపురం అంజన్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా అంజన్ రెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో దేవాలయాల అభివృద్ధికి చేయూత లభించడం అభినందనీయమన్నారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దాతలు ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో గరిడేపల్లి సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ--చంద్రయ్య గౌడ్. రెండో వార్డు సభ్యులు కర్నె అరుణ--లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకపోతుల అఖిల్, గరిడేపల్లి యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కానుగు అనిల్, మత్స్య సహకార సంఘం చైర్మన్ చామకూరి దశరథ్, వైస్ చైర్మన్ ప్రధాని వెంకన్న, డైరెక్టర్ ప్రధాని అమరయ్య, కుల పెద్దమనిషి చామకూరి హరీష్, లింగం నాగయ్య, చామకూరి అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖబర్దార్ హమారా ప్రసాద్

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమిగారి రాజేందర్



**చేర్యాల సెప్టెంబరు 16 ప్రజావాణి** ప్రపంచంలోనే అత్యున్నతమైన భారత రాజ్యాంగం రచించినటువంటి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారిని కల్పిత నాయకుడు అని అనుచిత వ్యాఖ్యలతో పుస్తకం వ్రాసిన హమారా ప్రసాద్ దళిత ద్రోహి ఈరోజు అంబేద్కర్ గారిని అవమానపరచాడమంటే కేవలం అది అంబేద్కర్ గారికి సంబంధించినది కాదు ఈ దేశ 140 కోట్ల మంది ప్రజల మనోభావాలను కించపరచినటువంటి హమారా ప్రసాదు 24 గంటల్లోపు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమి గారి రాజేందర్ అన్నారు బుధవారం చేర్యాల పట్టణ కేంద్రంలో వారు మాట్లాడుతూ అమ రా ప్రసాద్ రాసిన పుస్తకాన్ని విడుదల చేయకుండా నిలిపివేసి ముద్రించబడినటువంటి బుక్కులన్నీ స్వాధీనం చేసుకొని హమారా ప్రసాదును 24 గంటల్లోగా అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని హమారా ప్రసాద్ ను అరెస్టు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో కలెక్టర్ల ఆఫీసుల ముందు నిరసన తెలియజేస్తూ వినతి పత్రాలు సమర్పిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భూమిగారి రత్నం. కర్ణాకర్ . పాకాల అనిల్. శ్రీరామ్. సంజీవులు.మల్లిగారి వినయ్. విజయ్. మహేష్ తదితరులు పాల్గొన్నారు

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

- లక్ష్మీపూర్ హెచ్‌ఎం ఎం.డి. షాదుద్దీన్‌కు సర్పంచ్, గ్రామస్తుల అభినందనలు



**బెజ్జంకి, సెప్టెంబర్ 16 (ప్రజావాణి)** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.డి. షాదుద్దీన్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న సందర్భంగా సర్పంచ్ ముక్కిస కవిత రత్నాకర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సృజనాత్మకతను పెంపొందించేలా షాదుద్దీన్ చేస్తున్న కృషిని సర్పంచ్ అభినందించారు. పాఠశాల ఆవరణలో కూరగాయల సాగు, గోడలపై వర్ణమాల, చిత్రాలు వేయడం, ఆటపాటల ద్వారా విద్యార్థులను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు.ఈ సందర్భంగా షాదుద్దీన్ మాట్లాడుతూ.. బెజ్జంకి మండలంతో తనకు 20 ఏళ్ల అనుబంధం ఉందని, లక్ష్మీపూర్ నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడం ఎంతో గర్వంగా, సంతోషంగా ఉందన్నారు. గ్రామ ప్రజలు చూపిన ఆత్మీయ అభిమానాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంగాధర హరీష్, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముత్తంగి వద్ద మృత్యు ఘోష!

- ఓఆర్‌ఆర్ బ్రిడ్జి కింద బస్సు ఢీ..
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 16 (ప్రజావాణి):**ముత్తంగి గ్రామ శివారులోని ఓఆర్‌ఆర్ బ్రిడ్జి కింద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 15న రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో 30--35 ఏళ్ల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న టీజీ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది.టీజీ 35 జెడ్ 0061 నంబర్ గల బస్సును వెంకటాపూర్‌కు చెందిన పెద్దోళ్ల శంకరయ్య, తండ్రి దుర్గయ్య నడుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో వ్యక్తికి తలకు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 16న ఉదయం సుమారు 5:30 గంటలకు మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతుడిని గుర్తించే వారు లేదా ప్రమాదానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌ను(8712661839) సంప్రదించాలని పోలీసులు కోరారు.

# అంబేద్కర్‌పై పుస్తకాన్ని ఖండించిన బీఎస్పీ

- హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్





**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం: (ప్రజా వాయిస్) సెప్టెంబర్ 16** తుర్కయంజల్: డా. బీఆర్ అంబేద్కర్‌పై "కల్పిత నాయకుడు" పేరుతో పుస్తకం రాస్తున్న హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. తుర్కయంజల్ మున్సిపాలిటీ మాజీ ఉపాధ్యక్షుడు లపంగి రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు, న్యాయవాది పట్నం రమేష్ కురుమ మాట్లాడారు.అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారా దేశంలోని అన్ని వర్గాలకు హక్కులు, రక్షణ లభిస్తున్నాయని, రాజ్యాంగ నిర్మాతను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. అనంతరం హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేసి, ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎస్. రమేష్, మల్లెల రఘు, భూతం రమణ, గుడ్ల తిరుమలేశ్, అమరవరం రవికుమార్, ప్రసాద్, కృష్ణ, భాస్కర్, శ్రీకాంత్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# మొయినాబాద్‌లో బీఆర్‌ఎస్‌కు మరింత బలం

- సబితా ఇంద్రారెడ్డి గారి సమక్షంలో 5వ వార్డు సభ్యురాలు కుమ్మరి సరోజ రమేష్‌తో పాటు కాంగ్రెస్ నాయకుల చేరిక



**మొయినాబాద్:** మండలంలోని తోలుకట్ట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన 5వ వార్డు సభ్యురాలు కుమ్మరి సరోజ రమేష్, నాయకులు మొండ్ర వెంకటయ్య, జబ్బార్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గారి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో వారు బీఆర్ఎస్ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి గారు నూతనంగా పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానించి అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.కుమ్మరి సరోజ రమేష్, మొండ్ర వెంకటయ్య, జబ్బార్ బీఆర్ఎస్‌లో చేరడంపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతనంగా పార్టీలో చేరిన వారితో కలిసి పనిచేస్తామని తెలిపారు. పార్టీలో చేరిన వారు కూడా పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీహరి, సీనియర్ నాయకులు అనంతరెడ్డి, బోడ బిక్షపతి, బోడ భాస్కర్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు క్రమశిక్షణ పెంపొందించుకోవాలి..హెచ్ఎం బొమ్మెర సతీష్



**చెన్నారావుపేట సెప్టెంబర్ 16 ప్రజావాణి** విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నతమైన ఆశయాలను ఏర్పరచుకుని, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారని పాపయ్యపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొమ్మెర సతీష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పాపయ్యపేట నాయక్‌పోడు కాలనీ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) లో బుధవారం స్థానిక మహిళా సమాఖ్య సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా రెండు జతల ఏకరూప (యూనిఫామ్) దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.?ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వం మరియు స్థానిక సంస్థలు కల్పిస్తున్న విద్యావసతులను ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడలు, ఇతర సృజనాత్మక విభాగాల్లో పాఠశాల పేరు ప్రఖ్యాతులు సాధించేలా ముందంజలో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జాటోతు పద్మ, మహిళా సమాఖ్య సభ్యులు స్వరూప, ఎస్.కే. శివ పార్వతి, కల్పనలతో పాటు స్థానిక గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తికి దాతల చేయూత

- జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్సుల పంపిణీ
- చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి: ప్రధానోపాధ్యాయులు



**చిలుకూరు, సెప్టెంబర్ 16 (ప్రజావాణి):** ఆచార్యులగూడెం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్సుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వైజాగ్ వాస్తవ్యులు, దాత మల్ల ప్రగడ రామారావు మిత్రులు అందజేసిన స్పోర్ట్స్ డ్రస్సులను గ్రామ మహాదాత మైలారిశెట్టి చిన్న యలమందయ్య చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు.విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారు క్రీడల్లో మరింత చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు ఈ స్పోర్ట్స్ డ్రస్సులను అందించిన దాతలకు పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.విద్యార్థులు దాతలు అందించిన స్పోర్ట్స్ డ్రస్సులను సద్వినియోగం చేసుకుని విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇనుగుర్తి ప్రెస్ క్లబ్ కమిటీకి బిజెపి ఘన సన్మానం



**ప్రజావాణి, ఇనుగుర్తి:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కమిటీకి బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సత్కార కార్యక్రమం మండల కేంద్రం ఇనుగుర్తి లోని వద్ది రాజు నారాయణ మెమోరియల్ పార్కులో బుధవారం నిర్వహించారు.ఈసందర్భంగా ప్రెస్ క్లబ్ మండలాధ్యక్షులు కుంభం మహేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కమిటీ ఉపాధ్యక్షులు షేక్ యాకూబ్ పాషా, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్, కోశాధికారి జాటోత్ సంతోష్, సంయుక్త కార్యదర్శి కూటి కంటి మధు గౌడ్ లకు బొకేలు అందజేసి శాలువాలతో సత్కరించారు సత్కరించారు.ఈ సందర్భంగా దుంపల సందీప్ మాట్లాడుతూ మండలంలో నూతనంగా ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వాలకు,ప్రజలకు, వివిధ రాజకీ యపక్షాలకు విమర్శలు సద్విమర్శలతో వారధులుగా ఉంటూ చైతన్య పరుస్తూ, సమస్యలను వెలుగులోకి తెస్తూ వార్తలు ప్రచురించడంలో కీలక భూమిక పోషించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు పోలేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శిలు వల్లముల రాజేందర్, కుల్ల వెంకన్న, బిజెపి గ్రామ పార్టీ అధ్యక్షులు కల్సాని ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల నాయకులు మందుల బాబు, యువ మోర్చా మండల నాయకులు సందీప్ పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత మంథనికి సహకరించాలి

- మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్





**మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 16, ప్రజావాణి:** పట్టణాన్ని పరిశుభ్రంగా, ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ కోరారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా మంథని మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు కూచిరాజ్‌పల్లి దీజ కాలనీ, SC కాలనీ, డబుల్ బెడ్‌రూమ్ ప్రాంతాలు, శ్రీరామ్‌నగర్‌లోని పలు వీధులను బుధవారం ఆయన పరిశీలించారు.రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్త, మురికి కాలువల్లోని వ్యర్థాలు, పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలను పరిశీలించిన చైర్మన్.. పారిశుధ్య సిబ్బందితో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక శుభ్రత పనులు చేపట్టించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కమిషనర్ ఎన్. మనోహర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాల సందర్భంగా నిర్వహించే భోజన కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను వినియోగించకుండా పర్యావరణహిత వస్తువులను ఉపయోగించాలని సూచించారు. మోదుగు ఆకులతో తయారు చేసిన విస్తర్లను వినియోగించాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు భాగస్వాములు కావాలని, ప్లాస్టిక్ రహిత మంథని నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అలారం, ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. ఎన్నికల సామాగ్రి భద్రత అత్యంత ముఖ్యమని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు.

జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ.



రాజు, ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్, ఎన్నికల డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బి. వేణుగోపాల్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, సిపిఐ (ఎం) పార్టీ



ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు, తదితరులు ఉన్నారు.

# భూ రీ-సర్వేకు క్షేత్రస్థాయి భూమే ప్రమాణికం...!

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వేకు క్షేత్రస్థాయిలో ఉన్న భూమే ప్రామాణికమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. రైతులు, భూ యజమానుల సమక్షంలో రోవర్, ట్యాబ్ తదితర ఆధునిక సాంకేతిక పరికరాలతో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే విధానం, ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ రైతులతో నేరుగా మాట్లాడి భూ రీ-సర్వే ఉద్దేశ్యం, చేపడుతున్న ప్రక్రియపై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలు, అనుమానాలను అడిగి తెలుసుకుని, వాటిని నివృత్తి చేశారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి అపోహలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే ప్రతి అంశాన్ని పరిశీలించి నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ భూమి ఉండి పట్టాదారు పాస్‌బుక్‌లు లేని వారు, పట్టాదారు పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి వివరాలకు రికార్డుల్లోని వివరాలకు పొంతన లేని వారు, అలాగే రికార్డుల్లో భూమి వివరాలు నమోదు కాని సందర్భాలను రీ-సర్వే ద్వారా గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు.పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదైన విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణం మధ్య తేడా ఉందా లేదా అనే విషయాన్ని



చుట్టుపక్కల రైతుల సమక్షంలో కొలతలు నిర్వహించి నిర్ధారించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో పంచనామా నిర్వహించి వివరాలను నమోదు చేయాలని, విస్తీర్ణంలో ఎక్కువ లేదా తక్కువ ఉన్నట్లయితే అందుకు గల కారణాలను పూర్తిగా పరిశీలించి, సంబంధిత భూ యజమానికి వివరాలను తెలియజేసి, నిబంధనల ప్రకారం వారి సమ్మతిని నమోదు చేయాలని అన్నారు.ప్రతి భూ రీ-సర్వే సమయంలో సంబంధిత రైతుల వద్ద ఉన్న పట్టాదారు పాస్‌బుక్‌లు, పాత పహాణీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, సాగుకు సంబంధించిన ఇతర ఆధారాలను పరిశీలించి అవసరమైన వివరాలను సేకరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సర్వే నోటీసు అందించినట్లు రసీదు తీసుకోవడం, ఫోటోలతో కూడిన పంచనామా రూపొందించడం, ఆధార్, మొబైల్ నంబర్ వంటి వివరాలను



నమోదు చేయడం వంటి ప్రక్రియలను తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, సర్వే నంబర్లు, పట్టాదారు వివరాలను పాత రికార్డులతో సరిపోల్చి ఖచ్చితంగా నమోదు చేయాలని అన్నారు. ఏ ఒక్క అర్హుడి భూమి వివరాలు కూడా రీ-సర్వేలో తప్పిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.రికార్డుల్లో ఉన్న వివరాలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు మధ్య ఉన్న విస్తీర్ణ తేడాలను సాంకేతికంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. మ్యాప్‌లు, సర్వే నంబర్లు, క్షేత్రస్థాయి కొలతలను సమన్వయం చేసి భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా పక్కా రికార్డులను రూపొందించాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ వినేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తిలో శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన

**మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 16, ప్రజావాణి:** పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ (ఐపీఎం), అంతర పంటల సాగు, పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు గజులపల్లిలో ఫార్మ్ స్కూల్ (పొలం బడి) నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఐపీఎం కిట్లు, అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్‌లను పంపిణీ చేశారు.మండల వ్యవసాయ అధికారి డా. నవ్య మాట్లాడుతూ.. పత్తిలో అంతర పంటల సాగుతో కలిగే ప్రయోజనాలు, నేల సార పరిరక్షణ, ఐపీఎం పద్ధతులతో చీడపీడల నియంత్రణపై వివరించారు. పంటను క్రమం తప్పకుండా పరిశీలించి, పురుగుల ఉధృతిని బట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రసాయన మందులను



అవసరమైనప్పుడు మాత్రమే సూచించిన మోతాదులో వినియోగించాలని తెలిపారు.కేవీకే శాస్త్రవేత్త డా. భాస్కర్‌రావు విత్తనాల ఎంపిక, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, పంట సంరక్షణ పద్ధతులపై సూచనలు ఇచ్చారు. డా. కిరణ్ మొక్కల ఆరోగ్యకరమైన పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలను వివరించగా, డా. వెంకన్న రైతులకు పలు సూచనలు చేశారు.గ్రామ సర్పంచ్ కరెంగుల సుధాకర్ మాట్లాడుతూ.. శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించడం ద్వారా దిగుబడులు పెంచడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చన్నారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు హారిక, ప్రత్యూష, సౌమ్య, కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి చర్యలు వేగవంతం చేయాలి

- ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ పునరావాస పయోజనాలు కల్పించాలి.
- జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు.
- జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నథ్ కేకన్ ఐపీఎస్.

**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):**-లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ పునరావాస ప్రయోజనాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు సంబధిత అధికారులను ఆదేశించారు.బుధవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి సంబంధించి జిల్లా



స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక సహాయం, ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు, ఉపాధి అవకాశాలు తదితర పునరావాస ప్రయోజనాలు కల్పించే అంశాలపై సమగ్రంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించి, అవసరమైన తదుపరి చర్యలపై నిర్ణయాలు తీసుకున్నారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి పునరావాస ప్రయోజనాలు సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దరఖాస్తులు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పునరావాస ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జీ, ములుగు డీఎస్పీ రవీందర్, జిల్లా అధికారులు రామ్మోహన్, రవీందర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వాన్ని చాటుకున్న ప్రెస్ క్లబ్ : నిరుపేద కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ



**కోదాడ, సెప్టెంబర్ 16/ ప్రజావాణి** కోదాడ పట్టణంలోని పోలీస్ స్టేషన్ ప్రక్కన చెరువు కట్ట బజారులో వున్న ఎండి రహమత్ వెన్నుపూస సమస్య, అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఒక నిరుపేద ఇంటి యజమాని కుటుంబానికి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో, దాతలు మేళ్లచెరువు గ్రామానికి చెందిన ఎస్టిఆర్ బాలు, కోదాడ పట్టణంలోని రామాలయం గుడి అర్చకులు కాండూరి వంశీకృష్ణ చార్యుల సహకారంతో నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు.తీవ్ర అనారోగ్యం కారణంగా ఎండి నుస్రత్ కుటుంబ యజమాని ఉపాధి కోల్పోయి, కుటుంబ పోషణ భారంగా మారిన విషయాన్ని ప్రెస్ క్లబ్ సభ్యులు గుర్తించారు. ఈ క్రమంలో దాతల సహాయాన్ని కూడగట్టి, ఆ కుటుంబానికి అండగా నిలిచారు. వారికి నెల రోజులకు సరిపడా బియ్యం (రైస్) తో పాటు వంట నూనె, పప్పులు, కారం, ఉప్పు వంటి వివిధ రకాల కిరాణా సరుకులను ప్రెస్ క్లబ్ ప్రతినిధులు స్వయంగా వెళ్లి అందజేశారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం అంజి మాట్లాడుతూ.. సమాజంలో కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం అందరి బాధ్యతని, అనారోగ్యంతో ఉన్న ఆ కుటుంబానికి తమ వంతు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. తమ పిలుపునకు స్పందించి సరుకుల పంపిణీకి సహకరించిన దాతలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో తమకు సరుకులు అందించి ఆదుకున్నందుకు ఎండి రహమత్ నిరుపేద కుటుంబ సభ్యులు ప్రెస్ క్లబ్ ప్రతినిధులకు, దాతలకు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు చెప్పుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోదాడ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బాణాల అబ్రహము ప్రధాన కార్యదర్శి బండారు నాగరాజు కోశాధికారి నూరుద్దీన్ కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, జగన్మోహన్రావు, రహీం, వెంకటేశ్వర్లు, రమేష్, గోపీచంద్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు చేరువలో.. మోడల్ రైతుబజార్!

- ఆదివారం నుంచే విక్రయాలు ప్రారంభించాలి.. ఆదర్శ్‌రెడ్డి సూచన
- పెండింగ్ పనులు పూర్తి చేసి అన్ని షాపులను అందుబాటులోకి తేవాలి: సింధు ఆదర్శ్‌రెడ్డి





**భారతీనగర్, సెప్టెంబర్ 16 (ప్రజావాణి):** భారతీనగర్ డివిజన్ బాంబే కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మోడల్ రైతుబజార్ షాపుల ప్రారంభ కార్యక్రమం జరిగింది. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్‌రెడ్డి, భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి, అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా షాపుల కేటాయింపుదారులతో ఆదర్శ్‌రెడ్డి మాట్లాడారు. కొన్ని మౌలిక సదుపాయాల పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ప్రజలకు రైతుబజార్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఆదివారం నుంచే కూరగాయలు, పండ్లు, నాన్‌వెజ్ తదితర సరుకుల విక్రయాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని షాపుల కేటాయింపుదారులను కోరారు. అదేవిధంగా రైతుబజార్‌లో మిగిలి ఉన్న షాపులకు టెండర్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి, అన్ని షాపులను వినియోగంలోకి తీసుకురావాలని సింధు ఆదర్శ్‌రెడ్డి అధికారులను కోరారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పెండింగ్ మౌలిక సదుపాయాల పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

రైతుబజార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే భారతీనగర్, బాంబే కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. కూరగాయలు, పండ్లు, నాన్‌వెజ్ తదితర సరుకులు ఒకే చోట అందుబాటులో ఉండటంతో నిత్యావసరాల కొనుగోలు సులభతరం కానుంది. తాజా సరుకులు అందుబాటు ధరల్లో లభించేలా రైతుబజార్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని నాయకులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు, షాపుల కేటాయింపుదారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో గాయత్రి కళాశాల విద్యార్థినికి స్వర్ణ పతకం

- జాతీయ స్థాయి పోటీలకు వెలుతురు నిహారిక ఎంపిక



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 16** రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పెద్దపల్లి గాయత్రి జూనియర్ కళాశాల ఏసీఈ గ్రూప్‌కు చెందిన విద్యార్థిని వెలుతురు నిహారిక స్వర్ణ పతకం సాధించి ప్రతిభ చాటింది. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో గతవారం తెలంగాణ బీఎస్ఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే ఛాంపియన్‌షిప్--2026 రాష్ట్ర స్థాయి పోటీల్లో నిహారిక పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది. ఈ విజయంతో అక్టోబర్‌లో జరగనున్న జాతీయ స్థాయి కరాటే పోటీలకు నిహారిక ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం పట్ల కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గాయత్రి కళాశాల యాజమాన్యం నిహారికను అభినందించింది. జాతీయ స్థాయి పోటీల్లోనూ స్వర్ణ పతకం సాధించి కళాశాలకు, పెద్దపల్లి జిల్లాకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించింది. నిహారికకు విద్యాసంస్థ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని యాజమాన్యం తెలిపింది.

# విద్యుత్ తీగలతో రైతులకు ముప్పు!

- మనిషికి అందేంత ఎత్తులో వేలాడుతున్న తీగలు
- పలుమార్లు మోటార్లు కాలిపోతున్నా పట్టించుకోని అధికారులు



**ఝరాసంగం, సెప్టెంబర్ 16 (ప్రజావాణి):** ఝరాసంగం మండలం మాచ్నూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 37లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు నాలుగు ఎకరాల పొడవునా విద్యుత్ తీగలు మనిషికి అందేంత ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు లైన్‌మెన్‌కు విన్నవించినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని రైతులు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడి పలుమార్లు మోటార్లు కాలిపోయాయని పేర్కొన్నారు. రైతుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను వెంటనే సరిచేసి, రహదారి పక్కగా సురక్షితంగా ఏర్పాటు చేయాలని రైతులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

# రేగళ్ల తండా ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ

- పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై అసంతృప్తి.
- మెనూ అమలులో నిర్లక్ష్యంపై వార్డెన్‌కు షోకాజ్ నోటీసు
- వసతి గృహంలో సౌకర్యాలు, ఆహార పదార్థాల నాణ్యతపై పరిశీలన..
- పనిచేయని ఆర్వో ప్లాంట్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.









**లక్ష్మీదేవిపల్లి/మన ప్రజావాణి (16 సెప్టెంబర్ 26):** లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల తండాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం రోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ అపరిశుభ్రతతో పాటు చెత్త ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని ఎన్‌సీసీ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎన్‌సీసీలో ఉన్న విద్యార్థుల సంఖ్య, గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం, తదితర వివరాలను ఉపాధ్యాయులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. తదుపరి బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందుతున్న వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం, భోజనం తదితర సౌకర్యాలను పరిశీలించారు. కిచెన్ షెడ్, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసి నిల్వ ఉంచిన సరుకులు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కిచెన్‌లోని ఆర్వో వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడాన్ని గమనించిన కలెక్టర్, అందుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే అవసరమైన మరమ్మతులు చేపట్టి ఆర్వో ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న సౌకర్యాలు, భోజనం, తాగునీరు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం మెనూలో చికెన్ అందించాల్సి ఉన్నప్పటికీ విద్యార్థులకు వడ్డించిన భోజనంలో చికెన్ లేకపోవడాన్ని కలెక్టర్ గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందించడంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేస్తూ, సంబంధిత వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం విషయంలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ తోపాటు లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేట పట్టణంలో ఘనంగా వినాయక నవరాత్రి వేడుకలు



**మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 16 (జోగిపేట్) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి** జోగిపేట పట్టణంలో వినాయక నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. పట్టణంలోని శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం వద్ద కొలువుదీరిన భారీ గణపయ్యను బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, సార శ్రీధర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు గోవర్ధన్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్ తదితరులు నాయకులకు స్వాగతం పలికారు.

జోగిపేట పట్టణంలోని పలు దేవాలయాలతో పాటు వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున గణేష్ మండపాలను ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహిస్తూ భక్తులు పెద్ద సంఖ్యలో గణనాథుడిని దర్శించుకుంటున్నారు. పట్టణమంతా వినాయక నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# భూ సమగ్ర రీ-సర్వేకు శ్రీకారం



**మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 16, ప్రజావాణి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ సమగ్ర రీ-సర్వే కార్యక్రమానికి మంథని మండలం పందులపల్లిలో శ్రీకారం చుట్టారు. మండల సర్వేయర్ రాజశేఖర్‌చారి ఆధ్వర్యంలో పందులపల్లి, నాగారం శివారు ప్రాంతాల హద్దులను గుర్తించి చూపించారు. అనంతరం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని పందులపల్లి శివారు చివరి హద్దుల వరకు సర్వే నిర్వహించారు. భూ సమగ్ర రీ-సర్వేకు రైతులు సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో కన్నాల గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్, నాగారం గ్రామ సర్పంచ్ బెల్లంకొండ శ్రీదేవి సత్యనారాయణరెడ్డి, కన్నాల ఉపసర్పంచ్ దివ్య సంజీవరెడ్డి, కన్నాల జీపీవో సతీష్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

# అక్కెనపల్లి మోడల్ స్కూల్‌లో హిందీ దివస్ వేడుకలు







**ప్రజావాణి,నంగునూరు, సెప్టెంబర్ 16:** అక్కెనపల్లి పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్‌లో హిందీ దివస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మంద జానయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మంద జానయ్య మాట్లాడుతూ, భారతదేశం భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయమన్నారు. ఈ వైవిధ్యంలో హిందీ భాష ప్రజల మధ్య అనుసంధానానికి ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు హిందీతో పాటు తమ మాతృభాషను, ఇతర భారతీయ భాషలను గౌరవిస్తూ బహుభాషా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. "మాతృభాష మనకు మూలాలను ఇస్తుంది, హిందీ దేశంలోని అనేక ప్రాంతాలతో అనుసంధానం చేస్తుంది, ఇంగ్లీష్ ప్రపంచంతో అనుసంధానం చేస్తుంది" అని అన్నారు. సీనియర్ ఉపాధ్యాయుడు డా.ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ, హిందీ భాష భారతీయ సంస్కృతి, సాహిత్యం,సంప్రదాయాలతో ముడిపడి ఉందన్నారు. "భిన్నత్వంలో ఏకత్వం భారతీయ సంస్కృతికి ప్రత్యేకత. హిందీ భాష దేశంలోని ప్రజలను అనుసంధానించే వారధిగా నిలుస్తోంది" అని పేర్కొన్నారు. భాష ద్వారా దేశంలోని విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను మరింతగా అర్థం చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. హిందీ ఉపాధ్యాయులు ముంతాజ్, షబానా హిందీ దివస్ ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. హిందీ భాషను ఆసక్తితో నేర్చుకోవడంతో పాటు దేశంలోని భాషా వైవిధ్యాన్ని గౌరవించాలని సూచించారు. పీజీటీ సి.హెచ్. రజని మాట్లాడుతూ, భాషలు అనేకమైనప్పటికీ భావం ఒక్కటేనని,"భారతదేశం ఒక్కటే" అనే స్ఫూర్తితో అన్ని భాషలను గౌరవిస్తూ ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ. శ్రీనివాస్, ప్రభాకర్, శ్రీనివాస్,నర్సయ్య, భానురేఖ తదితరులు చురుకుగా పాల్గొన్నారు. హిందీ భాష ప్రాధాన్యతతో పాటు భారతీయ సంస్కృతిలోని వైవిధ్యాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# కురవిలో అకునూరి మురళికి ఘన సన్మానం

- దళిత నాయకులు



**డోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 16 ప్రజావాణి:** ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ (TPF) ఆధ్వర్యంలో చేపట్టిన "విద్యారంగ బస్ యాత్ర" బుధవారం కురవికి చేరుకుంది. తెలంగాణ విద్యా కమిషన్ మాజీ ఛైర్మన్ అకునూరి మురళి నేతృత్వంలో ఈ యాత్ర కొనసాగుతోంది. సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ బస్ యాత్ర సెప్టెంబర్ 27 వరకు తెలంగాణలోని పూర్వ పది జిల్లాల్లో కొనసాగనుంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం యాత్ర ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఖమ్మం నుంచి మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్తున్న అకునూరి మురళిని కురవిలో దళిత నాయకులు ఘనంగా సన్మానించారు. దళితరత్న, వార్డు సభ్యులు దైద భద్రయ్య, ఇరుగు వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, ఇరుగు సత్యం, రమణ తదితరులు శాలువతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ విద్యను పరిరక్షించేందుకు చేపట్టిన విద్యారంగ బస్ యాత్రకు తమ మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం




**ప్రజావాణి,నంగునూరు, సెప్టెంబర్ 16:** అక్కెనపల్లి పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్‌లో పీజీటీ కెమిస్ట్రీగా పనిచేస్తున్న డా.యస్. శ్రీనివాస్ ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న సందర్భంగా పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మంద జానయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి డా. శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మంద జానయ్య మాట్లాడుతూ, డా.యస్. శ్రీనివాస్ తన బోధనా ప్రతిభ, విద్యార్థుల పట్ల అంకితభావం, నిరంతర కృషితో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు. ఆయనకు లభించిన ఈ అవార్డు ఇతర ఉపాధ్యాయులకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత డా. యస్. శ్రీనివాస్ మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం భవిష్యత్తులో మరింత బాధ్యతతో పనిచేస్తానని అన్నారు. ఉపాధ్యాయుల సహకారం, విద్యార్థుల ఆదరణ తన విజయానికి ఎంతో తోడ్పడ్డాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ. శ్రీనివాస్, సి.హెచ్. రాజని, ప్రభాకర్, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొని డా. యస్. శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి శుభాకాంక్షలు తెలియజేశారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

# సర్పంచులను సన్మానించిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్



మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 16, ప్రజావాణి:మంథని, మల్హర్‌రావు మండలాలకు చెందిన పలువురు నూతన సర్పంచులను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. మొట్టమొదటి సారిగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) మంథనికి విచ్చేసిన సందర్భంగా పెద్దతుండ్ల సర్పంచ్ బండారి నర్సింగ రావు, పుట్టపాక సర్పంచ్ కన్నూరి రాజబాబు, మల్లారం సర్పంచ్ పొట్ల లక్ష్మీ శ్రీకాంత్‌లను కొత్త శ్రీనివాస్ శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సర్పంచులు తమ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్ కిషన్ రెడ్డి, వార్డు మెంబర్ కన్నూరి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పెద్దకోడెపాక గ్రామంలో అమ్మ అశోక్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం



ప్రజావాణి శాయంపేట మండలంలోని పెద్ద కొడెపాక గ్రామంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది ఈ సందర్భంగా అశోక్ వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆ విఘ్నేశ్వరుని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.అనంతరం భక్తులు, గ్రామ ప్రజల సమక్షంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ప్రతి ఒక్కరికీ అన్నప్రసాదాన్ని అందించారు. ఈ మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. తెలిపారు ఈ కార్యక్రమంలో అమ్మ రాజు,ముజిగిరి వేణు, కొమ్ము శ్రీను,అమ్మ రంజిత్, అన్న రాజు,చంద్రమౌళి మహేష్ రాకేష్ సురేష్ తదితరులు పాల్గొన్నారు

# గంగాపురిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ





మంథని నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 16 ప్రజావాణి: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు బుధవారం గంగాపురిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గంగాపురి గ్రామ ప్రజలు, మహిళలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ ముందస్తు అరెస్ట్




ప్రజావాణి శాయంపేటఅసెంబ్లీలో 22 ఏ నిషేధిత భూములపై సీఎం రేవంత్ రెడ్డి చర్చ సందర్భంగా బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ ను ఉదయం 5 గంటలకే పోలీస్ స్టేషన్ కు తరలించి ముందస్తు అరెస్ట్ చేశారు ఈ సందర్భంగా బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రంలో గత 1000 రోజుల నుండి రాక్షస పాలన నడుస్తుందని ఎక్కడికక్కడ అరెస్టులు నిర్బంధాలు విధిస్తున్నారని ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని నువ్వు అసెంబ్లీలో మాట్లాడితే మమ్ములను అరెస్టు ఎందుకు చేపిస్తున్నావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇది నీ తుగ్లక్ పాలనకు నిదర్శనం కాదా విద్యాశాఖకు మంత్రి నీ నియమించకుండా మీ దగ్గరే పెట్టుకున్నావు విద్యార్థులకు 14 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి రాకుండా చేసినవ్ సస్పెండ్ చేసి ప్రజల గొంతును నొక్కి రాక్షసానందం పొందుతున్నావు దీన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని ఇలాంటి చర్యలు మానుకోవాలని రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తుందని రాబోయే కాలంలో ప్రజల చేతిలో విద్యార్థుల చేతిలో కాంగ్రెస్ పార్టీ పతనం ఖాయమని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాను

# 20 ఏళ్ల తర్వాత మళ్లీ వెలుగులోకి శ్రీ వెంకటేశ్వర స్వామి పూజలకు శ్రీకారం

- ధూప దీప నైవేద్యాలను పునఃప్రారంభించిన భక్తజనం





గూడూరు మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 16. (మన సమగ్ర ప్రజావాణి):- మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కేంద్రం పరిధిలోని నాయకపల్లి, రాజనపల్లి, బొల్లెపల్లి, అయోధ్యాపురం, గాజుల గట్టు గ్రామాల సరిహద్దుల్లోని, పెద్దగుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి పాదముద్రలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. సుమారు 50 ఏళ్ల క్రితం స్వామివారి పాదముద్రలు కనిపించడంతో ఇక్కడ శ్రావణ మాసంలో ప్రతి శనివారం పూజలు నిర్వహించేవారు. అయితే గత 20 ఏళ్లుగా పూజలు నిలిచిపోయాయి. ఇటీవల స్వామివారు కలలో కనిపించి పూజలు పునఃప్రారంభించాలని ఆదేశించినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో భక్తులు మళ్లీ ధూపదీప నైవేద్యాలు ప్రారంభించారు. ఈ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించి, ఆలయ అభివృద్ధికి దేవాదాయ శాఖ సహకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ప్రజా ఉద్యమమే నాణ్యమైన విద్య కు పునాది....!

- మాజీ తెలంగాణా విద్యా కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళి

ఖమ్మం బ్యూరో మన ప్రజావాణి ప్రజలకు నాణ్యమైన విద్య లభించాలంటే రాజకీయ వ్యవస్థ పై ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలంగాణా మాజీ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు . ప్రజల నుండి డిమాండ్ లేకుండా ఏ పాలకవర్గం విద్యా వ్యవస్థను సరిదిద్దుతుందని భావించలేము , ఆశించడం కూడా పొరపాటు అవుతుందని అన్నారు . బుదవారం ఉదయం ఖమ్మం మయూరి సెంటర్ లోని శ్రీధర హోటల్ లో విద్యాబిమానులు , ఉపాద్యాయ , విద్యార్థి సంఘాలు , విద్యార్థుల తల్లిదండ్రులు , సామాజిక కార్యకర్త లుతదితర వర్గాలతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం లో ఆయన మాట్లాడారు . ప్రస్తుతం తెలంగాణా ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఐసియులో ఉందని , ప్రజలే డాక్టర్లు గా మారి దానికి చికిత్స చేసి బ్రతికించుకోవాలని పిలుపునిచ్చారు ప్రతిసంవత్సరం 40లక్షలమంది పిల్లల తల్లిదండ్రులు అధిక ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారని అన్నారు . ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ కు చట్టం చేయవలసిన అవసరం ఉందని అన్నారు . ప్రభుత్వ పాఠశాల లను అన్ని సౌకర్యాలు గల తెలంగాణా పబ్లిక్ స్కూల్స్ గా మార్చితే ప్రైవేటు బడులకు పిల్లలను పంపాల్సిన అఘాయిత్యం ఏముంటుంది అని ప్రశ్నించారు . ప్రభుత్వ పాఠశాల ల్లో ప్రస్తుతం 37శాతం మంది పిల్లలే చదువుతున్నారని అన్నారు . ఇలాగే అసౌకర్యంగా కొనసాగితే మరింత ప్రభుత్వ బడి దిగజారే అవకాశం ఉందని అన్నారు . జాతీయ స్థాయి యుడైస్ గణాంకాలు ప్రకారం తెలంగాణా లో 2,582 ఒకే గదిలో నడుస్తున్న పాఠశాలలు ఉన్నాయని , సున్నా విద్యార్థుల నమోదుతో



2,245 పాఠశాలలు మూతపడ్డాయని పేర్కొన్నారు . మూతపడ్డ పాఠశాలల జాబితా లో మన రాష్ట్రం రెండవ స్థానం లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు . తెలంగాణాలో ప్రతి పిల్లవాడికి విద్య అందాలంటే బడ్జెట్‌లో కనీసంగా 18శాతం నిధులు కెటాయించాలని అన్నారుప్రైవేటు పాఠశాల మౌళిక సదుపాయాల ను , భూమి విలువ , భావన విలువ , ఉపాద్యాయులు అర్హతలు , వేతనాలు , విద్యార్థుల కు అందిస్తున్న సౌకర్యాలు దృష్టి లో పెట్టుకొని ప్రైవేటు పాఠశాల నియంత్రణ చట్టం తేవాలని అన్నారు . ప్రజలకు అవసరం అయిన మౌళిక సౌకర్యాలు కలిగించే ప్రభుత్వం రావాలంటే నోటు తీసుకోకుండా ప్రజలు ఓటేసే స్థితి రావాలని అన్నారు . రౌండుటేబుల్ సమావేశం లో బస్సుయాత్ర లో పాల్గొన్న తెలంగాణా ప్రజా ఫ్రంటు కోర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ పద్మజాషా , ఐఏయస్ మాజీ అధికారి యం.చంపాలాల్ , పి.అశోక్ కుమార్ , సృజన యాదవ్ , యం.కు పోరన్న , యం.నర్సింహరావు , హరీష్ , రుబీనా , నిఖిల్ , జగదీష్ తదితరులు పాల్గొన్నారు . రౌండ్ టేబుల్ సమావేశం కు సీనియర్ జర్నలిస్టు , ఎడ్యుకేషన్ ఎనలిస్టు ఎన్.తిర్మల్ మోడరేటర్ గా



వ్యవహరించారు రౌండ్ టేబుల్ సమావేశం లో డాక్టర్ యంయఫ్ గోపినాథ్ , భద్రూనాయక్ , పిఆర్టీయు జిల్లా అధ్యక్షులు కట్టా.శేఖర్ , టిపిటీయఫ్ జిల్లా అధ్యక్షులు జి.మల్లయ్య , యుటీయఫ్ ప్రతినిధి ఉద్దండు , ధర్మసమాజ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సుంకర శ్రీనివాస్ , పిడియస్యు జిల్లా కార్యదర్శి మస్తాన్ , బలహీన వర్గాల జాక్ కన్వీనర్ పి.రాంబాబు , కనకయ్య , రిటైర్ ఉపాద్యాయ సంఘం జిల్లా కార్యదర్శి టి.వేణు , నాగిరెడ్డి , ప్రజానాట్యమండలి దేవేందర్ , బొబ్బిలి భారత్ చంద్ర , మణిభూషణాచారి , ఖలీల్ , ఝాన్సీ , సునీత , సృజన , విజయకుమార్ , గుంతేటి వీరభద్రం తదితర 30 మంది విద్యారంగం ప్రముఖులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు . రౌండుటేబుల్ సమావేశం ప్రభుత్వ బడులను సౌకర్యవంతంగా తీర్చిదిద్దడానికి మండలానికి నాలుగు తెలంగాణా పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని , ప్రైవేటు పాఠశాల ఫీజులు నియంత్రణ చేయాలని , చట్టబద్ధం గా విద్యకు బడ్జెట్ లో ప్రతిఏటా 18శాతం నిధులు కెటాయించాలని సమావేశం తీర్మానం చేసింది . ఈమూడు అంశాలపై జరిగే ఉద్యమానికి సైతం తనసంపూర్ణ మద్దతు రౌండ్ టేబుల్ సమావేశం ప్రకటించింది.

# పోషణ మాసాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

- ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువు వివరాలు నమోదు చేయాలి.
- సామ్, మామ్, ఎస్‌యూడబ్ల్యూ పిల్లలపై ప్రత్యేక దృష్టి.
- మెనూ ప్రకారం వేడి వేడి భోజనం అందించాలి.
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.

రాజన్న సిరిసిల్ల, ప్రజావాణి జిల్లాలో పోషణ మాసాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహించనున్న పోషణ అభియాన్ కార్యక్రమంపై బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ జాతీయ పోషణ మాసం పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు.అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువును ప్రతి నెలా తప్పనిసరిగా నమోదు చేసి, అంగన్వాడీ



యాప్‌లో వివరాలను పొందుపరచాలని కలెక్టర్ సూచించారు. సామ్, మామ్,ఎస్‌యూడబ్ల్యూ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అంగన్వాడీ సూపర్‌వైజర్లు వారి ఇళ్లకు వెళ్లి పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు.పిల్లలకు బాలామృతం, బాలామృతం ప్లస్ వంటి పోషకాహారాన్ని అందించాలని, ఎదుగుదల లోపం లేదా ఇతర సమస్యలు ఉన్న పిల్లలను డీఈఐసీ కేంద్రాలకు తరలించి అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి అదనపు పోషకాహారం అందించడంతోపాటు వైద్య శాఖ సిబ్బంది సమన్వయంతో వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం

అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని వేడి వేడిగా అందించాలని కలెక్టర్ ఆదేశించారు. మన అంగన్వాడీ.. మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా కేంద్రాల్లో లైట్లు, ఫ్యాన్లు, ఆర్‌ఓ వాటర్ తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.ఈ నెల 21న అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల పరిధిలో వార్డు అధికారులు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి, కేంద్రాల లోపల, బయట పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, డీపీఓ అఫ్జల్ బేగం, డీసీఎస్ఓ డీఎం గోపాల్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష...

- నిర్బంధాలతో కార్మిక ఉద్యమాలను అణచ లేరు.
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య

యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ 16 మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలతో కార్మిక ఉద్యమాలను అనచాలని చూస్తే గత కెసిఆర్ కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిఐటియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం రైతు బజార్ వద్ద సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన దీక్షను నిర్వహించడం జరిగింది. ఈ దీక్షకు ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాల అమలు కోరుతూ అంగన్వాడీలు , ఆశాలు , గ్రామపంచాయతీ , వివిధ రంగాల



కార్మికులు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తే సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిని ముందస్తు అరెస్టులు చేస్తూ మహిళలని చూడకుండా స్టేషన్లకు తరలిస్తూ లాఠించే అర్జీలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ ఎత్తివేసి , ఉద్యమాల్ని అనుచాలని చూసిన టిఆర్ఎస్ ప్రభుత్వం విధానాల బాటలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడు స్తున్నదని దుయ్యబట్టారు. ఇప్పటికైన ప్రజాస్వామ్య విలువల కట్టుబడి ప్రభుత్వం నడవాలని సూచన చేశారు.సెప్టెంబర్ 8 , 9 తేదీలలో ఆశా వర్కర్ ల , అంగన్వాడీల సమస్యలపై చలో హైదరాబాద్ సందర్భంగా సిఐటియు నాయకులను , యూని యన్ నాయకులను , మహిళలు అని చూడ కుండా పోలీస్ లు ప్రవర్తించిన తీరు ప్రజా స్వామ్య స్ఫూర్తికీ విరుద్ధం అని విమర్శించారు.నిరసన దీక్ష అనంతరం జిల్లా ఇంచార్జీ కలెక్టర్ భాస్కర్ రావుకి , జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ కి నిర్బంధాలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ నిరసన దీక్షలో సిఐటియు జిల్లా అధ్యక్ష , కార్య దర్శులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి , కల్లూరి మల్లేశం , జిల్లా ఆఫీస్ బేరర్స్ దాసరి పాండు , యండి పాషా,దోనురు నర్సిరెడ్డి , మాయ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జల్లి గ్రామంలో నూతన రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ యాట సుధాకర్

- అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ ఫలాలు: జల్లి సర్పంచ్ యాట సుధాకర్

చెన్నారావుపేట సెప్టెంబర్ 16 ప్రజావాణి సమాజంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందించడమే ఏకైక లక్ష్యమని జల్లి గ్రామ సర్పంచ్ యాట సుధాకర్, ఉపసర్పంచ్ మెరుగు బాబు స్పష్టం చేశారు. జల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్, ఉపసర్పంచ్ లతో అధికారులు హాజరై అర్హులైన లబ్ధిదారులకు తమ చేతుల మీదుగా నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ లు మాట్లాడుతూ... ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అర్హత ఉండి కార్డులు లేక ఇబ్బంది పడుతున్న అర్హులందరికీ ప్రాధాన్యత క్రమంలో రేషన్ కార్డులను మంజూరు చేయించినట్లు తెలిపారు.

ఈ కార్డు కేవలం ఉచిత బియ్యానికి పరిమితం కాకుండా, ప్రభుత్వ ఆరోగ్య భద్రతతో పాటు అనేక సంక్షేమ పథకాలకు ముఖ్యమైన



ప్రామాణిక గుర్తింపుగా ఉపయోగపడుతుందని వివరించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి నిరుపేద కుటుంబానికి న్యాయం జరిగేలా యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోందని పేర్కొన్నారు. దీర్ఘకాల నిరీక్షణ తర్వాత తమ చేతికి నూతన రేషన్ కార్డులు అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ పాలకవర్గానికి మరియు అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ అంబాల బిక్షపతి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) మమత, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, రెవెన్యూ (జిపిఓ) నరసింహస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ మర్రి సురేష్, మెరుగు సంపత్, కొర్ర మోహన్, చీకటి నందు, పంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను ఆకస్మిక తనిఖీ...

- తనిఖీ చేసిన ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కరరావు.

**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్16 మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి** బుధవారం రోజు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి , తెలంగాణ రాష్ట్రం , హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు ఈవీఎం/వీవీ ప్యాట్ గోదాం త్రైమాసిక తనిఖీలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాంను ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు గుర్తింపు పొందిన రాజ కీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఈవీఎం గోదాం సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి , ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు , కంట్రోల్ యూనిట్లు , ఇతర ఎన్నికల సామగ్రిని భద్ర పరిచిన గదులను క్షుణ్ణం గా పరిశీలించారు. గోదాం లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కూడా తనిఖీ చేశారు.ఈవీఎంలు , ఎన్నికల సామగ్రి భద్రత విషయం లో ఎన్నికల సంఘం మార్గ దర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసు కుంటున్నట్లు జిల్లా కలెక్టర్





తెలిపారు. గోదాం భద్రత, పర్యవేక్షణకు సంబంధించిన ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాల ని సంబంధిత అధికారు లను సూచించారుఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెం డెంట్ ఎం. కృష్ణ , డీటీటీ సురేష్ బాబు , సీనియర్ సహాయకులు కె. శ్రీకాంత్ , కాంగ్రెస్ నాయకులు , మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ , మజర్ , బీఆర్ఎస్ నాయకులు , భువనగిరి పట్టణ అధ్యక్షులు ఏ.వి. కిరణ్ కుమార్ , కార్యదర్శి రచ్చ శ్రీను , బీజేపీ పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం , సీపీఎం నాయకురాలు భట్టుపల్లి అనురాధ , బీఎస్పీ నాయకులు భట్టు రాం చంద్రయ్య తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు , ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు..

- అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారి ఆగ్రహం..

**ప్రజావాణి దుబ్బాక నియోజకవర్గం** అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు అలసత్వం వహిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.చేగుంట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన రెండో సర్వసభ్య సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. మూడు నెలలకోసారి జరిగే కీలక సమావేశానికి పలువురు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.విద్యాశాఖపై సమీక్ష సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంఈవో నీరజతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని, విద్యార్థుల నమోదు పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, పౌష్టికాహార పంపిణీపై జిల్లా సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవితో కలిసి సమీక్షించారు.గృహనిర్మాణ శాఖ సమీక్షలో భాగంగా మండలానికి మంజూరైన 104 ఇళ్లలో 50 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌ల సహకారంతోనే అభివృద్ధి పనులు సమర్థవంతంగా ముందుకు సాగుతాయని పేర్కొంటూ, ఏవైనా సమస్యలు ఎదురైతే





వెంటనే స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్ పరిధిలో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రమాదకర విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలను వెంటనే సరిచేయాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా దోమలు, ఈగల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌజన్య డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించారు.మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామీణ యువత, రైతాంగం సరికొత్త ఉపాధి మార్గాలు, ఆధునిక వ్యవసాయ విధానాల వైపు అడుగులు వేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పట్టణాల్లో క్లౌడ్ కిచెన్‌ల ద్వారా కొత్త ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో వంట నైపుణ్యం ఉన్నవారు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.స్వచ్ఛమైన పాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున పాడి పరిశ్రమతో పాటు బయోగ్యాస్, ఇథనాల్ వంటి రంగాలపై దృష్టి పెట్టాలని అన్నారు. భవిష్యత్తులో



మొక్కజొన్న కీలక వాణిజ్య పంటగా మారే అవకాశం ఉందని, మొక్కజొన్న వ్యర్థాలతో బయో-ప్లాస్టిక్ ఉత్పత్తులు, పేపర్లు, బాటిళ్లు, ప్లేట్లు తదితర వస్తువుల తయారీతో పాటు ఇథనాల్ ఉత్పత్తికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.ప్రకృతి వనరులు, వర్షపు నీటిని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకుంటూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రాబోయే కాలంలో సాంకేతిక, ఆర్థిక రంగాల్లో వేగవంతమైన మార్పులు చోటుచేసుకోనున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలు కూడా అందుకు అనుగుణంగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, ఎస్సై చైతన్యకుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఓజోన్ కవచాన్ని కాపాడుకుందాం.. భవిష్యత్ తరాలను రక్షిద్దాం!

- వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలి.. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి
- విద్యార్థులకు ఓజోన్ పరిరక్షణపై అవగాహన.. మొక్కలు నాటి ప్రతిజ్ఞ

**హసన్‌పర్తి:రిపోటర్ ప్రణయ్ గొర్రె :16** 66వ డివిజన్ కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారామ్ కర్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓజోన్ పొర పరిరక్షణ ఆవశ్యకతపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను విడుదల చేసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారామ్ కర్ణ మాట్లాడుతూ.. సమస్త జీవరాశుల మనుగడకు అనుకూలమైన వాతావరణం ప్రకృతి ప్రసాదించిన వరమని, అయితే మానవుల ఆధునిక జీవన విధానంతో వాతావరణ కాలుష్యం పెరుగుతోందని తెలిపారు. క్లోరోఫ్లోరో కార్బన్ల వంటి హానికర వాయువుల వల్ల ఓజోన్ పొర దెబ్బతిని, సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల ప్రభావం జీవరాశులపై పడే ప్రమాదం ఉందని వివరించారు.

రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు తదితరాల వల్ల పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను బాధ్యతాయుతంగా నిర్వహించడం, విరివిగా మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు.

1985లో బ్రిటిష్ శాస్త్రవేత్తలు ఓజోన్ పొరలో రంధ్రాన్ని గుర్తించారని, ఓజోన్ పరిరక్షణపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 16న అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. 1987 సెప్టెంబర్ 16న మాంట్రియల్‌లో జరిగిన సమావేశం ద్వారా ఓజోన్ పొరను రక్షించేందుకు ప్రపంచ దేశాలు కట్టుబాట్లు స్వీకరించాయని వివరించారు.

2026 అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా “శీతల గ్రహం కోసం గ్లోబల్ యాక్షన్” అనే సందేశంతో పర్యావరణ అనుకూల శీతలీకరణ, ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

30 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణకు సేవలు

సుజాత విద్యానికేతన్ పాఠశాల ఎన్‌జీసీ యూనిట్ ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు






“పర్యావరణ పరిరక్షణ - సకల జీవరాశులకు రక్షణ”

Think Globally - Act Locally

NGC UNIT

సుజాత విద్యానికేతన్ ఇ.మీ. పాఠశాల


WORLD OZONE DEPLETION DAY - SEPT 16

నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. వనమహోత్సవంలో ఉచితంగా మొక్కలు పంపిణీ చేసి వాటి సంరక్షణ, మట్టి వినాయక విగ్రహాల తయారీ--ఉచిత పంపిణీ, కాలుష్య రహిత దీపావళి, హోలీ, జల సంరక్షణ, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను గుర్తించి ఆరు పర్యావరణ మిత్ర జాతీయ అవార్డులు లభించాయని, మాజీ రాష్ట్రపతి డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం తదితర ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ పర్యావరణం, ఓజోన్ పొర పరిరక్షణకు ఎన్‌జీసీ యూనిట్ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

అనంతరం విద్యార్థులతో ఓజోన్ పొర పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు జూపాక నాగరాజు, ఏ. వెంకట్, పి. వెంకటేశ్వర్లు, ఈ. ప్రవీణ్, రాధాకుమారి, సబిహా, అరుణ, సుచిత్ర, సంధ్య, సి.హెచ్. సంధ్య, ప్రవళిక, రాణి, దేవిక, దివ్య, స్వాతి, గీత తదితరులు పాల్గొన్నారు.

ఫోటో క్యాప్షన్:

హసన్‌పర్తి సుజాత విద్యానికేతన్‌లో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారామ్ కర్ణ, ఉపాధ్యాయులు.

## మాచర్ల బుచ్చయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు అబిగౌడ్

- 50 కేజీల బియ్యం అందజేత



**మద్దూరు సెప్టెంబర్ 16, ప్రజా వాణి,**భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల్ల కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు అర్ టి ఏ సభ్యులు అభి గౌడ్ కి. శే. మాచర్ల బుచ్చయ్య కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కార్యదర్శి దాసరి పద్మారెడ్డి, లద్నూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు దండుగుల పోచయ్య, ఉపాధ్యక్షులు గాజపాక కుమార్, కార్యదర్శి కాసర్ల ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి నవీన్, పులి దానియేలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమక్షంలో అందజేశారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్



**సిరిసిల్ల, ప్రజావాణి** రాష్ట్రంలోని విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్‌ను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు.తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అధికారంలోకి వస్తే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.విద్యాశాఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దే ఉన్నందున విద్యార్థుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మట్టే శ్రీనివాస్, ఆరెల్లి వినయ్, బల్యాల ప్రవీణ్, చెట్టిపెల్లి హరీశ్, కోడం వెంకటేష్, శశి, కె. మణిశర్మ, కె. యశ్వంత్, కె. సాయి తేజ, డి. వరుణ్, వివేక్, రిషి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు యామ రాజుకు సన్మానం




**ప్రజావాణి,నంగునూరు, సెప్టెంబర్ 16:**పాలమాకుల ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు యామ రాజును బుధవారం పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఇటీవల ఆయన సిద్దిపేట జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ శ్రీమతి హైమావతి చేతుల మీదుగా యామ రాజు అవార్డును అందుకున్నారు. బుధవారం పాలమాకుల ఉన్నత పాఠశాల ఆవరణలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు పి.ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం యామ రాజును సన్మానించింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి. ప్రభాకర్ రావు యామ రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల బలోపేతానికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమూద్ ఆలీ, పార్థసారథి, నాగరాజు, హరికృష్ణ, మురళీధర్ రెడ్డి, యాదయ్య, లలిత భవాని తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఇంకుడు గుంత నిర్మాణానికి భూమిపూజ



**ప్రజావాణి,నంగునూరు, సెప్టెంబర్ 16 :**నంగునూరు మండలం తిమ్మాయిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఇంకుడు గుంత నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి, సర్పంచ్ చేర్యాల రాజు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవడం ద్వారా భూగర్భ జలాలను సంరక్షించవచ్చని తెలిపారు.ఇంకుడు గుంతల నిర్మాణంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుందని చెప్పారు. దీంతో భూగర్భ జలాల మట్టం పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నీటి ప్రాముఖ్యతను గుర్తించాలని సూచించారు. వర్షపు నీటిని వృథా చేయకుండా సంరక్షించాలని కోం

## గణపతికి ప్రీతిపాత్రమైన రోజున అన్నప్రసాద కార్యక్రమం



**జగిత్యాల స్టాప్ రిపోర్టర్, ఎండపల్లి సెప్టెంబర్ 16 (ప్రజావాణి):**జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం పాతగూడూరు గ్రామంలోని హైవే రోడ్డుపై, సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణపతికి ఎంతో ప్రీతిపాత్రమైన(ఇష్టమైన) బుధవారం రోజున స్థానిక దంపతులు ముక్తి శేఖర్ - మానస వారి కుమారుడు విహంధర్స్ ల అన్న ప్రసాద వితరణలో భాగంగా గణపతి మండప ఆవరణలో మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముందుగా ఆ గణనాథునికి వేద పండితులు ప్రత్యేక శ్రద్ధలో పూజలు, ధూపదీప నైవేద్యాలు, అలంకరణలు వైభవంగా నిర్వహించారు. అనంతరం వినాయకుడికి తొమ్మిది రకాల ప్రత్యేక వంటకాలతో నివేదన సమర్పించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ.... మానవ సేవయే మాధవ సేవ అని, అన్ని దానాలలో కెల్లా గొప్పది అన్నదానమని, ఇలాంటి గొప్ప కార్యక్రమం దైవ సన్నిధానంలో నిర్వహించడం అదృష్టంగా భావించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని భక్తులు, చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వితరణను విజయవంతం చేశారని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొంగల జగదీశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ మేడిపల్లి సత్యనారాయణ, వార్డు సభ్యులు, యూత్ సభ్యులు, భక్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్‌పై వ్యాఖ్యలపై ఎమ్మార్పీఎస్ నిరసన



**ప్రజావాణి,నంగునూరు, సెప్టెంబర్ 16:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను ఎమ్మార్పీఎస్ టీఎస్ సిద్దిపేట జిల్లా కమిటీ ఖండించింది. సిద్ధిపేట జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి రాజేందర్ మాట్లాడారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించేలా ఉన్న పుస్తకాల ప్రచురణ, విడుదలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ముద్రించిన పుస్తకాలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హమారా ప్రసాద్‌పై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి, రాష్ట్ర డీజీపీని కోరారు. అంబేద్కర్‌ను గౌరవించే ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి లింగాల కృష్ణ, జాతీయ ఉపాధ్యాయుడు బొంబాయి వెంకట్, జాతీయ ప్రధాన కార్యదర్శి సిద్ధిని రాజమలయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.పీ. రాజేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలు గారి కృష్ణ, జిల్లా జనరల్ సెక్రెటరీ బోడ ప్రశాంత్ మాదిగ, జాంగిర్ మాదిగ, గజపక ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

# జిపి భవనం ప్రారంభానికి కాలయాపన తగదు

- సర్పంచి కుమార్



**ప్రజావాణి,ఇనుగుర్తి:** మండల కేంద్రం ఇనుగుర్తి మేజర్ గ్రామపంచాయతీ నూతన భవన ప్రారంభానికి కాలయాపన తగదని ఆ గ్రామ సర్పంచి తమ్మడపల్లి కుమార్ అన్నారు. ఉపసర్పంచి సత్తూరి యాదగిరి, వార్డు సభ్యులతో కలిసి సర్పంచి నూతన భవనాన్ని బుధవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత గ్రామపంచాయతీ భవనం వర్షానికి పైకప్పు నుంచి నీరు కారుతోందన్నారు. పాలనాపరమైన కార్యకలాపాలు నిర్వహించడానికి తీవ్ర ఇబ్బంది కలుగుతుందని చెప్పారు.నూతన జిపి భవనం ప్రారంభానికి సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాలయాపనకు గురి చేస్తున్నాడని ఇది సరైంది కాదని వెంటనే భవనం ప్రారంభించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు.

# ఎలుక చెట్టు తండాలో ఉచిత కంటి వైద్య శిబిరం

- మానవత్వం చాటుకున్న సర్పంచ్ మాలోతు రమేష్ నాయక్



**డోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి , సెప్టెంబర్ 16, ప్రజావాణి:** కురవి మండలంలోని ఎలుక చెట్టు తండా గ్రామపంచాయతీలో సర్పంచ్ మాలోతు రమేష్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సంక్షేమం కోసం ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో గ్రామంలోని పలువురు ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించారు. అవసరమైన వారికి మహబూబాబాద్‌లోని సూర్య కంటి దవాఖానాలో కంటి శస్త్రచికిత్సలు చేయించారు.శస్త్రచికిత్స అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని సర్పంచ్ దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం వారికి అవసరమైన జాగ్రత్తలు సూచించి, సురక్షితంగా స్వగ్రామానికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉచిత వైద్య సేవలు అందించడం పట్ల సర్పంచ్ రమేష్ నాయక్‌ను గ్రామస్థులు అభినందించారు.

# అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం




**నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి** నాగార్జున ప్రభుత్వ కళాశాల (అటానమస్) నల్లగొండ నందు 2026-27 విద్యా సంవ్సరానికి గాను ఖాళీగా ఉన్న యు.జి. మరియు పి.జి. అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా॥ సముద్రాల ఉపేందర్ తెలియజేసారు. పీ.జి లో 55 శాతం మార్కులు ఉ న్నవారు అర్హులు యస్.సి, యస్.టి వారికి పీ.జి లో 50 శాతం మార్కులు ఉన్నవారు అర్హులు, పి.హెచ్.డి/నెట్/సెట్ మరియు బోధనా అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఖాళీల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నవి. యు.జి. కోర్సుల్లో తెలుగు -01 రాజనీతిశాస్త్రం - 01 ఖాళీలున్నట్లు ఆయన తెలిపారు. పి.జి కోర్సుల్లో యం.యస్సీ కంప్యూటర్ సైన్స్ - 01 ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి కల అభ్యర్థులు తమ దరఖాస్తు ఫారాలను కళాశాల కార్యాలయములో తేది.18-09-2026 సాయంత్రం 4.00 గం॥ లోగా అందజేయగలరని తెలియజేశారు. దరఖాస్తు లో తమ ఎస్సేస్సీ, ఇంటర్మీడియేట్, డిగ్రీ, పి.జి, పిహెచ్.డి, నెట్, సెట్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్ సర్టిఫికెట్, అనుభవ ధ్రువీకరణ పత్రాలు జత చేయాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తేది. 19-09-2026 ఉదయం 10.30 గం॥లకు కళాశాల లో ఇంటర్వ్యూకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.

# నేడు కూటిగల్ స్థూపం వద్ద అమరవీరుల సంస్మరణ దినోత్సవం



- కూటిగల్ గ్రామ సర్పంచ్ దాసరం బాలకృష్ణ

**మద్దూరు సెప్టెంబర్ 16, ప్రజా వాణి,** మండలంలోని కూటిగల్ గ్రామంలోని బస్టాండ్ లో గల అమరవీరుల స్థూపం వద్ద నేడు(గురువారం) తెలంగాణ విమోచన దినోత్సవం పురస్కరించుకొని అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ దాసరం బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు, యువకులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.

# పశు వైద్యురాలు తీరుపై ఆగ్రహం: చిరుతపల్లి పశువైద్యశాల మూతపడే స్థితి... రైతుల గోడు పట్టించుకోని వైనం!

- గ్రామాలకు రాని లేడీ డాక్టర్, స్పందించని ప్రైవేట్ అసిస్టెంట్... వ్యాధుల బారినపడి పశువులు మృతి చెందుతున్నాయని రైతుల ఆవేదన!

**వెంకటాపురం (నూగూరు), సెప్టెంబర్ 16 (ప్రజావాణి):** వెంకటాపురం మండల పరిధిలోని చిరుతపల్లి గ్రామంలో పశువైద్యశాల అందుబాటులో ఉన్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏజెన్సీ ప్రాంత రైతులకు, పాడిపంటలపై ఆధారపడిన ప్రజలకు కనీస వైద్య సేవలు అందడం లేదు. చింతపల్లి ప్రభుత్వ పశువైద్యశాల నామమాత్రంగా మారిందని, ఇక్కడ విధుల్లో ఉండాల్సిన పశు వైద్యురాలు (ఫిమేల్ డాక్టర్) కార్యాలయానికి రాకుండా గైర్హాజరవుతూ రైతులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విలేజ్ విజిట్ సున్నా -- ప్రైవేట్ అసిస్టెంట్‌తో మభ్యపెడుతున్న వైనం నిబంధనల ప్రకారం పశువైద్యురాలు క్రమం తప్పకుండా గ్రామాల్లో పర్యటిస్తూ (విలేజ్ విజిట్), జీవాలకు టీకాలు వేయడం




మరియు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి. కానీ సదరు పశు వైద్యురాలు ఏనాడూ గ్రామాల ముఖం చూడటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వీలువరపుతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పశువులకు తీవ్రమైన వ్యాధులు వచ్చి అస్వస్థతకు గురవుతున్నాయని, అత్యవసర పరిస్థితిలో ఫోన్ చేసి ప్రాధేయపడినా మేడమ్ గారు స్పందించడం లేదని వాపోతున్నారు. పోనీ ఆసుపత్రి వద్ద ఉన్న ప్రైవేటు అసిస్టెంట్ అయినా సేవలు అందిస్తున్నాడా అంటే, సదరు అసిస్టెంట్ కూడా రైతుల సమస్యలపై ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు.

పాడి రైతులకు తీరని నష్టం -- జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి స్పందించాలి

వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న ఏజెన్సీ రైతులు, తమ పశువులకు ఏ చిన్న అనారోగ్యం వచ్చినా వైద్యం అందక జీవాలను కోల్పోవాల్సి వస్తోందని తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పశువుల ప్రాణాలతో చెలగాటమాడుతూ, ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తున్న చిరుతపల్లి పశు వైద్యురాలిపై మరియు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్‌ను, స్థానిక ప్రజాసంఘాలు మరియు రైతులు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యురాలిని బదిలీ చేసి, నిరంతరం అందుబాటులో ఉండే వైద్యాధికారిని నియమించాలని కోరుతున్నారు.

# మండలంలో ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

- మండల ప్రజా ప్రతినిధులు.
- అందరి సమన్వయంతో గణేష్ ఉత్సవాలు విజయవంతం చేయాలి
- మండల అధికారులు.
- ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి.
- మండల నాయకులు.
- కోటగిరిలో మండల స్థాయి శాంతి సమావేశం.



**కోటగిరి/ప్రజావాణి:**-గణేష్ ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా అన్ని వర్గాల ప్రజల సహకారంతో అత్యంత ప్రశాంత వాతావరణంలో పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని మండల అధికారులు,ప్రజా ప్రతినిధులు, మత పెద్దలు,నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ. ప్రజలందరూ గణేష్ ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారుల ప్రజాప్రతినిధుల సమన్వయంతో వేడుకగా నిర్వహించుకోవాలని కోరారు.ప్రస్తుతం గణేష్ మండపాలకు ప్రభుత్వం తరఫున ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఆన్‌లైన్ ద్వారా నమోదైన మండపాలు సుమారు 52 ఉన్నాయని తెలిపారు. నిమజ్జన సమయంలో మండపాల నిర్వాహకులు జనరేటర్లను ఏర్పాటు చేసుకోవాలని,విద్యుత్ తీగలకు కొండీలు పెట్టవద్దని సూచించారు.విద్యుత్ ట్రిప్ అయిన సందర్భాల కోసం ఛార్జింగ్ లైట్లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అలాగే నిమజ్జన సమయంలో చెరువులు,కుంటల వద్ద మండప నిర్వాహకులు ఇరిగేషన్ అధికారుల ఆదేశాల ప్రకారం నడుచుకోవాలని అన్నారు.నిమజ్జన ప్రాంతాలలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.శోభాయాత్ర జరిగే రూట్ మ్యాప్‌లోని మట్టి,సిమెంట్,తారు రోడ్లలో గుంతలు లేకుండా స్థానిక సర్పంచులు,కార్యదర్శుల సహకారంతో రోడ్లను మరమ్మత్తు చేసుకోవాలని సూచించారు.మండపాలలో పరిమితి మేరకు రెండు బాక్సుల సౌండ్ సిస్టమ్ మాత్రమే పెట్టుకోవాలని,మితిమీరిన వాల్యూమ్ పెట్టకూడదన్నారు. మతసామరస్యాన్ని దెబ్బతీసే విధంగా శోభాయాత్ర కొనసాగరాదని,అందరి సహకారంతో గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.మండలంలోని అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలు జరపాలని. దానికి అనుగుణంగా పంచాయతీ కార్యదర్శులు సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు.యువకులు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. మండపాలలో అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు.వైన్ షాపులు,బెల్ట్ షాపులను పూర్తిస్థాయిలో నియంత్రిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గంగాధర్, ఎస్ఐ శ్రీనివాస్,ఎంపీడీవో జి.విష్ణు, విద్యుత్ ఏఈ బుజ్జిబాబు,ఇరిగేషన్ ఏఈ రవికుమార్,పీఆర్ ఏఈ నవదీష్ గౌడ్,మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ బర్ల మధుకర్,మండల పరిధిలోని సర్పంచులు దొడ్డిమీది శారద రాచప్ప పటేల్,పుప్పాల చిన్న గంగారాం, మటపతి శ్వేత సూర్యకాంత్,గైని వీరమణి అర్జున్,కొర్ర రవి,పడిగల యశ్వంత్ రావు పటేల్,విస్లావత్ షాంకి భాయి శంకర్,మూడ్ మౌనిక విజయ్, షేక్ గౌస్,గైక్వాడ్ మీణా భాయి జగన్నాథ రావు,నాయకులు ఏముల నవీన్, మామిడి శ్రీనివాస్,జాన్మియా,పోలీస్, విద్యుత్,రెవెన్యూ,ఇరిగేషన్ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

- దున్నే వాడికి భూమి వెట్టి చాకిరి విముక్తి కై సాయుధ రైతాంగ పోరాటం.
- సిపిఎం పార్టీ యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ:



**ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సెప్టెంబర్ 16 (ప్రజావాణి న్యూస్):** నియోజకవర్గం లోని యాచారం మండలం మేడిపల్లి గ్రామంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవా లు ఘనంగా నిర్వహించారు అనంతరం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులకు స్థూపాలకి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపి ఎం పార్టీ యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ హాజరై మాట్లాడుతూ భూమికో సం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గ్రామాల్లో దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందని అని అన్నారు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మేడిపల్లి గ్రామంలో కూడా ఉన్న దొరల భూస్వాముల దోపిడీ దౌర్జన్యానికి వెట్టి చాకిరికి వ్యతిరేకంగా గ్రా మంలో ఉన్న భూములు దున్నేవానికే భూములు దక్కాలని కామ్రేడ్ కృష్ణమూర్తి నాయకత్వాన జరిగిన పోరాటంలో కామ్రేడ్ వడ్డేమోని సత్తయ్య బూరె మల్లయ్య ఆలంపల్లి ఎల్లయ్య గడ్డంమ ల్లయ్య గడ్డం చెన్నయ్య ఎర్రజెండా రాములు బోడ మల్లయ్య పి విష్ణుమూర్తి కర్నాటి రంగారెడ్డి కీ లక పాత్ర పోషించారు. తెలంగాణ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీకి సంబంధించిన 4500 మంది తమ ప్రాణాలు అర్పించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అని అన్నారు 3000 గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాలు ఏర్పడిందని అన్నారు అదేవిధంగా 10 లక్షల ఎకరాలు పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. ఏ సంబంధం లేని బిజెపి పార్టీచరిత్రను వక్రీకరించే విధంగా ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వక్రీకరించే విధంగా ప్రయత్నం చేస్తే ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు గ్రామంలో యువత వీరతెలంగాణ రైతాంగ సాయుధపోరా ట ఉద్యమ స్ఫూర్తితో పని చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఆలంపల్లి జంగయ్య ఎస్ చందు నాయక్ మండల కమిటీ సభ్యులు ముచ్చర్ల లాజర్ ప్రజా నాట్యమండలి మండల కార్యదర్శి విభూషణ్ శాఖ కార్యదర్శిలు ఆలంపల్లి యాదయ్య గడ్డం కుమార్ ఆలంపల్లి పెంటయ్య 9వ వార్డు సభ్యులు అల్లంపల్లి మహేష్ సిపి ఎం నాయకులు మల్లయ్య. వేణు దేవయ్య యాదయ్య నరసింహ ఎండి బాషీద్ గఫూర్ శ్రీకాంత్ రాజు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏజెండా అంశాలపై చర్చే లేదు.. రసాభాసగా మండల సమావేశం

- అధికారుల గైర్హాజరుపై విమర్శలు.. సర్పంచుల మధ్య వాగ్వాదం



**నేరేడుచర్ల, సెప్టెంబర్ 17 (ప్రజావాణి):** నేరేడుచర్ల మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సర్పంచులు, మండల స్థాయి అధికారుల సమావేశం ఏజెండా అంశాలపై పూర్తిస్థాయి చర్చ లేకుండానే రసాభాసగా ముగిసింది. ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది.సమావేశంలో పెంచికల్‌దిన్న సర్పంచ్ సోములు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో సర్పంచుల పాత్ర లేకుండా అధికారులు జాబితా రూపొందించారని విమర్శించారు. ఈ అంశంపై మేడారం సర్పంచ్ సత్యనారాయణ జోక్యం చేసుకోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.మరోవైపు సమావేశ ఏజెండాలో పేర్కొన్న ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు, వీబీజీ రాంజీ, జలసిరి పనులపై సైతం పూర్తిస్థాయిలో చర్చ జరగలేదని సమాచారం. ముఖ్యమైన అంశాలపై చర్చించకుండానే సమావేశం ముగియడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.సమావేశానికి హౌసింగ్ ఏఈ, వ్యవసాయ శాఖ ఏఈఓ మినహా ఇతర మండల స్థాయి అధికారులు హాజరు కాలేదని పేర్కొన్నారు. తహసీల్దార్ సురిగి సైదులు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాం నాయక్ సహకారంతో



**గూడూరు మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 16. (మన సమగ్ర ప్రజావాణి):** మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండలం చంద్రు గూడెం కు చెందిన రామ్మోహన్ మెడికల్ షాప్ మోహన్ కు 1,92,500 రూపాయలు, సంపంగి జంపయ్య కు 40,000 వేల రూపాయలు, గోపగాని శ్రీలత 20,000 రూపాయలు, పొనుగోడు గ్రామం సమ్మెట శారద 36,000 వేల రూపాయలు, బ్రాహ్మణపల్లి సమ్మెట గోపమ్మ కు 27,000 వేల రూపాయలు, భూపతిపేట ముంజాల వీరస్వామి కి 23,000 వేల రూపాయలు, గుండెంగా చర్లతండ కు చెందిన బోడ తరుణ్ కు 17,000 వేల రూపాయలు, బానోత్ సరోజన కు 34,000 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్. చెక్కులను, గూడూరు మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్ నాయక్ అందజేశారు. వారితోపాటు బ్లాక్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ పెసరి శివ, పడమట తండా మాజీ సర్పంచ్ బాలు నాయక్, భూపతి పేట మాజీ సర్పంచ్ ఆవుల అశోక్, మండల సీనియర్ నాయకులు కందిక కృష్ణ, హెచ్ శివ, అన్నేబోయిన వెంకన్న, గోపగాని యాదగిరి గౌడ్, దారావత్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17.. తెలంగాణ చరిత్రలో కీలక మలుపు

## ● విమోచనమా..? విలీనమా..? విధ్వంసమా..?

**మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 17, ప్రజావాణి:** హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో చేరిన రోజుకు 78 ఏళ్లు
సెప్టెంబర్ 17.. తెలంగాణ చరిత్రలో అత్యంత కీలకమైన రోజు. 1948లో ఇదే రోజున నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. అయితే ఈ రోజును 'విమోచన దినోత్సవం', 'విలీన దినోత్సవం', 'ప్రజాపాలన దినోత్సవం'గా పిలవాలా? అనే అంశంపై దశాబ్దాలుగా రాజకీయ, చారిత్రక చర్చ కొనసాగుతోంది. చరిత్రలో చోటుచేసుకున్న పరిణామాలను పరిశీలిస్తే.. సెప్టెంబర్ 17 ఒకే కోణంలో అర్థం చేసుకునే రోజు కాదని స్పష్టమవుతుంది.

**నిజాం పాలన.. స్వాతంత్ర్యం తర్వాత కొత్త సంక్లిష్టత**

1947 ఆగస్టు 15న భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం వెంటనే భారత యూనియన్‌లో చేరలేదు. నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్‌ను స్వతంత్ర సంస్థానంగా కొనసాగించాలని ప్రయత్నించారు. ఇదే సమయంలో సంస్థానంలో ప్రజాస్వామ్య హక్కులు, బాధ్యతాయుత ప్రభుత్వం కోసం ఉద్యమాలు ఊపందుకున్నాయి.

తెలంగాణ ప్రాంతంలో భూస్వామ్య వ్యవస్థ, వెట్టిచాకిరీ, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా రైతాంగం, సామాన్య ప్రజల్లో ఆగ్రహం పెరిగింది. ఈ పరిణామాల మధ్య తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. దొడ్డి కొమురయ్యతో పాటు అనేక మంది ఉద్యమకారులు ప్రాణత్యాగాలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సెప్టెంబర్ 17ను వివరిస్తూ నాటి సాయుధ పోరాటం, అమరవీరుల త్యాగాలను ప్రస్తావించింది.

**రజాకార్ల వ్యవహారం.. పెరిగిన ఉద్రిక్తత**

హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలా లేదా స్వతంత్రంగా కొనసాగాలా అన్న ప్రశ్నకు తోడు రజాకార్ల కార్యకలాపాలు పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. నిజాం ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసిన రజాకార్లకు సంబంధించిన హింస, ప్రజలపై జరిగిన దాడుల ఆరోపణలు అప్పటి పరిస్థితులను మరింత సంక్లిష్టం చేశాయి.

చర్చలు, రాజకీయ ప్రయత్నాలు ఫలించకపోవడంతో భారత ప్రభుత్వం 1948 సెప్టెంబర్ 13న 'ఆపరేషన్ పోలో' పేరుతో సైనిక చర్య ప్రారంభించింది. సుమారు ఐదు రోజుల పాటు జరిగిన సైనిక చర్య అనంతరం సెప్టెంబర్ 17న నిజాం కాల్పుల విరమణకు ఆదేశించారు. అనంతరం హైదరాబాద్ సైనిక దళాల అధికారిక లొంగుబాటు జరిగింది.

**విమోచన దినోత్సవం ఎందుకు?**

సెప్టెంబర్ 17ను 'తెలంగాణ విమోచన దినోత్సవం'గా పిలిచే వర్గాల వాదనకు ప్రధాన ఆధారం.. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాల నుంచి ప్రజలకు విముక్తి లభించిందనే




భావన. ఈ దృక్కోణంలో 1948 సెప్టెంబర్ 17ను ప్రజల స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి నాంది పలికిన రోజుగా చూస్తారు.

అయితే 'విమోచనం' అనే పదం ప్రధానంగా రాజకీయ, సామాజిక ఉద్యమాల అనుభవాన్ని ప్రతిబింబిస్తుందని చరిత్రను అధ్యయనం చేసే వారు పేర్కొంటారు. ముఖ్యంగా తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఈ సందర్భంలో కీలకంగా పరిగణిస్తారు.

**మరి 'విలీన దినోత్సవం' ఎందుకు?**

మరో దృక్కోణంలో ఇది హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన రోజు. తెలంగాణ ప్రభుత్వ అధికారిక చరిత్ర వివరణలోనూ 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ భారత యూనియన్‌లో కలిసినట్లు పేర్కొంటోంది. మహబూబ్‌నగర్ జిల్లా అధికారిక చరిత్ర పేజీ కూడా ఇదే రోజున హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనమైనట్లు నమోదు చేసింది. అందువల్ల 'విలీన దినోత్సవం' అనే పదం ప్రధానంగా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో భాగమైన రాజకీయ–రాజ్యాంగ పరిణామాన్ని సూచిస్తుంది.

**'ప్రజాపాలన దినోత్సవం'గా తెలంగాణ ప్రభుత్వం**

ఈ చారిత్రక రోజుకు రాజకీయ వివాదాలకు అతీతంగా ప్రజా కోణాన్ని జోడించేందుకు తెలంగాణ ప్రభుత్వం 2024 నుంచి సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం'గా అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించింది. ప్రభుత్వ వివరణ ప్రకారం.. 1948 సెప్టెంబర్ 17న నిజాం రాచరిక వ్యవస్థకు ముగింపు పలికి ప్రజాస్వామ్య ప్రస్థానానికి నాంది పడిందనే భావనతో ఈ పేరు పెట్టారు.

దీంతో ఒకే తేదీకి భిన్నమైన చారిత్రక అర్థాలు అధికారిక, రాజకీయ, సామాజిక చర్చల్లో కొనసాగుతున్నాయి.

**'విధ్వంసం' అనే ప్రశ్న ఎందుకు వస్తోంది?**

సెప్టెంబర్ 17 చరిత్రలో కేవలం సైనిక చర్యతో ముగిసిన అధ్యాయం కాదు. ఆపరేషన్ పోలోకు ముందు, సమయంలో, అనంతరం హైదరాబాద్ సంస్థానంలోని పలు ప్రాంతాల్లో హింస, ప్రతీకార దాడులు, సామాజిక ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఈ పరిణామాలపై సుందర్‌లాల్ కమిటీ విచారణ జరిపింది. అందువల్ల ఆ కాలాన్ని కేవలం 'విమోచనం' లేదా 'విలీనం' అనే ఒక్క పదంతో మాత్రమే చూడకుండా, ప్రజలపై పడిన హింస,






నష్టాలు, బాధలను కూడా చరిత్రలో భాగంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**చరిత్రను రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన అవసరం**

సెప్టెంబర్ 17పై భిన్న అభిప్రాయాలు ఉండటం సహజమే. ఒక వర్గానికి ఇది నిజాం పాలన నుంచి విముక్తి పొందిన రోజు. మరో వర్గానికి ఇది హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనమైన రోజు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం 'ప్రజాపాలన దినోత్సవం'గా అధికారిక గుర్తింపు ఇచ్చింది. ఈ మూడు పదాల వెనుక వేర్వేరు చారిత్రక సందర్భాలు, రాజకీయ అర్థాలు ఉన్నాయి.

అందువల్ల సెప్టెంబర్ 17ను ఒక రాజకీయ నినాదంగా కాకుండా.. తెలంగాణ ప్రజల పోరాటం, నిజాం పాలన, రజాకార్ల హింస, రైతాంగ సాయుధ పోరాటం, ఆపరేషన్ పోలో, హైదరాబాద్ భారత యూనియన్‌లో చేరిక, అనంతర హింసాత్మక పరిణామాలు అన్నింటినీ కలిపి అధ్యయనం చేయాల్సిన చారిత్రక సందర్భంగా చూడటం సమగ్ర దృక్కోణం.

**చరిత్రను గుర్తుంచుకోవడం.. భవిష్యత్తును నిర్మించుకోవడం**

సెప్టెంబర్ 17 గతాన్ని గుర్తుచేసే తేదీ మాత్రమే కాదు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం కోసం జరిగిన పోరాటాలను గుర్తు చేసే సందర్భం. చరిత్రలోని విజయాలను మాత్రమే కాకుండా, జరిగిన విషాదాలను కూడా గుర్తుంచుకున్నప్పుడే తదుపరి తరాలకు సంపూర్ణ చరిత్రను అందించగలం. అందుకే సెప్టెంబర్ 17పై అసలు ప్రశ్న 'విమోచనమా..? విలీనమా..?' అన్నదానితో ముగియకూడదు. 'ఆ చరిత్ర నుంచి తెలంగాణ సమాజం ఏం నేర్చుకోవాలి?' అన్నదే నేటి తరానికి మరింత ముఖ్యమైన ప్రశ్న.

# టి యు డబ్ల్యు జే చండూరు మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక







**నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి** నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరు మండలంలోనీ స్థానిక మున్సిపాలిటీలోని బారతి చంద్ర గార్డెన్లో టీయూడబ్ల్యూజే చండూరు మండల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించడం జరిగింది. నల్గొండ జిల్లా అధ్యక్షులు గుండగోని జయ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. చండూరు మండలం టియుడబ్ల్యూజే కమిటీ అధ్యక్షులుగా ఆడెపు పరమేశ (10 టి.వి), ప్రధాన కార్యదర్శిగా వరికుప్పల సురేష్ లను (నమస్తే తెలంగాణ) ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టియుడబ్ల్యూజే జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్, నల్లగొండ జిల్లా టియుడబ్ల్యూజే ఉపాధ్యక్షులు లక్ష్మీకాంత్, రాష్ట్ర నాయకులు గోలీ విజయకుమార్, నల్గొండ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు జానయ్య, నల్లగొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గాలేంక గురుపాదం, టీయూడబ్ల్యూజే మునుగోడు నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డు సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కోడి రాములు చండూరు మండలంలోని వివిధ పత్రిక మరియు ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేఆర్ నగర్‌లో గౌడ సంఘం అన్నదాన సందడి





**జవహర్‌నగర్, సెప్టెంబర్ 16 ( ప్రజావాణి ప్రతినిధి)**
జవహర్‌నగర్ డివిజన్ పరిధిలోని బీజేఆర్ నగర్‌లో గౌడ సంఘం నూతన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. గౌడ కులస్తులు, సంఘం సభ్యులు కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాలనీవాసులు, స్థానికులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, సంఘం పెద్దలు, ప్రముఖులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా వచ్చిన వారికి అన్నదానం చేశారు. దీంతో బీజేఆర్ నగర్‌లో సందడి నెలకొంది. కార్యక్రమానికి జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు, పెద్దలు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. నూతన కమిటీ ఏర్పాటైన తర్వాత చేపట్టిన అన్నదాన కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. కమిటీ సభ్యులు, సంఘం నాయకులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. బీజేఆర్ నగర్ పరిధిలో గౌడ కులస్తులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్తులో సొసైటీ ఏర్పాటు చేసుకునే ఆలోచన కూడా ఉందని తెలిపారు. గౌడ కులస్తుల సంక్షేమం, ఐక్యత కోసం అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



**కేసముద్రం సెప్టెంబర్ 16, ప్రజావాణి.** సమాజంలో ఇంకా కొడుకులే వారసులు అనే భావన ఉన్న నేటి రోజుల్లో, ఓ కూతురు తానే కొడుకునై కన్న తండ్రికి అంతిమ సంస్కారాలు నిర్వహించి తన ప్రేమాభిమానాన్ని చాటుకుంది. అమీనాపురం గ్రామానికి చెందిన వనం సతీయ్య కుమార్తె అయిన సోమలక్ష్మి (తల్లి పేరు సోమలక్ష్మి), తన తండ్రి మరణించడంతో ఈ నిర్ణయం తీసుకుంది. వనం సతీయ్య కి కొడుకులు లేకపోవడంతో, హిందూ సాంప్రదాయాల ప్రకారం అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు కుమార్తె సోమలక్ష్మి ముందుకు వచ్చింది. కొడుకులు లేరనే వెలితి తెలియకుండా, కన్న తండ్రి రుణం తీర్చుకుంటూ తనే స్వయంగా చితికి తలకొరివి పెట్టింది. ఈ దృశ్యం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. కొడుకులే తలకొరివి పెట్టాలనే పాత నమ్మకాలను పక్కన పెట్టి, కన్న తండ్రి పై ఉన్న భక్తితో కూతురు చేసిన ఈ సాహసోపేతమైన, భావోద్వేగ భరితమైన నిర్ణయాన్ని అమీనాపురం గ్రామస్థులు అభినందించారు.ం

# యంగ్ ఇండియా స్కూల్ పనులను త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలి

- కలెక్టర్ భవేష్ మిశ్రా.
- పీఎస్ఆర్ నగర్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనుల పరిశీలన.
- నిర్మాణ బాధితుడికి ఇల్లు ఇప్పించాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్.
- కొడిచెర్ల ఇసుక క్వారీని సందర్శించిన కలెక్టర్ భవేష్ మిశ్రా.







**కోటగిరి/ప్రజావాణి:**–అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించదల్చిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ వసతి గృహ సముదాయాలను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. బుధవారం బాన్సువాడ నియోజకవర్గానికి సంబంధించి పోతంగల్ మండలంలోని పిఎస్ఆర్ నగర్లో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ స్కూల్ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అకడమిక్, అడ్మిన్ బ్లాకులు, డార్మెటరీ, కిచెన్, డైనింగ్, ఇండోర్ గేమ్స్, క్రికెట్ గ్రౌండ్, ప్లే గ్రౌండ్, టీచర్స్ క్వార్టర్స్, సెక్యూరిటీ బ్లాక్, పార్కింగ్ తదితర నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల వివరాలను ఆయన ఆరా తీశారు. మైలురాళ్ల (మైల్ స్టోన్స్) ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అని ఆయన గమనించారు. నిర్దేశిత సమయంలోపు పనులన్నీ పూర్తయ్యేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయాలని టీజీఈడబ్ల్యూఐడీ అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అధునాతన వసతి సదుపాయాలతో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని ఆయన గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ ఒకే సముదాయంలో అన్ని అధునాతన సౌకర్యాలతో వసతిని కల్పిస్తూ ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ఈ ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను అందుబాటులోకి తెస్తోందని ఆయన ఆకాంక్షించారు. వీటి ప్రాధాన్యతను గుర్తెరిగి పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా నిబంధనలు పూర్తిగా పాటించాలని సూచించారు. ఒక్కో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్లో సుమారు 2,500 మందికి పైగా విద్యార్థులు, 300 మంది వరకు బోధన, బోధనేతర సిబ్బంది ఉంటారని. వీరికి సరిపడా మంచినీరు, డ్రైనేజీ వంటి వసతులు కల్పించాలని తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పాఠశాల నిర్మాణ పనుల కారణంగా ఒక పేద కుటుంబం ఇల్లు కోల్పోవాల్సి వచ్చిందనే విషయాన్ని గుర్తించిన కలెక్టర్ వెంటనే స్పందించారు. నష్ట పోతున్న ఆ కుటుంబానికి ప్రభుత్వపరంగా అలాగే టీజీఈడబ్ల్యూఐడీ అధికారుల సహకారంతో వేరే సురక్షిత ప్రాంతంలో నూతన ఇల్లు నిర్మించి ఇవ్వాలని స్థానిక ఆర్డీవో విజయకుమారిని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ కొడిచెర్ల ఇసుక క్వారీని సందర్శించి అందుబాటులో ఉన్న నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం నిబంధనల ప్రకారం ఈ క్వారీ ద్వారా ఇసుకను అందించాలని అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా గట్టి నిఘా ఉంచి, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో విజయకుమారి, తహసీల్దార్ సందీప్, స్థానిక సర్పంచ్ గాండ్ల రాంబాయి(సాయినాథ్), ఉప సర్పంచ్ హాట్కర్ సతీష్, టీజీఈడబ్ల్యూఐడీ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# సంగమేశ్వర్ పంతులు తల్లి దశదిన కర్మకు హాజరైన పద్మాదేవేందర్ రెడ్డి..





**మన ప్రజావాణి మెదక్ ప్రతినిధి సెప్టెంబర్ 16.** చిన్న శంకరంపేటకు చెందిన సంగమేశ్వర్ పంతులు తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మాదేవేందర్ రెడ్డి బుధవారం దశదిన కర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రావికోటి మఠం చాండిశ్వరమ్మా (సోమేశ్వర దేవాలయం గుడి అమ్మ) చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంగమేశ్వర్ పంతులు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.
వీరి వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, నాయకులు కోలుకురి. లక్ష్మారెడ్డి, మెదక్ మాజీ జడ్పీ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, మండలంలోని పలు గ్రామాల సర్పంచులు భత్తురాజు భూమయ్య, బండారి నాగభూషణం, ఇమ్మడి నరేష్, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, సూల్ల దయానంద్ యాదవ్, మండల ముఖ్య నాయకులు యెమ శ్రీను, శ్రీనివాస్ నాయక్, బైండ్ల రాజ్‌కుమార్, చిప్ప కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 'ఎనర్జీ బాస్కెట్--2047' పై మండల స్థాయి సైన్స్ సెమినార్



**ఆర్మూర్ టౌన్ సెప్టెంబర్ 16(మన సమగ్ర ప్రజావాణి):** ఆర్మూర్ మండల విద్యా కార్యాలయంలో బుధవారం 'ఎనర్జీ బాస్కెట్--2047' అనే అంశంపై మండల స్థాయి సైన్స్ సెమినార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి రవీందర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మి నర్సయ్య న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పతాని సురేందర్, డాక్టర్ ఈ. పోచన్న, సెమినార్ సమన్వయకర్త చౌదరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రవీందర్ మాట్లాడుతూ, స్థానిక వనరులను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకుంటూ, ఇంధన కాలుష్యాన్ని తగ్గించి, 2047 నాటికి శక్తి ఉత్పాదక రంగంలో భారతదేశం అగ్రగామిగా నిలిచేలా విద్యార్థులు నూతన ఆలోచనలతో ముందుకు రావాలని సూచించారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం, ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. మండల స్థాయి సైన్స్ సెమినార్‌లో ప్రతిభ కనబరిచిన టీ.జీ.ఎం.ఎస్. మోడల్ స్కూల్ విద్యార్థిని జి. కీర్తన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో పాల్గొనేందుకు ఎంపికైంది. సెమినార్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

## అందోల్--జోగిపెట్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరికీ ముఖ్యమైన విజ్ఞప్తి



**మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 16 సంగారెడ్డి జిల్లా ప్రతినిధి** అందోల్--జోగిపెట్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఒక్కరూ తమ నివాసాలు, వ్యాపార సంస్థలు మరియు ఇతర ప్రదేశాల నుంచి వెలువడే చెత్తను మున్సిపల్ పారిశుధ్య వాహనానికే అందజేయవలసిందిగా తెలియజేయడమైనది.

మున్సిపాలిటీ పరిధిలోని బహిరంగ ప్రదేశాలు, రహదారులు, కాలువలు, ఖాళీ స్థలాలు తదితర ప్రాంతాల్లో చెత్తను పడవేయడం పూర్తిగా నిషేధించబడినది.ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడవేసినట్లయితే రూ.1,000/- (వెయ్యి రూపాయలు) జరిమానా విధించబడును. అలాగే, అవసరమైతే తదుపరి చట్టపరమైన చర్యలు కూడా తీసుకోబడును.కావున ప్రజలందరూ మున్సిపాలిటీకి సహకరించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛమైన అందోల్--జోగిపెట్ మున్సిపాలిటీ నిర్మాణానికి సహకరించవలసిందిగా కోరడమైనది.మున్సిపల్ కమిషనర్ అందోల్--జోగిపెట్ మున్సిపాలిటీ

## అడవిదేవులపల్లిలో ఘనంగా పోషణ మాసోత్సవ అవగాహన కార్యక్రమం

- ఐసీడీఎస్ (ICDS) సూపర్‌వైజర్ పి. రేవతిం



**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం సెప్టెంబర్ 16**అడవిదేవులపల్లి:మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసోత్సవం సందర్భంగా అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ (ICDS) సూపర్‌వైజర్ పి. రేవతి హాజరై మాట్లాడారు.గర్భిణులు, బాలింతలు, చిన్నారులు బలవర్ధకమైన పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని రేవతి తెలిపారు. నిత్యం తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, పాలు మరియు తృణధాన్యాలు భాగం చేసుకోవాలని సూచించారు. అ రక్తహీనత నివారణకు ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.పరిశుభ్రత లోపించడం వల్ల అనేక వ్యాధులు వస్తాయని, చేతుల శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్య సూత్రాలు అనుసరించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా లు, గర్భిణులు, బాలింతలు మరియు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## సర్వాపూర్ నల్లాల బావిలో నాచు పట్టిన కలుషిత నీరు - ప్రజల ప్రాణాలతో చెలగాటం!

- బ్లీచింగ్ వేయని పంచాయతీ - జ్వరాలతో అల్లాడుతున్న గ్రామం



**మన సమగ్ర ప్రజావాణి న్యూస్ । 16-09-2026**మల్లియాల (సర్వాపూర్): జగిత్యాల జిల్లా మల్లియాల మండలం సర్వాపూర్ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. గ్రామ ప్రజలకు తాగునీరు అందించే ప్రధాన నల్లాల బావి పూర్తిగా కలుషితమైంది. బావిలో నీరు ముదురు ఆకుపచ్చ రంగులోకి మారి, పైన నాచు, చెత్త పేరుకుపోయి స్పష్టంగా కనబడుతోంది. నీళ్లలో వేసిన పైపుల చుట్టూ కూడా నాచు పట్టేసింది. ఇదే నీరు శుద్ధి చేయకుండా నల్లాల ద్వారా ఇళ్లకు సరఫరా చేస్తున్నారు.గత నెల రోజులుగా గ్రామ పంచాయతీ సిబ్బంది బావిలో బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ వేయడం పూర్తిగా మరిచిపోయారు అని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో నీటిలో బ్యాక్టీరియా చేరి దుర్వాసన వస్తోంది.ఈ కలుషిత నీరు తాగడం వల్ల గ్రామంలో చిన్న పిల్లలు, వృద్ధులు వాంతులు, విరేచనాలు, జ్వరాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్తుల డిమాండ్: వెంటనే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, నల్లాల బావిని పూర్తిగా శుభ్రం చేయించి, ప్రతి వారం బ్లీచింగ్ వేసేలా చర్యలు తీసుకొని గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.మన సమగ్ర ప్రజావాణి న్యూస్, సర్వాపూర్

## వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్



**రాయికల్, సెప్టెంబర్ 16(ప్రజావాణి)** రాయికల్ పట్టణంలో వినాయక నిమజ్జనం కోసం చేస్తున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్, ఎస్సై సుధీర్ రావు సంయుక్తంగా పరిశీలించారు. వినాయక మండపాల నుండి నిమజ్జనం జరిగే ప్రధాన వాగు,చెరువు వరకు వెళ్లే మార్గంలో రోడ్ల మరమ్మత్తులు, లైటింగ్, బారికేడ్ల ఏర్పాటు, క్రేన్లు, ట్రాక్టర్ల సిద్ధతపై వారు ఆరా తీశారు. నిమజ్జనం రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు, మున్సిపల్ సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని చైర్మన్ సూచించారు.భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని నిర్వాహకులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించారంటూ ఫిర్యాదు.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

**తంగళ్లపల్లి ప్రజావాణి సెప్టెంబర్ 16** అప్పుగా తీసుకున్న సుమారు రూ.6 లక్షలు తిరిగి ఇవ్వకుండా బెదిరించడంతో పాటు, కులం పేరుతో దూషించి అవమానించారంటూ ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామానికి చెందిన దామేర కృష్ణకాంత్ ఫిర్యాదు మేరకు వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన బండి చైతన్య వద్దకు కృష్ణకాంత్ నుంచి సుమారు రూ.6 లక్షల నగదు లావాదేవీలు ఫోన్‌పే, గూగుల్‌పే, బ్యాంకు ఖాతా ద్వారా జరిగినట్లు పేర్కొన్నారు. కొంతకాలంగా డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా, తాను న్యాయవాదినని, ఏం చేసుకుంటారో చేసుకో అంటూ బెదిరించారని బాధితుడు ఆరోపించారు. ఈ విషయంపై గ్రామ పెద్దలతో కలిసి చైతన్య ఇంటికి వెళ్లే క్రమంలో తనను కులం పేరుతో దూషిస్తూ పదిమందిలో అవమానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.దీంతో బాధితుడు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయగా, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి విచారణ చేపట్టారు. సాక్షులను విచారించిన అనంతరం బండి చైతన్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదులోని ఆరోపణలపై దర్యాప్తు పూర్తయిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.కావాలంటే దీనిని ఇంకా చిన్నగా 2 పేరాల పత్రికా వార్తగా కూడా మార్చవచ్చు.

## ఆర్టీసీ కార్మికులపై పెంచిన పని భారాన్ని తగ్గించాలి

- ఖమ్మం డిపోవద్ద ఎస్ డబ్ల్యూ ఎఫ్ ధర్నా డిమాండ్



**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** ఆర్టీసీ కార్మికుల ఐక్య పోరాటాల వేదిక స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 47 వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక సిహెచ్.వి.రామయ్య స్మారక భవనం వద్ద ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా ఖమ్మం రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు పతాకావిష్కరణ చేయగా ప్రతినిధులందరూ పతాకానికి రెడ్ సెల్యూట్ చేశారు.అనంతరం రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఖమ్మం డిపో వద్ద కార్మికులపై పెంచిన పని భారాన్ని తగ్గించాలని,స్థానిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు.గడ్డం వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి మాట్లాడుతూ, తెలంగాణ ఆర్టీసీలో కార్మికులపై యాజమాన్య విధానాల వలన విపరీతమైన పని భారం పెరిగిందన్నారు.కార్మికులు ఐక్యంగా గత ఏప్రిల్ లో మూడు రోజుల సమ్మె సందర్భంలో అన్ని సంఘాల తో చర్చించి కొన్ని అంశాల పరిష్కారానికి ఒప్పుకుందన్నారు.ఆ తర్వాత ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడి) కమిటీతో జరిగిన చర్చలలో అంగీకరించిన 17 అంశాలను అమలు చేయాలని,కార్మిక సమస్యలపై క్రింది స్థాయిలో కార్మిక సంఘాలతో మాట్లాడమని ఈడీల స్థాయి అధికారులు చెబుతుంటే డిపో రీజియన్ స్థాయి అధికారులు మాత్రం కార్మిక సంఘాలతో ఎటువంటి చర్చలు చరపకపోగా స్మార్ట్ షెడ్యూల్ పేరుతో కార్మికులపై విపరీతమైన పనిభారాన్ని మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వవలసిన బకాయిలు,కార్మికులకు రావలసిన 2017 మరియు2021 పిఆర్సీ ఏరియర్స్ ఇవ్వాలని,అన్ని కేటగిరీ లలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని,ఆర్టీసీ కి నష్టాలు అధికారుల అనాలోచిత చర్యల వల్లనే తప్ప కార్మికులు కాదని తెలియజేశారు.స్థానిక యాజమాన్యం కార్మిక సమస్యలు పరిష్కరించకపోతే మరో పోరాటానికి సిద్ధం కావాలని లింగమూర్తి పిలుపు నిచ్చారు.రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు ఉపాధ్యక్షులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు ప్రచార కార్యదర్శి తోకల బాబు లు మాట్లాడుతూ ఖమ్మం రీజియన్ లో అనేక సమస్యలు కార్మికులు ఎదుర్కొంటున్నారని,హైదరాబాద్ సిటీలో ఎక్కువ రిక్వెస్ట్ స్టేజీలు పెట్టటం వలన డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళా ఉద్యోగులు సైతం రాత్రి కూడా విధులు నిర్వహిస్తున్నారని, మహిళల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా అన్ని బస్టాండ్లలో కనీసం రెస్ట్ రూములు లేవని,ఫేర్ పెయిడ్ ఆదాయం వచ్చే డీలక్స్ సర్వీసులను కూడా రద్దు చేస్తున్నారని.ప్రజల సౌకర్యాలకు అనుగునంగా సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు.అనంతరం ఖమ్మం డిపో కార్యదర్శి గుగ్గిళ్ల రోశయ్య మాట్లాడుతూ స్థానికంగా డిపోలో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు.డిపో స్థాయిలో పెంచిన సర్వీసుల వివరాలు మరియు సమస్యలు పరిష్కారం చేయాలని కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్ సత్యనారాయణ కు కార్మిక సమస్యలపై యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో ఆర్.వి.బాబు,ఓ.రాంబాబు, ఎస్.ఎస్.రామయ్య,జే.యు.చారి, పగిళ్లపల్లి నరసింహారావు, సి.హెచ్.వీరయ్య, కె. వెంకన్న,ఐ.ముత్తయ్య,జి.వెంకటేశ్వర్లు, కే.శ్రీను,వీరేందర్ రావు,యస్వీ చారి,ఏ.శ్రీనివాసు,డి. నాగయ్య, రాజనాల నాగమల్లేశ్వరరావు,బి సుధాకర్,ఎం.వసంత రెడ్డి,రంగా రామారావు,ఎం.వెంకటేశ్వర్లు,పి. విజయ్ కుమార్,కృష్ణమూర్తి కే.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల్లో ఘనంగా పోషణ మాసం

- గర్భిణీలకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన

**రాయికల్: సెప్టెంబర్ 16(ప్రజావాణి)** రాయికల్ మండలంలోని రామాజీపేట 2వ అంగన్వాడీ కేంద్రం మరియు ఇటిక్యాల 3వ అంగన్వాడీ కేంద్రాలలో బుధవారం పోషణ మాసం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

**రామాజీపేటలో :**

రామాజీపేట 2వ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బెజ్జంకి మోహన్, ఉప సర్పంచ్ సుదీర్, వార్డు సభ్యురాలు మర్రి కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్వైజర్ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి నరేష్ హాజరయ్యారు.

**ఇటిక్యాలలో :**

ఇటిక్యాల 3వ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ నీరటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, కార్యదర్శి టి.రాజేష్, వార్డు సభ్యులు మాలాని, సెక్టార్ సూపర్వైజర్ అనూహ్య, అంగన్వాడీ టీచర్ వి.సువర్ణ హాజరయ్యారు.ఈ రెండు కార్యక్రమాల్లో సూపర్వైజర్లు, టీచర్లు మాట్లాడుతూ



గర్భిణీలకు,బాలింతలకు, చిన్నారుల తల్లులకు పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. గర్భధారణ సమయంలో, ప్రసవానంతరం తల్లులు సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల తల్లి ఆరోగ్యంగా ఉండటంతో పాటు శిశువు ఎదుగుదల సక్రమంగా ఉంటుందని తెలిపారు. చిన్నారులకు పౌష్టికాహారం



అందించడం, పరిశుభ్రత పాటించడం, సకాలంలో టీకాలు వేయించడం, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై సూచనలు చేశారు.అనంతరం మహిళల చేత పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఐదు నెలల గర్భిణీలకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.రామాజీపేట కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు నాగెల్లి రమాదేవి, జుంబర్తి జమున, మండల నిషిత, ఆశా కార్యకర్తలు సూర మమత, నాగిరెడ్డి లతా, లావణ్య, వీఓఏలు రజియా, కవిత, ఆయాలు పాల్గొన్నారు.ఇటిక్యాల కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎన్ ఆర్ ఐ నిస్కాంత్ రెడ్డి

- శాలువాతో ఘనంగా సన్మానించినా విద్యార్థులు

**మద్దూరు సెప్టెంబర్ 16, ప్రజా వాణి,**మద్దూరు మండల కేంద్రంలో గల కేజీబీవీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తిని, వాటర్ ఆర్వో ప్లాంటును ఎన్ఆర్ఐ మర్మాముల గ్రామవాసి ఇప్ప నిష్కాంత్ రెడ్డి , కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్నతో కలిసి ప్రారంబించారు. గత కొన్ని రోజుల క్రితం మద్దూరు మండల కేంద్రంలో గల కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురైన విషయం తెలుసుకొని పాఠశాలలో గల సమస్యలను తెలుసుకొని, విద్యార్థులకు త్రాగునీరుకు సంబంధించిన ఆర్వో ప్లాంటు సరిగా పనిచేయని పరిస్థితిని గమనించి, దానికి అవసరమైన సుమారు 50 వేల విలువ గల స్టీల్ వాటర్ ట్యాంకు,ఫిల్టర్ లను,మోటార్లను బుదవారం నూతనంగా అమర్చి మధ్యాహ్న సమయంలో పాఠశాలలో గల భోజనాన్ని తనిఖీ చేసి తను కూడా స్వయంగా భోజనం చేసి, పాఠశాల ఉపాధ్యాయులను,భోజనాలను వండే సిబ్బందిని



సంతృప్తివ్యక్తంచేశారు.ఈ సహాయం చేసిన ఎన్నారై ఇప్ప నిషికాంత్ రెడ్డిని పాఠశాలల్లోని సుమారు 250 మంది విద్యార్థులు నిష్కాంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ మాట్లాడుతూ మీరు, మీ యొక్క కుటుంబ సభ్యులు ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ నిష్కాంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో మర్మాముల గ్రామ సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్,గాగిలాపూర్



సర్పంచ్ ఇట్టబోయిన కనక చంద్రం మర్మాముల గ్రామ శాఖ అధ్యక్షులు ఆలేటి విష్ణు, వార్డ్ మెంబర్ బంగ్లా సరితా సుధాకర్ రెడ్డి మరియు, శ్రీశైలం,ఐలయ్య యువకులు సాగర్,రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వోడితల రాజేశ్వర రావు జయంతి వేడుకలు

- హుజురాబాద్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తి రాజేశ్వరరావు



**ప్రజావాణి సెప్టెంబర్ 16** ఈ వేడుకలలో పాల్గొన్న హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వో డితల ప్రణవ్ హుజురాబాద్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ రాజేశ్వరరావు అని వారు చేసిన పనులే ఇప్పటికీ సాక్షాలుగా నిలుస్తున్నాయని వారు చూపిన బాటలో నడుస్తూ ప్రజలకు మరింత సేవ అందజేస్తామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వో డితల ప్రణవ్ అన్నారు బుధవారం రోజున మాజీ రాజ్యసభ సభ్యుడు వోడిత ల రాజేశ్వరరావు జయంతి సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్ లో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు రాజకీయాలకు అతీతంగా ఈ వేడుకల్లో పలువురు ఆయన అభిమానులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత హుజరాబాద్ ప్రాంతానికి పెద్ద దిక్కుగా ఇక్కడి అవసరాలకు తగ్గట్టుగా పలు అభివృద్ధి పనులు చేశారని ఆయన దురదృష్టం వల్ల ఈ సేవలు ఇప్పటి తరానికి కూడా ఉపయోగపడుతున్నాయని అన్నారు అనంతరం హుజరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు ఈ కార్యక్రమంలో హుజరాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ సువాసినీ కౌన్సిలర్ అధికార ప్రతినిధులు అన్ని మండలాల పట్టణ అధ్యక్షులు మహిళా అధ్యక్షులు ప్రజాప్రతినిధులు బ్లాక్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ బీసీ సెల్ మైనార్టీ సేవాలాల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కనక రత్నం మరియు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఎన్ ఎస్ ఎస్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మొక్కలు నాటే కార్యక్రమం

- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్





**జమ్మికుంట సెప్టెంబర్ 16 (ప్రజావాణి)**జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ సేవా పథకము ఎన్ ఎస్ ఎస్ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపల్ లెక్చరర్స్ విద్యార్థిని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ మానవాళి మనగడకు మొక్కలే ఆధారం కాబట్టి అమ్మ జన్మనిస్తే చెట్టు పునర్జన్మణిస్తుంది ప్రస్తుత వాతావరణ కాలుష్య పరిస్థితి దృశ్య ఈ కళాశాలలో చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులు మీ మీ నివాస ప్రాంతాలలో ఖాళీ ప్రదేశాలలో అందరూ మొక్కలు నాటడం ద్వారా మీ ఆరోగ్యంతో పాటు చుట్టుపక్కల వారి ఆరోగ్యాన్ని కూడా కాపాడిన వారు అవుతారు కాబట్టి అందరు కూడా మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించేలాగా కృషి చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్,ఓదెలు కుమార్ గణేష్,రాజేందర్,రవీందర్ ఎన్ఎస్ఎస్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# 80 అడుగుల రోడ్డు కోసం 180 భవనాల కూల్చివేత అవసరమా?

- కూల్చివేతలు లేకుండానే బైపాస్ రోడ్డు అభివృద్ధి చేస్తాం: జగ్గారెడ్డి

**మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 16( సంగారెడ్డి ) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి** సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి బసవేశ్వర విగ్రహం నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు కాలినడకన పర్యటించారు. రోడ్డు ప్రస్తుత విస్తీర్ణాన్ని అధికారులతో కొలిపించి, అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. బైపాస్ రోడ్డు అభివృద్ధి కోసం రూ.18 కోట్ల నిధులు మంజూరు చేయించానని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు, భవన యజమానులకు నష్టం కలగకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నదే తన ఉద్దేశమన్నారు. "80 అడుగుల రోడ్డు కోసం సుమారు 180 భవనాలను తొలగించాల్సి వస్తుంది. వారికి కోట్ల రూపాయల నష్టపరిహారం చెల్లించడం సాధ్యమా?" అని ప్రశ్నించారు.



కూల్చివేతలు లేకుండా సుమారు 50 అడుగుల రోడ్డును అభివృద్ధి చేసే అవకాశం ఉందని, దీనివల్ల ఇళ్లు, దుకాణాలు, మెట్లు తొలగించాల్సిన అవసరం ఉండదన్నారు. తాను నిధులు తీసుకొచ్చి రోడ్డు పనులు చేపడుతుంటే స్థానిక ఎమ్మెల్యే అధికారులకు ఫిర్యాదులు చేస్తూ పనులను అడ్డుకుంటున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు. హెచ్ఎండీఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు విజిలెన్స్‌కు కూడా ఫిర్యాదులు చేస్తున్నారని పేర్కొన్నారు.



దీంతో పనులు చేపట్టాల్సిన అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. "స్థానిక ఎమ్మెల్యేకు నిజంగా 80 అడుగుల రోడ్డు అవసరమని భావిస్తే ప్రజల మధ్యకు వచ్చి మాట్లాడాలి. బైపాస్ రోడ్డుపై ప్రజలకు కూల్చివేతల వల్ల కలిగే నష్టంపై స్పష్టత ఇవ్వాలి" అని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులకు నష్టం కలగకుండా, ఫుట్‌పాత్ వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా, వాహనదారులకు సౌకర్యంగా ఉండేలా బైపాస్ రోడ్డును అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు.

# చిన్నంబావి మండలంలో ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి ఏర్పాటు చెయ్యాలి

- రుద్రమోని ప్రశాంతి



**చిన్నంబావి ప్రజావాణి సెప్టెంబర్ 16** చిన్నంబావి మండల కేంద్రం ఏర్పాటు అయ్యి దాదాపు 10 సంవత్సరాలు అవుతున్నా చిన్నంబాయి మండలంలోని 17 గ్రామాలకు ప్రజలు అత్యవసర, ఆరోగ్య సమస్యలు వచ్చినపుడు చిన్నంబావి మండల కేంద్రములో ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలేకపోవడం వలన అత్యవసర సమయములో కొల్లాపూర్ లేదా వీపనగండ్లలలో గల ప్రభుత్వం ఆసుపత్రులకు వెళ్ళవలసి వస్తుంది అందువల్ల మహిళలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, చాలా ఇబ్బందులు గురవుతున్నారు. కాబట్టి ప్రజలు ఆరోగ్యపరంగా ఇబ్బంది పడకుండా చిన్నంబావి మండల ప్రభుత్వ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని రుద్రమోని ప్రశాంతి అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావుకి తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ తరుపున విజ్ఞప్తి చేస్తున్నానుఅన్నారు. చిన్నంబావి మండలం అయ్యవారిపల్లి గ్రామములో గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం లేకపోవడం వలన గ్రామానికి 1కిలోమీటర్ దూరములో ఉన్న రైతు వేదికలో లేదా గ్రామములో రచ్చకట్ట దగ్గర ప్రభుత్వ కార్యక్రములు నిర్వహిస్తున్నారు అందువలన గ్రామములోని ప్రజలుఇబ్బందులకు గురి అవుతున్నారు కావున మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి అయ్యవారిపల్లి గ్రామములో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం మంజూరు చేయాలని టిఆర్ఎస్ పార్టీ నాయకురాలు రుద్రమోని ప్రశాంతి కోరారు.

# కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ

- పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి: డీఎస్పీ సంపత్ రావు

**కొత్తపల్లి గోరి సెప్టెంబర్ 16 (మన ప్రజావాణి):-** కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్‌లో బుధవారం వార్షిక తనిఖీలో భాగంగా భూపాలపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీ ఏ. సంపత్ రావు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గణపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కరుణాకర్ రావు గారు, కొత్తపల్లి గోరి ఎస్ఐ శ్రీ ఎస్. త్రిలోక్ నాథ్ రెడ్డి డీఎస్పీ కి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.
తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, కేసు డైరీలు, క్రైమ్ రికార్డులు, సీసీటీఎన్ఎస్ నమోదు వివరాలు, పెండింగ్ కేసులు, వారెంట్లు, బీట్ బుక్స్, స్టేషన్ రికార్డులు, మాల్ఖానా తదితర రికార్డులను డీఎస్పీ పరిశీలించారు. అదేవిధంగా సిబ్బందికి డిపార్ట్‌మెంట్ ద్వారా అందజేసిన కిట్లు, వాటి నిర్వహణ, వినియోగ పరిస్థితిని కూడా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారం, నేరాల నియంత్రణ, ప్రజల నుంచి



అందుతున్న ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన పోలీస్



సేవలు అందించాలని డీఎస్పీ సూచించారు.
శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# TPCC-INTUC లేబర్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా భానూరి శివశంకర్ గౌడ్

- నియామకంపై చేవెళ్ల ప్రాంత కాంగ్రెస్ శ్రేణుల హర్షం



**చేవెళ్ల:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగమైన TPCC-INTUC లేబర్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా భానూరి శివశంకర్ గౌడ్ నియమితులయ్యారు. రాష్ట్ర TPCC-INTUC లేబర్ సెల్ చైర్మన్ రాంబా ప్రకాష్ గౌడ్, వైస్ చైర్మన్ నల్లా సంజీవరెడ్డి సంయుక్తంగా ఆయనను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. భానూరి శివశంకర్ గౌడ్ నియామకంపై చేవెళ్ల ప్రాంత కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలను గుర్తించి వారికి బాధ్యతలు అప్పగించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భానూరి శివశంకర్ గౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినాయకత్వానికి, TPCC-INTUC నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనను గుర్తించి ప్రోత్సహించిన రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, జిల్లా INTUC నాయకురాలు జ్యోతి భీమ్ భరత్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాష్ట్ర TPCC-INTUC లేబర్ సెల్ చైర్మన్ రాంబా ప్రకాష్ గౌడ్, వైస్ చైర్మన్ నల్లా సంజీవరెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామేనా భీమ్ భరత్ గారికి, తోలుకట్ట గ్రామ యువత కు పత్రికాముఖంగా కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తూ, కార్మికుల సమస్యలను సంబంధిత నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భానూరి శివశంకర్ గౌడ్ తెలిపారు.

# రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

**ముదిగొండ సెప్టెంబరు16 ప్రజావాణి ప్రతినిధి** ప్రభుత్వం చేపడుతున్న రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం ముదిగొండ మండల పరిధిలోని ఖానాపురం గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే ప్రక్రియ ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో భూ హక్కుదారిని తో పాటు, సరిహద్దు రైతుల సమక్షంలో జరగాలని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని నమ్మకంతో భూ రీ-సర్వే



కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.
సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి, వివరాలను గ్రామ పంచాయతీ, తహసీల్దారు కార్యాలయాలలో నోటీస్ బోర్డులో ఉంచుతామని, ఏలాంటి అభ్యంతరాలకు గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత



వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ తహసీల్దారు రవి కుమార్, అధికారులు, రైతులు,భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం గడువు పెంపు

- దరఖాస్తుల గడువు సెప్టెంబర్ 30 వరకు పొడిగింపు

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 16 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )**
బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించి, వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలనే ఉద్దేశంతో మా ప్రభుత్వం అమలు చేస్తున్న "ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం" దరఖాస్తుల స్వీకరణ గడువును 2026 సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగించడం జరిగింది. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1.19 లక్షల మంది అర్హులైన బీసీ మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీపై అందించనున్నాం. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 2026 సెప్టెంబర్ 30వ తేదీలోగా TGOBMMS పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. బీసీ మహిళలు ఇంటి నుంచే స్వయం ఉపాధి పొందే అవకాశాలను కల్పించడం, వారి కుటుంబాల ఆదాయాన్ని పెంపొందించడం, ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం. ఈ పథకానికి సంబంధించిన సమాచారం అర్హులైన ప్రతి మహిళకు చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని, అర్హులైన వారందరూ గడువులోగా దరఖాస్తు చేసుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగింది.

# రైతాంగ సమస్యలపై ఐక్య పోరాటాలు సాగిద్దాం

- కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతులపై పెట్టుబడి భారం
- చింతలపాలెంలో ఘనంగా రైతు సంఘం ర్యాలీ
- ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్

**చింతలపాలెం సెప్టెంబర్ 16 ( ప్రజావాణి ) :** దేశవ్యాప్తంగా రైతాంగ సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు నిర్మించాల్సిన అవసరం ఉందని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ పిలుపునిచ్చారు. 36వ రైతు సంఘం వారోత్సవాల సందర్భంగా చింతలపాలెం మండల కేంద్రంలో నిర్వహించిన రైతు ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా 36 మంది రైతులు సంప్రదాయ పంచకట్టుతో, 33 ట్రాక్టర్లు, 3



ఎడ్లబండ్లతో గ్రామంలో భారీ ర్యాలీ తీశారు. రైతాంగ పోరాట అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ?అనంతరం జరిగిన బహిరంగ సభలో విజూ కృష్ణన్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఎరువులు, విత్తనాలు, డీజిల్ ధరలు పెరిగి రైతులపై పెట్టుబడి భారం తీవ్రమైందని ఆరోపించారు. రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాల నిబంధనలను కేంద్రం దొడ్డిదారిన అమలు చేస్తూ కార్పొరేట్ సంస్థలకు మేలు చేస్తోందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు ' సీ టూ యాభై %' ఫార్ములాతో కనీస మద్దతు ధరకు ఎం ఎస్ పి చట్టబద్ధమైన గ్యారెంటీ ఇవ్వాలని, ఉచిత విద్యుత్ కొనసాగించి, రుణభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.
కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, తీగల సాగర్, జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పందిరి సాగుకు ఎకరాకు లక్ష రూపాయల సబ్సిడీ - రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి కె.లత




**రాయికల్ ;సెప్టెంబర్ 16(ప్రజావాణి)** జగిత్యాల జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ అధికారి కె.లత బుధవారం రాయికల్ మండలంలోని మూటపల్లి గ్రామంలో పర్యటించి పందిరి సాగు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతు అంబటి మహేష్ సాగు చేస్తున్న పందిరి కూరగాయల తోటను ఆమె పరిశీలించి, సాగు విధానం, దిగుబడి, ఎదుర్కొంటున్న సమస్యలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి కె.లత మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణంలో ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని, అందువల్ల నీటి వినియోగం తక్కువగా ఉండి, తక్కువ కాలంలో అధిక దిగుబడినిచ్చే పందిరి విధానంలో కూరగాయల సాగు చేయడం రైతులకు ఎంతో లాభదాయకమని సూచించారు. పందిరి సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ. లక్ష వరకు సబ్సిడీ అందిస్తోందని, ఈ అవకాశాన్ని జిల్లాలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆసక్తి ఉన్న రైతులు తమ సమీప ఉద్యాన అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి ఐలయ్య, ఉద్యాన విస్తరణ అధికారి బి.రాజేష్ నాయక్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పనిచేయాలి

- ఎంపీడీవో బింగి చిరంజీవి



**రాయికల్; సెప్టెంబర్ 16 (ప్రజావాణి)** రాయికల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో బింగి చిరంజీవి, ఎంపీవో సుష్మా, ఏపీవో దివ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చిరంజీవి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవంలో భాగంగా ప్రతి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని, నాటిన మొక్కలను సంరక్షించే పూర్తి బాధ్యత పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్లదేనని స్పష్టం చేశారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు, రైతులకు సాగునీటి కొరత తీర్చేందుకు ప్రతి గ్రామంలో వ్యక్తిగత ఫారమ్ పాండ్స్ (వ్యవసాయ కుంటలు), కమ్యూనిటీ ఫారమ్ పాండ్స్ తవ్వకాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. వ్యక్తిగత ఫారమ్ పాండ్స్ కొరకు అర్హులైన రైతులను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి నంబరుకు మొబైల్ నంబరు లింక్ చేసే ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని, ఇది ప్రభుత్వ పథకాల అమలుకు, ఆస్తి పన్ను వసూలుకు కీలకమని తెలిపారు. పెండింగ్ లో ఉన్న అన్ని పనులను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు,ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్ జామా మసీద్ ఇమామ్ ఇమాముద్దీన్ సాహెబ్ కన్నుమూత

● నమాజ్ చేస్తుండగానే గుండెపోటుతో మృతి - ముస్లిం సమాజంలో తీవ్ర విషాదం



**రాయికల్, సెప్టెంబర్ 16 (ప్రజావాణి)** రాయికల్ పట్టణ జామా మసీద్ ఇమామ్ జనాబ్ ఇమాముద్దీన్ సాహెబ్ ఆకస్మికంగా కన్నుమూశారు. మంగళవారం మధ్యాహ్నం అసర్ నమాజ్ నిర్వహిస్తున్న సమయంలో ఆయనకు తీవ్ర గుండెపోటు రావడంతో మసీదులోనే తుదిశ్వాస విడిచినట్లు మసీదు కమిటీ తెలిపింది. ఇమాముద్దీన్ సాహెబ్ రాయికల్ జామా మసీద్ లో చాలా సంవత్సరాలుగా ఇమామ్ గా సేవలందిస్తూ, స్థానిక ముస్లిం సమాజానికి మతపరమైన అంశాలలో మార్గదర్శకత్వం వహించారు. ఆయన ఎంతో సౌమ్యుడిగా, అందరితో కలివిడిగా ఉంటూ ప్రజల మన్ననలు పొందారు. ఆయన ఆకస్మిక మృతి వార్త తెలుసుకున్న రాయికల్ పట్టణ ముస్లిం సమాజంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, జామా మసీద్ కమిటీ సభ్యులు, మత పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు మసీదుకు చేరుకొని మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# నెల 19న కోదాడలో మెగా జాబ్ మేళా: యువతకు ఉద్యోగ బాటలు



**కోదాడ, సెప్టెంబర్ 16(ప్రజావాణి న్యూస్)**కోదాడ నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 19న పట్టణంలోని సీసీ రెడ్డి విద్యా నిలయం ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు పులి వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఈ మేళాలో సుమారు 200 నుండి 250 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఐటీఐ అర్హతలు గల అభ్యర్థులకు కంపెనీ ప్రతినిధులు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తారని వెల్లడించారు. నిరుద్యోగ యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఇంటర్వ్యూలకు పెద్ద సంఖ్యలో హాజరై ఉద్యోగాలు సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ముత్యాలమ్మ టెంపుల్..

● గణపతి ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ



**ప్రజావాణి,ఇనుగుర్తి:** మండలంలోని చిన్ననాగారం ముత్యాలమ్మ టెంపుల్ కళావేదిక వద్ద ముత్యాలమ్మ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ మహాగణపతి ఆలయం వద్ద కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బైరు శ్రీనివాస్ గౌడ్ రజిత దంపతులు కూతురు సోనీలు బుధవారం మహాన్న ప్రసాద వితరణ ఘనంగా నిర్వహించారు. సుమారు 500 మంది భక్తులు మహాన్న ప్రసాద వితరణను స్వీకరించారు. ఇంతకు మునుపు శ్రీనివాస్ గౌడ్ కుటుంబం స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలలో అన్న ప్రసాద వితరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకమండలి తో పాటు వివిధ పార్టీల నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌పై వివాదాస్పద పుస్తకాన్ని నిషేధించాలి

● టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి



**నంగునూరు, సెప్టెంబర్ 16 (ప్రజావాణి):**భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ రాస్తున్న పుస్తకాన్ని నిషేధించాలని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి డిమాండ్ చేశారు. బుధవారం నంగునూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని, దేశంలోని అణగారిన వర్గాల హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన జీవితాంతం పోరాడారని పేర్కొన్నారు. అలాంటి మహనీయుడి ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా అసత్యాలు, కల్పిత అంశాలతో పుస్తకాలు రాయడం సరికాదని యాదగిరి అన్నారు. అంబేద్కర్‌ను అవమానించేలా లేదా ఆయనపై ప్రజల్లో అపోహలు, విద్వేషాలు కలిగించేలా ఉన్న అంశాలను తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. సంబంధిత అధికారులు పుస్తకంలోని అంశాలను పూర్తిగా పరిశీలించాలని, అభ్యంతరకరమైన విషయాలు ఉన్నట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భావప్రకటన స్వేచ్ఛ పేరుతో మహనీయుల గౌరవాన్ని కించపరిచే చర్యలను ప్రోత్సహించ కూడదన్నారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని యాదగిరి పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలు, సమానత్వం, సామాజిక న్యాయం వంటి ఆయన ఆశయాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు, అవమానకరమైన ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి, పుస్తకంలోని అభ్యంతరకర అంశాలపై తగిన విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకోవాలని దేవులపల్లి యాదగిరి కోరారు.

# పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించలేని పదవి ఎందుకు..?

● అధికారులతో సర్పంచులు వాగ్వాదం రాజీనామా చేస్తామంటే హెచ్చరిక!
● గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: సర్పంచులు







**చిన్నంబావి, ప్రజావాణి సెప్టెంబర్ 16** చిన్నంబావి మండల సర్వసభ్య సమావేశం బుధవారం వాడీవేడిగా, రసవత్తరంగా సాగింది. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో ఆదర్శ్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి రఘునాథ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం ప్రారంభమైన అనంతరం పలు గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అంశంపై సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో సొంత ఇళ్లు లేని పేద కుటుంబాలు అనేకం ఉన్నాయని, కొందరు శిథిలావస్థకు చేరిన ఇళ్లలో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం పేదలు దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ఇప్పటికీ మంజూరు కావడం లేదని సర్పంచులు పేర్కొన్నారు. ప్రతిరోజూ గ్రామాల్లో ప్రజల మధ్య తిరుగుతున్న సమయంలో "మాకు ఇందిరమ్మ ఇల్లు ఎప్పుడు వస్తుంది? మా ఇళ్లు కూలిపోయే పరిస్థితిలో ఉన్నాయి.." అంటూ ప్రజలు తమను ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించలేని పరిస్థితిలో తాము ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

**"పేదోడికి ఇల్లు ఇప్పించలేని అధికారం లేనప్పుడు సర్పంచ్ పదవిలో కొనసాగడం ఎందుకు?**

ప్రజల చేత ఎన్నుకోబడిన మాకు కనీసం అర్హులైన పేదలకు ఇళు మంజూరు చేయించే అవకాశం లేకపోతే పదవులు ఎందుకు?" అంటూ కొందరు సర్పంచులు అధికారులను నిలదీశారు. తమకు ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడి తీవ్రంగా ఉందని, సమస్యలను పరిష్కరించలేకపోతే సర్పంచ్ పదవులకు రాజీనామా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. దీంతో సమావేశంలో కొంతసేపు వాగ్వాద వాతావరణం నెలకొంది.

**గ్రామ సమస్యలపై సర్పంచుల నిలదీత**

గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్ల మధ్య నిలుస్తోందని పలువురు సర్పంచులు తెలిపారు. వీధి దీపాలు పనిచేయక రాత్రివేళ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. కొన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణం, మరమ్మతులు పూర్తికాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు ప్రతిసారి నిధులు లేవనిచెబుతున్నారని, దీంతో గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అధికారులు పరిశీలించి, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని కోరారు.

**అధికారులకు ప్రత్యేక అధికారి సూచనలు**

సర్పంచులు లేవనెత్తిన సమస్యలపై మండల ప్రత్యేక అధికారి రఘునాథ్‌రెడ్డి స్పందించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీటి వనరుల పరిరక్షణ, నీటి పొదుపు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సూచించారు.

**సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి**

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని సమావేశంలో చర్చించారు. చివరి లబ్ధిదారుడి వరకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా క్షేత్రస్థాయి అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. పథకాల అమలులో పారదర్శకత పాటించాలని,అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం కూడా పథకాలకు దూరం కాకుండా చూడాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని అధికారులు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని తెలిపారు.

**నీటి సంరక్షణపై దృష్టి ఏపీవో ధనంజయరాజు**

ఏపీఓ ధనుంజయరాజు మాట్లాడుతూ వర్షపు నీటిని భూగర్భ జలాల పెంపునకు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు, ఫార్మ్‌పాండ్లు, ఊటకుంటలు, బోర్ రీచార్జ్ నిర్మాణాలు చేపట్టడంతో పాటు పండ్ల తోటలు, మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు.

**సమావేశంలో అస్వస్థతకు గురైన ఏపీఎం**

మండల సర్వసభ్య సమావేశం జరుగుతున్న సమయంలో ఏపీఎం అనిల్‌కుమార్ అకస్మాత్తుగా అస్వస్థతకు గురై కుర్చీపై నుంచి కిందపడిపోయారు. లోబీపీ కారణంగా ఆయన అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. వెంటనే అక్కడున్న అధికారులు, సిబ్బంది ఆయనను పైకి లేపి అవసరమైన సహాయం అందించారు. గతంలో జరిగిన ప్రమాదం కారణంగా ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, ప్రస్తుతం ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అనిల్‌కుమార్ తెలిపారు.

**సమన్వయంతో అభివృద్ధికి కృషి**

మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. గ్రామాల్లో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కార మార్గాలు చూపాలని అధికారులు తెలిపారు.

ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీవో ఆదర్శ్‌గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీపీ రామస్వామి, ఏపీఓ ధనుంజయరాజు, వివిధ శాఖల అధికారులు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# 7వ వార్డులో రోడ్డుపై అక్రమ కట్టడాల కలకలం ప్రజల రాకపోకల దారినే ఆక్రమించారా

● గోడలు మెట్లురోడ్డుపై నిర్మాణాలతో ఇబ్బందులు
● అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలి
● మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామికి దుర్గా కాలనీవాసుల వినతి



**జమ్మికుంటసెప్టెంబర్ 16 (ప్రజావాణి)**జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు దుర్గా కాలనీలో రహదారి ఆక్రమణలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ స్కూల్ మెయిన్ రోడ్డు నుంచి హాస్టల్ వరకు ఉన్న మున్సిపల్ సీసీ రోడ్డుపై కొందరు నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొంటూ, వాటిని పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను తొలగించాలని కోరుతూ దుర్గా కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామికి వినతిపత్రంసమర్పించారువిద్యుత్ స్కూల్ మెయిన్ రోడ్డు నుంచి హాస్టల్ వరకు ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే సీసీ రోడ్డుపై గోడలు, మెట్లు, ఇతర నిర్మాణాలు చేపట్టడంతో రహదారి వినియోగానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కాలనీవాసులు తెలిపారు. ప్రజల రాకపోకలకు ఉపయోగపడాల్సిన మున్సిపల్ రహదారి ఆక్రమణలకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారురోడ్డును ఆక్రమించి నిర్మించినట్లు పేర్కొంటున్న గోడలు, మెట్లు, కటకాలు తదితర నిర్మాణాలను మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. రహదారి హద్దులను గుర్తించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు తేలితే వాటిని తొలగించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారురోడ్డు ప్రజల కోసం ఆక్రమణలకు కాదు అని పేర్కొంటూ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని కాలనీవాసులు కోరుతున్నారు మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి రహదారిని పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలనివిజ్ఞప్తిచేశారు రహదారిపై నిర్మాణాల కారణంగా భవిష్యత్తులో మరింత ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని సమస్యను ఇప్పుడే పరిష్కరించాలని స్థానికులు కోరారుప్రజల రాకపోకలకు ఆటంకంగా ఉన్న నిర్మాణాలను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని తొలగించి రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారుఈ కార్యక్రమంలో రాధ రాంబాబు మీడివెల్లి సంపత్ మారేల్ల రవి రాధ నరేష్ చొప్పరి సదానందం చొప్పరి రాము ఒద్ది శ్రీకాంత్ రాధ భారత్ ముకుంద సాయి వంశీ మూడేడ్ల గణేష్ పకిడె మణికంత పెంతల సురేందర్ బోల్లం రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# మామిడిలో సమగ్ర సస్యరక్షణపై రైతు వేదిక లో రైతులకు శిక్షణ

● సరైన యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు సాధించాలి
● కేవీకే శాస్త్రవేత్త శ్రీకృష్ణ



**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మంచాల, సెప్టెంబర్ 17 :**మామిడి పంటలో సమగ్ర సస్యరక్షణ, పోషక యాజమాన్యంపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు మంచాల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కేవీకే శాస్త్రవేత్త శ్రీకృష్ణ, ఏడీహెచ్ అరుణ, హెచ్ఓ నవీనా, హెచ్ఈఓలు నగేష్, సీతారామతో పాటు పలువురు రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త శ్రీకృష్ణ మాట్లాడుతూ మామిడి రైతులు సరైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా నాణ్యమైన పంటతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. మామిడిలో పూత, కాత దశలో 13-0-45ను 10 గ్రాములు, బోరాన్‌ను 1 గ్రాము, కాన్ఫిడార్ లేదా ఇమిడాక్లోప్రిడ్‌ను 0.5 మిల్లీలీటర్ చొప్పున ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. నిమ్మకాయ పరిమాణ దశలో యూరియాను వినియోగించాలని, బత్తాయి కాయ పరిమాణ దశలో లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏజిటీసీ కంపెనీకి చెందిన ఆకర్షకాలను కూడా వినియోగించవచ్చని తెలిపారు. మామిడి తోటల్లో జూన్, జూలై నెలల్లో అవసరమైన కొమ్మల కత్తిరింపులు చేపట్టి, తోటలో గాలి, వెలుతురు ప్రసరణ మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏడీహెచ్ అరుణ మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం ద్వారా సుస్థిర వ్యవసాయానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సేంద్రీయ విధానాల్లో ఉత్పత్తి కొంత తగ్గినప్పటికీ, నాణ్యత పెరగడం వల్ల పంటకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణలో మామిడి పంటలో సమగ్ర సస్యరక్షణ, పోషక యాజమాన్యం, పురుగుల నివారణ, లింగాకర్షక బుట్టల వినియోగం, కొమ్మల కత్తిరింపు తదిత

# అర్హులైన ఎస్టీ కుటుంబాలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

**● జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్**





**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి సెప్టెంబర్ 16**గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం (ప్రజాకలం జిల్లా ప్రతినిధి): జిల్లాలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల పరిరక్షణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి జిల్లా అధికారులతో గిరిజనుల సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు

సిఫారసులకు తావులేకుండా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో సిఫారసుల ఆధారంగా ఇళ్లు మంజూరు అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయని, అటువంటి పరిస్థితులను సరిదిద్దాలని సూచించారు. అర్హత కలిగిన ఎస్టీ కుటుంబాలకు ఎలాంటి సిఫారసులకు తావులేకుండా నిబంధనల ప్రకారం ఇళ్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

అర్హులైన ప్రతి ఎస్టీ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

ప్రతి గిరిజన కుటుంబానికి తాగునీటి కుళాయి కనెక్షన్

గిరిజన కుటుంబాలు నివసించే ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాటోత్ హుస్సేన్ సూచించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.గ్రామ కార్యదర్శులు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఉందో లేదో పరిశీలించాలని, నీటి వృథా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు

రహదారులు, వంతెనలు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలి

పట్టణాలు, గ్రామాల్లో ఎస్టీ ప్రజలు నివసించే ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను సక్రమంగా చేపట్టి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లాలో అవసరమైన రహదారులు, వంతెనలకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో సుమారు 12 వేల మంది ఎస్టీ జనాభా

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. పెద్దపల్లి జిల్లాలో మొత్తం సుమారు 7.9 లక్షల జనాభా ఉండగా, అందులో సుమారు 12 వేల మంది ఎస్టీ జనాభా ఉన్నారని తెలిపారు. జిల్లాలో ఎస్టీ జనాభాలో ప్రధానంగా ఎరుకల, లంబాడా సామాజిక వర్గాల వారు ఉన్నారని వివరించారు.

ఎస్టీ జనాభాలో అధిక శాతం కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నందున వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఎస్టీలకు 204 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

పెద్దపల్లి జిల్లాలో ఎస్టీ వర్గాలకు 204 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 46 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.2,310 ఇళ్లకు సౌర విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటు ధర్మారం మండలం నంది మేడారం గ్రామాన్ని పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద మోడల్ గ్రామంగా ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామంలోని 2,310 ఇళ్లకు సౌర విద్యుత్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

గిరిజన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి

గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి, భూ సమస్యలు, ఇతర మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. ఎస్టీ కుటుంబాలకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి చేరేలా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎస్టీ కమిషన్ డైరెక్టర్ పి. కళ్యాణ్ రెడ్డి, అదనపు కలెక్టర్లు జె. అరుణ శ్రీ, జె సి బి. శ్రీరాములు, డీసీపీ రాంరెడ్డి, గిరిజన అభివృద్ధి అధసంగీత, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తనుగుల గ్రామంలోఆస్తి కోసం రాజబాబును రక్తసంబంధీకులే హత్య చేశారు

- 24 గంటల్లో హత్య కేసును ఛేదించిన పోలీసులు
- చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన
- పోలీసులు కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారుపోలీసులు విచారణ
- తల్లి సోదరి బావతో సహా ఏడుగురుపై కేసు నమోదు చేసిన
- పట్టణ సీఐ రామకృష్ణ పోలీసు సిబ్బంది



**జమ్మికుంట సెప్టెంబర్ 16 (ప్రజావాణి)**జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని తనుగుల గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో బొజ్జపల్లి రాజబాబు అనే వ్యక్తి హత్యకు గురైన సంఘటనకు సంబంధించి జమ్మికుంట పోలీసులు కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారుపోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారంమృతుడు బొజ్జపల్లి రాజబాబు తన తల్లి ఏ-3.బొజ్జపల్లి లచ్చమ్మకు చెందిన భూమి విషయంలో కుటుంబ సభ్యులతో తరచూ వివాదాలకు దిగేవాడు సదరు భూమిని విక్రయించాలని రాజబాబు కోరగా కుటుంబ సభ్యులు అందుకు అంగీకరించకపోవడంతో వారితో తరచూ గొడవపడుతూ దూషిస్తూ అసభ్యంగా ప్రవర్తించేవాడని విచారణలో తెలిసిందిఈ నేపథ్యంలో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి, సదరు భూమిని మూడు వాటాలుగా విభజించి ఒక వాటాను తల్లి లచ్చమ్మకు ఒక వాటాను రాజబాబుకు మరో వాటాను రాజబాబు తమ్ముడు కుమార్ కుమార్తె సిరిచందనకు ఇవ్వాలని సూచించారుఅయితే రాజబాబు అందుకు అంగీకరించకుండా భూమి మొత్తం తనకే చెందాలని పట్టుబట్టాడు. దీంతో గత 8 నెలలుగా లచ్చమ్మ జమ్మికుంటలో అద్దెకు ఉంటోంది

గత పది రోజుల క్రితం తన బిడ్డ ఇంటికి ఏ-3 కవిత వద్ద, లచ్చమ్మ తనుగుల గ్రామంలో వెళ్లింది నివసిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాజబాబు కుటుంబ సభ్యులపై కక్ష పెంచుకున్నాడు.తేదీ:10-09-2026న మధ్యాహ్నం సుమారు 1.00 గంటల సమయంలో రాజబాబు అధికంగా మద్యం సేవించి తనుగుల గ్రామంలో నివాసం ఉంటున్న తన బావ అయిన ఏ-1 జూపాక శంకర్ ఇంటికి వచ్చాడు అక్కడ ఉన్న తన తల్లి ఏ-3 లచ్చమ్మ, తన అక్క ఏ-2 కవితతో గొడవకు దిగాడు కుటుంబ సభ్యులు అతడిని వారించేందుకు ప్రయత్నించినప్పటికీ రాజబాబు తన తల్లి లచ్చమ్మ వెంట్రుకలు పట్టుకుని లాగడంతో అక్కడ తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది

ఈ సమయంలో అప్పటికే మద్యం సేవించి ఉన్న ఏ-7 జూపాక శంకర్, ఏ-4. చేతి వెంకటేష్, ఏ-6.మారపెల్లి రాజయ్య ఏ-5 జూపాక సతీష్ తదితరులు కలిసి రాజబాబును పట్టుకుని చేతులతో కొట్టి మంచంపై పడవేసినట్లు విచారణలో వెల్లడైంది అనంతరం అతని చేతులు కాళ్లను మంచానికి కట్టి ఉంచినట్లు తెలిసింది. ఆ తర్వాత జూపాక శంకర్ చున్నీతో రాజబాబు మెడకు బిగించి పట్టుకోవడంతో అతడు మృతి చెందినట్లు పోలీసుల విచారణలో వెల్లడైందిరాజబాబు మృతి చెందినట్లు నిర్ధారించుకున్న అనంతరం నిందితులు ఈ సంఘటనను దాచిపెట్టే ఉద్దేశంతో మృతదేహాన్ని దుప్పటిలో చుట్టారు. అదే రాత్రి ఏ-1 జూపాక శంకర్, ఏ-6 మారపెల్లి రాజయ్య ఏ-7. జూపాక శంకర్ ఎస్/ఓ లేట్ రామయ్య కలిసి మృతదేహాన్ని సైకిల్‌పై తరలించితనుగుల గ్రామ శివారులోని శంకర్‌కు చెందిన పొలానికి తీసుకెళ్లారు అక్కడ పార గడ్డపారలతో గుంత తవ్వి మృతదేహాన్ని అందులో పూడ్చిపెట్టి పైభాగంలో మట్టి తుమ్మ పొరకతో కప్పి, ఎవరూ గుర్తించకుండా చేసినట్లు విచారణలో వెల్లడైంది

పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులుమృతదేహాన్ని పూడ్చేందుకు ఉపయోగించిన పార, గడ్డపార, మృతదేహాన్ని తరలించేందుకు ఉపయోగించిన సైకిల్, రాజబాబు మెడ బిగించేందుకు ఉపయోగించిన చున్నీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారుజమ్మికుంట పోలీసుల విజ్ఞప్తి

భూ వివాదాలు కుటుంబ సమస్యలు లేదా ఇతర వ్యక్తిగత వివాదాల విషయంలో ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించి చట్టపరమైన మార్గంలో పరిష్కారం పొందాలని జమ్మికుంట పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు

# గణపతి ఉత్సవాల్లో డీజేలకు నో ఎంట్రీ - నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్సై డి. సుధాకర్

**● డీజే నిర్వాహకులకు తహసీల్దార్ ముందు బైండోవర్**

**రేగొండ, సెప్టెంబర్ 16 (ప్రజావాణి):** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో నిబంధనలు పాటించకుండా డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని రేగొండ ఎస్సై డి. సుధాకర్ హెచ్చరించారు.బుధవారం రేగొండ మండలంలోని పలువురు డీజే నిర్వాహకులను మండల తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. మండపాల వద్ద విగ్రహ ఏర్పాటు నుండి నిమజ్జన శోభాయాత్ర వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలు ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు. డీజేల వల్ల వచ్చే అధిక శబ్దం కారణంగా చిన్నారులు, వృద్ధులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి ప్రాణాలకే




ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేసి ప్రజలను



ఇబ్బందులకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు సౌండ్ సిస్టమ్ లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

# ఏజెన్సీలో గర్భం దాల్చిన ఇద్దరు మైనర్ బాలికలు.

**● పోక్సో కేసు నమోదు. ● ఎస్ఐ ప్రశాంత్ బాబు.**

**ప్రజావాణి బయ్యారం,,సెప్టెంబర్ 16.**

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని మారుమూల ఏజెన్సీ గ్రామాలకు చెందిన ఇద్దరు మైనర్ బాలికలు గర్భం దాల్చిన దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.పరిస్థితి తీవ్రతను గమనించిన జిల్లా ఐసిడిఎస్ అధికారులు ఆ బాలికలను రక్షణ కల్పిస్తూ సంరక్షణ కోసం 'బాల రక్షక్ భవన్' కు తరలించినట్లు తెలిపారు.ఈ ఘటనపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.విజయ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బయ్యారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.అధికారుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రశాంత్ బాబు పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి,దర్యాప్తు వేగవంతం చేసినట్లు తెలిపారు.

# పి ఆర్ టి యు టీఎస్ లో చేరిక



**పెద్దవంగర సెప్టెంబర్ 16 ప్రజావాణి** టీచర్స్ బడి వెబ్సైట్ ద్వారా సేవలు అందించిన, చిట్టి జాబిలి చానెల్ సృష్టి కర్తగా, టి ఎల్ ఎం మేకర్ గా, వర్క్ షీట్స్ రూపకర్త గా తెలిసిన, సుపరిచితుడు అయిన, ప్రస్తుతం యుపిఎస్ చిన్న వంగర లో పని చేస్తున్న వేముల ప్రకాష్ అనే ఉపాధ్యాయుడు టిపిటిఎఫ్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి పి ఆర్ టి యు టీఎస్ లో చేరినాడు. గత 20 నెలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి పని తీరుకు ఆకర్షితులై, ఉపాధ్యాయ సంఘాలలో అతి పెద్ద సంఘమైన పి ఆర్ టి యు టీఎస్ వల్ల మాత్రమే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించబడుతాయి అనే విశ్వాసంతో పి ఆర్ టి యు టీఎస్ లో చేరుతున్నానని తెలియ పరిచినాడు. పి ఆర్ టి యు టీఎస్ పెద్దవంగర మండల శాఖ అధ్యక్షుడు గంగిశెట్టి రమేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎండి . యాకూబ్ పాషా సభ్యత్వ నమోదు రసీదు ఇచ్చి ఆహ్వానించగా, ఈ కార్యక్రమంలో సంఘ సీనియర్ సభ్యులు జీ. యాకుబ్ రెడ్డి మరియు గూగులోతు నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# నిధులు మంజూరు చేయకుంటే రాజీనామాకు సిద్ధం

**● ఆర్మూర్ రెవెన్యూ కార్యాలయాల కోసం అసెంబ్లీలో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి డిమాండ్**



**ఆర్మూర్ టౌన్ సెప్టెంబర్ 16 (మన సమగ్ర ప్రజావాణి):**తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఆర్మూర్ నియోజకవర్గంలోని రెవెన్యూ కార్యాలయాల సమస్యను ప్రస్తావించారు. ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల గురించి పలుమార్లు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్మూర్‌లో రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి రూ.27 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి కోరారు. మంత్రులు, ముఖ్యమంత్రి తమ నియోజకవర్గాలకు నిధులు ఎలా కేటాయించుకుంటున్నారనే వివరాలు తమ వద్ద ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. తమ నియోజకవర్గానికి కూడా అవసరమైన మేరకు నిధులు కేటాయించి ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు.ఆర్మూర్ నియోజకవర్గంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోతే తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నానని రాకేష్ రెడ్డి అసెంబ్లీలో స్పష్టం చేశారు.

# కొత్తగూడ ఇండియన్ బ్యాంక్ సందర్శన

**● జోనల్ మేనేజర్ సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో**





**కొత్తగూడ మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 16. (మన సమగ్ర ప్రజావాణి):** –మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండల కేంద్రం లోని ఇండియన్ బ్యాంకును మల్కాజ్‌గిరి జోనల్ మేనేజర్ సాయిప్రసాద్ బుధవారం రోజున సందర్శించారు. బ్యాంక్ మేనేజర్ సురేష్‌తో మాట్లాడి ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రుణాలు, రైతులకు క్రాప్ లోన్లు ను తొందరగా అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా ముస్మి రాజేశ్వరి మహిళా సంఘం సభ్యులు బోడ లక్ష్మీపార్వతి, దేవేందర్‌కు షీ బైక్ లోన్ మంజూరు చేశారు. అనంతరం బ్యాంకు సిబ్బంది, బ్యాంక్ మిత్రులు జోనల్ మేనేజర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

# మహిళల ఆర్థిక స్వలంబనకు ఐటీసీ బంధన్ అండ

**● అవకాశాలను అందిపుచ్చుకొని మహిళ లు ఆర్థికంగా ఎదగాలి ,.**

**● ఏపీఎం మేసాల హేమంతిని**



**బూర్గంపాడు సెప్టెంబర్ 16 (ప్రజావాణి ) న్యూస్,.** మహిళలు తమకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని, ఏపీఎం మేసాల హేమంత్ ని సూచించారు . బూర్గంపాడు లోని బంజారా బజార్లో బుధవారం మహిళా అభ్యర్థులకు రీఫ్రేషర్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ఆర్థిక స్వలంబన సాధించి కుటుంబాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలన్నారు. ఐటీసీ నుండి వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా అభ్యర్థులు తమ యొక్క అనుభవాలను ఏపీఎం తో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ భూక్య. కుమార్, ఏసీ ఉత్తమ్, మార్జిన్, ఏడిఎస్సిమెంబెర్ పండగ రాములు,సీసీ సుజాత తో పాటు పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు

# శ్రీరత కుటుంబానికి పిఆర్టియు చెక్కు అందజేత



**ప్రజావాణి,నెల్లికుదురు:**స్కూల్ అసిస్టెంట్ శ్రీలత ఇటీవల కన్నుమూయడంతో ఆమె కుటుంబానికి పిఆర్టియు ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు .పిఆర్టియు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు మిరియాల సతీష్ రెడ్డి,నెల్లికుదురు మండల అధ్యక్షులు సొంటి రెడ్డి యుగేందర్ రెడ్డి బుధవారం మృతురాలు ఇంటిని సందర్శించి స్వర్గీయ శ్రీలత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.శ్రీలత మేడం అకాల కన్నుమూత బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులను పరామర్శించారు.పిఆర్టియు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. స్వర్గీయ శ్రీలత పిఆర్టియు సభ్యురాలు కావడంతో సంబంధిత సంఘం నుంచి రూ.1,00,000 ఇన్సూరెన్స్ చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు సతీష్ రెడ్డి, యుగేందర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి, యుగేందర్ రెడ్డి మాట్లాడుతూ సంఘం సభ్యులకు పిఆర్ టి యు ఆపద సమయంలో అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, సంతోష్,ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# గంట శివలింగయ్య మృతదేహానికి సింగిల్ విండో చైర్మన్ నివాళి





**ప్రజావాణి బయ్యారం, సెప్టెంబర్ 16:** బయ్యారం మండలం వెంకట్రాంపురం గ్రామానికి చెందిన గంట ఐలయ్య తండ్రి గంట శివలింగయ్య గుండె సంబంధిత అనారోగ్యంతో మహబూబాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు మృతి చెందారు. విషయం తెలుసుకున్న బయ్యారం సహకార సంఘం చైర్మన్ బండారి మల్లయ్య బుధవారం వెంకట్రాంపురం గ్రామానికి చేరుకుని గంట శివలింగయ్య మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శివలింగయ్య మృతి బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం పాలకవర్గ సభ్యులు కసనబోయిన శ్రీనివాస్, గాడుదుల కేతమల్లు, నుద్దునూరి యశోదలింగయ్య, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కంబాల ముసలయ్య, కాంగ్రెస్ నాయకులు ఏనుగుల రంజిత్, కోడి అరుణ్, రైతు కూలీ సంఘం నాయకుడు దొడ్డి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారం గ్రామపంచాయతిలో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం.

- నూతన బోర్ వెల్‌కు సర్పంచ్ శంకుస్థాపన.



**ప్రజావాణి ?బయ్యారం,,సెప్టెంబర్ 16.** బయ్యారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని రంగాపురం వాటర్ ట్యాంక్ ద్వారా ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం నూతన బోర్ వెల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామపంచాయతీ నిధులతో ఈ పనులను చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ?రంగాపురం వాటర్ ట్యాంక్‌కు ఇప్పటివరకు కేవలం మిషన్ భగీరథ కనెక్షన్ మాత్రమే ఆధారంగా ఉండేది. ప్రత్యామ్నాయ నీటి వనరులు ఏవీ లేకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన సర్పంచ్ శాంతి కిషన్ నాయక్, తక్షణమే స్పందించి నూతన బోర్ వేయించేందుకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా సమయానుకూలంగా చర్యలు తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్, పాలకవర్గానికి రంగాపురం గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులు, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు

# సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



**ప్రజావాణి బయ్యారం, సెప్టెంబర్ 16:** బయ్యారం మండలం కోటగడ్డ గ్రామానికి చెందిన సిరిగద్దె రమేష్ సతీమణి ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందారు. చికిత్సకు అయిన ఖర్చులకు ఆర్థిక సహాయం కోరుతూ రమేష్ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఆయన దరఖాస్తు మేరకు మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్ సహకారంతో, ఇల్లందు శాసనసభ్యుడు కోరం కనకయ్య నాయకత్వంలో రూ.20 వేల విలువైన సీఎం సహాయ నిధి చెక్కు మంజూరైంది. ఈ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గ సభ్యుడు జూలకంటి సీతారాం రెడ్డి బుధవారం లబ్ధిదారుడు సిరిగద్దె రమేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీతారాం రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన సమయంలో సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత అందించడం ప్రభుత్వ సహాయ కార్యక్రమాల్లో భాగమని తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. చెక్కు మంజూరుకు సహకరించిన ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, మండల అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డికి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం పాలకవర్గ సభ్యుడు కళింగ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు, దళిత రత్న పుల్లూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారంలో ప్రతి బుధవారం వారపు సంత

- తాజా కూరగాయలు.. నిత్యావసరాలు ఒకే చోట
- సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్



**ప్రజావాణి బయ్యారం, సెప్టెంబర్ 16:** బయ్యారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీ సెంటర్ వద్ద గల తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఇకపై ప్రతి బుధవారం క్రమం తప్పకుండా వారపు సంత నిర్వహించనున్నట్లు సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అవసరమైన తాజా కూరగాయలు, నిత్యావసర వస్తువులు ఒకే చోట అందుబాటులో ఉండేలా వారపు సంతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు వారపు సంతను సద్వినియోగం చేసుకుని కొనుగోళ్లు జరపాలని, తద్వారా స్థానిక చిన్న వ్యాపారులకు కూడా అండగా నిలవాలని కోరారు. ప్రతి బుధవారం నిర్వహించే వారపు సంతకు వ్యాపారులు, ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ పిలుపునిచ్చారు. వారపు సంత ద్వారా ప్రజలకు అవసరమైన వస్తువులు సులభంగా లభించడంతో పాటు స్థానిక వ్యాపారులకు వ్యాపార అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగుల ఉమా, నాయిని శ్రీనివాస్ రెడ్డి, భద్రయ్య, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ రాజ్యసభ సభ్యుడు స్వర్గీయ వొడితల రాజేశ్వర్ రావు జయంతి వేడుకలు

- విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మనవడువొడితల ప్రణవ్



**జమ్మికుంటసెప్టెంబర్ 16 (ప్రజావాణి)** నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి మాజీ రాజ్యసభ సభ్యుడు స్వర్గీయ వొడితల రాజేశ్వర్ రావు అని ఆయన చూపిన బాటలోనే నడుస్తూ ప్రజలకు మరింత సేవ అందిస్తామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితల ప్రణవ్ పేర్కొన్నారుబుధవారం రోజున రాజేశ్వర్ రావు జయంతిని పురస్కరించుకుని హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూడా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారుఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ రాజేశ్వర్ రావు చేసిన అభివృద్ధి పనులే ఇప్పటికీ నియోజకవర్గంలో సాక్ష్యాలుగా నిలుస్తున్నాయనిఆయన దూరదృష్టి వల్ల ఆ సేవలు ఇప్పటితరానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని గుర్తుచేసుకున్నారురాజకీయాలకు అతీతంగా అభిమానులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ వేడుకల్లో పలువురు నాయకులు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల ప్రతినిధులు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఎబివిపి ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకలు పురస్కరించుకొని తిరంగా ర్యాలీ

- జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు








**జమ్మికుంట సెప్టెంబర్ 16 (ప్రజావాణి)** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుజురాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరంగా ర్యాలీ నిర్వహించుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనరజాకార్ల అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలు యోధులు పోరాడారు. భారత ప్రభుత్వం సెప్టెంబర్ 17 1948న 'ఆపరేషన్ పోలో' పోలీసు చర్య ద్వారా హైదరాబాద్‌ను భారత యూనియన్‌లో విలీనం చేసింది. నిజాం పాలన నుంచి విముక్తి పొంది, ప్రజలకు స్వేచ్ఛ లభించిన ఈ చారిత్రక సంఘటన జ్ఞాపకార్థం ఈ,రోజును విమోచన దినంగా పాటిస్తారు అని వారు తెలియజేశారురాష్ట్ర నాయకులు గోస్కుల అజయ్ మాట్లాడుతూ నిజాం సైన్యాధిపతి సయ్యద్ అహ్మద్ ఎల్-ఎడ్రూస్ లొంగిపోయారు. నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ రేడియో ద్వారా తన ఓటమిని కాల్పుల విరమణను ప్రకటించి, భారత్‌లో హైదరాబాద్ విలీనాన్నిఅంగీకరించారుఫలితంసెప్టెంబర్ 18న అధికారికంగా లొంగిపోవడం పూర్తయింది. దీంతో నిజాం నిరంకుశ పాలన అంతమై ప్రజలకు రజాకార్ల హింస నుంచి విముక్తి లభించిందిఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి సాయి చరణ్ నగర సంయుక్త కార్యదర్శులు కుమారస్వామి శివ అజయ్ భార్గవ్ నగర ఉపాధ్యక్షులు చరణ్ తేజ రాకేష్ కృష్ణ మనిప్రీతంఇతర కార్యకర్తలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# భిక్కనూర్ పోలీస్ స్టేషన్‌లో అన్నదాన కార్యక్రమం

- కామారెడ్డి డీఎస్పీ ఎస్, మధుసూదన్





**భిక్కనూర్ సెప్టెంబర్16 ( ప్రజావాణి):** భిక్నూర్ పోలీస్ స్టేషన్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కామారెడ్డి డీఎస్పీ శ్రీ ఎస్. మధుసూదన్, భిక్కనూర్ సీఐ జె. నరేష్ , భిక్కనూర్ మండలంలోని వివిధ గ్రామసర్పంచులు, గణేష్ ఉత్సవాల యువజన నిర్వాహకులు హాజరయ్యారు. అందరి సహకారంతో అన్నదాన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

ఈ సందర్భంగా ఎస్సై ఎస్. అనిల్ మాట్లాడుతూ, గణేష్ నిమజ్జన కార్యక్రమాల సమయంలో డీజే సౌండ్ వినియోగించరాదని, పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్సై ,అనిల్ విజ్ఞప్తి చేశారు.

# కూటమి సర్కార్ పేదలకు ఇచ్చే ఫెన్సన్ లబ్ధిదారులపై 25 రకాల అడ్డంకులు

- పేద, మధ్య తరగతి వర్గాలకు ఇస్తామన్న సంక్షేమ పథకాలు అమలకు. ఎన్నో ఆంక్షలు.
- కొంగకు పెద్ద పళ్ళెంలో పాయసము..
- నక్కకు కూజా జాడీలో పాయసము లా ఉంది..
- ఇక్కడ కూటమి సర్కారు ఇచ్చే సంక్షేమ పథకాలు




**పలాస ప్రజావాణి ప్రతినిధి** ప్రభుత్వము అధికారము లోకి వచ్చి రెండేళ్ల న్నర దాటిన తర్వాత కొత్త ఫెన్షన్లు మంజూరు జీవో విడుదల చేశారు. గంపెడు ఆశలుతో వృద్ధాప్యపు, అలాగే వితంతు, ఇతర వ్యక్తులు కూడా ఫెన్సన్ మంజూరు కోసము కోసము ఇస్తామని ఆశచూపి సాధ్యము కానీ ఆంక్షలు పెట్టడం అన్యాయమని బాదితులు అవేదన వ్యక్తము చేస్తున్నారు. ముఖ్యంగా కుటుంబ మాఫింగ్ ను సంక్షేమ పథకాలు ముడిపెట్టడం పెద్ద చిక్కగా మారింది. అంతే కాకుండా ఆరునెలలు వాడిని విద్యుత్ బిల్లులు జాబితా ఇవ్వాలి , ఆలాగే వన్ బి సర్టిఫికెట్ కు సంక్షేమ పథకాలకు లింక్ ఎందుకు. ముఖ్యంగా ఇచ్చే ఫెన్సన్ పథకం పై ఇక్కడ ఇస్తామని నమ్మబలికి అన్నీ అవస్తలా బాధితురాలు అవేదన వ్యక్తము చేస్తున్నారు.

ముఖ్య మంత్రి చంద్రబాబు పేదలకు ఇస్తామన్న ఫెన్సన్ పథకం లో ఇన్ని ఇబ్బందులా ?

కూటమి సర్కార్ పేదలకు ఇచ్చే ఫెన్సన్ లబ్ధిదారులపై నిబంధనలు ఎందుకు?

పేద వర్గాలపై దొంగ ప్రేమ ఎందుకో చెప్పలేనిదని వామపక్షాలు అంటున్నాయి.

కూటమి సర్కార్ అధికారము లోకి వచ్చాక నిత్యవసర వస్తువులు ధరలు భారీగా పెరిగాయి ధరలు నియంత్రణ చర్యలు తీసుకోలేని పాలకులు పై బాదితులు అవేదన వ్యక్తము చేస్తున్నారు వి

# పోషణ్ మాసం 2026 -- "మన అంగనవాడి.. మన బాధ్యత"



**తవణంపల్లి సెప్టెంబర్ 16: ప్రజావాణి:** తవనంపల్లి మండలం లోని పోషణ్ మాసం 2026 సందర్భంగా "మన అంగనవాడి.. మన బాధ్యత" అనే నినాదంతో బాపినాయుడు పల్లి అంగనవాడి కేంద్రాల్లో పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సమతుల్య ఆహారం అందించడం, పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించడం లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించి అంగనవాడి సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూపర్వైజర్ నాగరత్నం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్ రాణి మహిళలు ప్రజలు పాల్గొన్నారు.

# కౌశలం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నందు కాల్స్ అందుకున్న యువత ఇంటర్వ్యూ కి హాజరై సద్వినియోగం చేసుకోండి

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 16 ప్రజా వాణి** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువతకు నాణ్యమైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో "కౌశలం" కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తోందని, యువత సద్వినియోగం చేసుకోవాలని, కాల్ అందిన వారు ఇంటర్వ్యూకి తప్పక హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ఐటిఐ డిప్లొమా, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువతకు వివిధ ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతున్నాయి. కౌశలం అసెస్‌మెంట్ పరీక్షను సంబంధిత స్వర్ణ గ్రామ / స్వర్ణ వార్డుల నందు పూర్తి చేసి, ప్లేస్‌మెంట్ కాల్ అందుకున్న అభ్యర్థులు మాత్రమే ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు హాజరై ఇంటర్వ్యూలో పాల్గొనవలసి ఉంటుంది. ఇతర అభ్యర్థులు హాజరు కావాల్సిన అవసరం లేదు. ప్లేస్‌మెంట్ కాల్ అందుకున్న అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా



కలెక్టరు, అనంతపురము వారు ఒక పత్రికా ప్రకటనలో తెలియచేశారు.

ఉద్యోగం : లాప్టాప్ అసెంబ్లీ ఔ ప్రొడక్షన్ అసోసియేట్
కంపెనీ: అవసర్ హెచ్ ఆర్ ప్రైవేట్ లిమిటెడ్
పని ప్రదేశం: శిక్షణ
డిక్సన్ పాడ్ జెట్ ఎలక్ట్రానిక్స్ కాంచీపురం తమిళనాడు.
జీతం: 2,18,000 -- 2,30,000 (సంవత్సరానికి)
ప్లేస్‌మెంట్ డ్రైవ్ తేదీ: 18.09.2026

అర్హత కలిగిన యువత అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది. అర్హత కలిగిన యువతీ యువకులకు ఇప్పటికే సంబంధిత స్వర్ణ గ్రామ / స్వర్ణ వార్డు కార్యాలయాల ద్వారా సమాచారం అందించటం జరిగిందనీ, అలాగే సదరు సమాచారం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు/ మునిసిపల్ కమీషనర్లు, మండల/ మునిసిపల్ స్వర్ణ గ్రామ/ స్వర్ణ వార్డు అధికారులకు అందుబాటులో ఉంచటం జరిగిందనీ, అలాగే జిల్లా స్తాయిలో నిర్వహించే సదరు ప్లేస్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమం విజయవంతం చేయటానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు / మునిసిపల్ కమీషనర్లు, మండల/ మునిసిపల్ స్వర్ణ గ్రామ/ స్వర్ణ వార్డు అధికారులు పూర్తి స్తాయిలో అర్హత పొందిన అభ్యర్తులను పాల్గొనేటట్లుగా చేసి వారు ఉపాది అవకాశాలు పొందుటకు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టరు, అనంతపురము వారు కోరారు.

# గణేష్ ఉత్సవాలపై రెవెన్యూ శాఖ కీలక మార్గదర్శకాలు



**ప్రజావాణి బయ్యారం, సెప్టెంబర్ 16:**బయ్యారం మండలంలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా భద్రతా చర్యలు పాటించాలని తహసీల్దార్ సప్పిడి నాగరాజు సూచించారు. రహదారులు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా వినాయక మండపాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.విద్యుత్ భద్రతకు అనుమతితో కూడిన విద్యుత్ తీగలు, పరికరాలనే వినియోగించాలని, అగ్నిప్రమాదాల నివారణకు నీరు, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. రాత్రి వేళల్లో మండపాల వద్ద తగినంత వెలుతురు, స్వచ్ఛంద సేవకుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ధ్వనివర్ధక పరికరాలను ప్రభుత్వ నిబంధనల మేరకే వినియోగించాలని, వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు.ఉత్సవాల్లో మద్యం, మత్తు పదార్థాలకు తావివ్వరాదని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా 100, 112కు సమాచారం అందించాలని తెలిపారు. మండపాల వద్ద పారిశుధ్యం పాటిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.వినాయక నిమజ్జనం సమయంలో చెత్తను నీటిలో వేయకుండా చూడాలని, నీటి ప్రమాదాల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నారులను నీటి సమీపంలోకి వెళ్లకుండా పర్యవేక్షించాలని తహసీల్దార్ నాగరాజు సూచించారు. గ్రామ పంచాయతీ, పోలీస్, విద్యుత్ శాఖల నిబంధనలు పాటిస్తూ భక్తితో పాటు బాధ్యతగా ఉత్సవాలను నిర్వహించాలని కోరారు.

# ఎల్ నినో , వర్షాభావ పరిస్థితులు వల్ల విద్యుత్ వినియోగదారులు కరెంటు పొదుపు చర్యలు తీసుకోవాలి

- రాత్రి ఆరు నుంచి పది గంటలు లోపు వాషింగ్ మిషన్లు, గ్లేజర్లు, నీటి పంపులు వాడరాదు
- విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు ప్రకటన

**పలాస ప్రజావాణి ప్రతినిధి** ఎల్ నీనా వల్ల దేశంలో విద్యుత్ కొరత ఏర్పడే అవకాశం ఉందనీ విద్యుత్ అధికారులు తెలిపారు.వర్షాలు లేకపోవడం వల్ల జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు తగ్గిపోతాయి, అలాగే ఎండల తీవ్రతకు ఏసీలు, కూలర్ల వాడకం పెరిగి విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి మనం విద్యుత్ వాడకాన్ని తగ్గించడం ఎంతో అవసరం.ఇందుకోసం ఇంట్లో మరియు ఆఫీసుల్లో పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన చిట్కాలు ఇక్కడ పాటించాలని వారు తెలిపారు.లైటింగ్ మరియు గృహోపకరణాలు ఎల్ ఇ డి బల్బులు,సాధారణ బల్బుల స్థానంలో తక్కువ విద్యుత్ వినియోగించే ఎల్ ఇ బల్బులను మాత్రమే వాడాలని కోరారు.

అవసరం లేనప్పుడు ఆపడం:
మీరు గది వదిలి వెళ్లేటప్పుడు లైట్లు, ఫ్యాన్లు తప్పనిసరిగా బంద్ చేయండి.నేచురల్ లైటింగ్: పగటిపూట కిటికీల గుండా వచ్చే




సహజమైన వెలుతురును ఉపయోగించు కావాలని కోరారు.కూలింగ్ పరికరాల జాగ్రత్తలుఏసీ టెంపరేచర్: ఏసీ ఉష్ణోగ్రతను 24°C నుండి 26°C మధ్య ఉంచండి. దీనివల్ల విద్యుత్ బిల్లు చాలా వరకు తగ్గుతుంది.
ఫిల్టర్ల క్లీనింగ్: ఏసీ, కూలర్ల ఫిల్టర్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం వల్ల అవి తక్కువ కరెంట్‌తో బాగా పనిచేస్తాయి.
బీఎల్‌డీసీ ఫ్యాన్లు: పాత ఫ్యాన్ల స్థానంలో తక్కువ విద్యుత్ తీసుకునే 5-స్టార్ రేటింగ్ లేదా BLDC ఫ్యాన్లను వాడడం మంచిదనీ గుర్తు చేశారు. ప్లగ్ పాయింట్లు ఔ ఇతర ఉపకరణాలు
మెయిన్ స్విచ్ ఆఫ్ చేయడం: టీవీ, కంప్యూటర్, ఓవెన్ వంటి




పరికరాలను రిమోట్‌తో కాకుండా మెయిన్ స్విచ్ బోర్డు దగ్గర ఆఫ్ చేయండి (స్టాండ్‌బై మోడ్‌లో కూడా కరెంట్ వృథా అవుతుంది).
వాషింగ్ మెషీన్: బట్టలు పూర్తిగా నిండినప్పుడు మాత్రమే (Full Load) వాషింగ్ మెషీన్‌ను వాడండి.
పీక్ అవర్స్ లో జాగ్రత్త: సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు (గ్రామని ఎశీబతీం) విద్యుత్ వాడకం ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో వాషింగ్ మెషీన్లు, గీజర్లు, వాటర్ పంపులు వంటి ఎక్కువ లోడ్ ఉన్న పరికరాలను వాడక పోవడము మంచిదని అధికారులు తెలిపారు

# సుద్దరేవు పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌లు, బ్యాగ్‌ల పంపిణీ

- విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం
- సర్పంచ్ బానోత్ లింగనాయక్



**ప్రజావాణి బయ్యారం, సెప్టెంబర్ 16:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 'రైజింగ్ తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా బయ్యారం మండలం కోయగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సుద్దరేవు పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌లు, పాఠశాల బ్యాగ్‌లు, గుర్తింపు కార్డులు, బెల్ట్‌లు పంపిణీ చేశారు.కార్యక్రమానికి కోయగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ లింగనాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి, ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు.విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్‌లు, పాదరక్షలు,టై, బెల్ట్‌లు,పాఠశాల బ్యాగ్‌లు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి కోయగూడెం గ్రామపంచాయతీ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాదావత్ రాంబాబు, రమేష్,గ్రామ ప్రముఖులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి అందిస్తున్న సహాయంపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా: మంత్రి సవితమ్మ

- కక్ష సాధింపు రాజకీయాలు మా విధానం కాదు
- సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం అమలు చేశాం
- మున్సిపాలిటీలో 20 కోట్లతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు
- పెనుకొండ మున్సిపాలిటీలోని 17, 18వ వార్డుల్లో పర్యటించిన మంత్రి సవిత

**అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 16 ప్రజా వాణి** పెనుకొండ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర చేనేత బీసీ సంక్షేమ శాఖల మంత్రి, పెనుకొండ నియోజకవర్గ శాసనసభ్యురాలు సవితమ్మ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 26 నెలల కాలంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు.పెనుకొండ మున్సిపాలిటీ లో 17, 18వ వార్డుల్లో మంత్రి సవితమ్మ పర్యటించారు. ఈ సందర్భంగా 35 సంవత్సరాలుగా ఉన్న డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయడంతో స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలో సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించడంతో స్థానికులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రయాణికుల సౌకర్యార్థం అంబేద్కర్ సర్కిల్‌లో సొంత నిధులతో ఏర్పాటు చేసిన నూతన బస్ షెల్టర్‌ను మంత్రి పరిశీలించారు. బస్ షెల్టర్‌ను ప్రజలకు మరింత



ఉపయోగకరంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం జూనియర్ కళాశాల మైదానాన్ని మంత్రి పరిశీలించారు. కాలేజీ గ్రౌండ్‌లో ఉన్న సమస్యలు, అభివృద్ధి చేయాల్సిన అంశాలపై అధికారులతో చర్చించారు. విద్యార్థులు, యువతతో పాటు ప్రజలకు ఉపయోగపడేలా మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన 1,200 కుటుంబాలకు ఇంటి పొజిషన్ పత్రాలు అందించేందుకు చర్యలు చేపట్టామని, స్థలం ఉన్న అర్హులైన కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి ఇప్పటికే ?20 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే ఆయా నిధులతో అభివృద్ధి పనులను చేపడతామని మంత్రి సవితమ్మ తెలిపారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక



వసతులను మెరుగుపరచడంతో పాటు రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు."కేసులు పెట్టడం మా నైజం కాదు.. కక్ష సాధింపు రాజకీయాలు చేయడం మా విధానం కాదు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ నాయకులు, అప్పటి మంత్రులు తమ సొంత కార్యకర్తలపైనా కేసులు పెట్టిన సందర్భాలు ఉన్నాయి. మేము మాత్రం కక్ష సాధింపు రాజకీయాలకు దూరంగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తున్నాం" అని మంత్రి సవితమ్మ స్పష్టం చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం హామీలను అమలు చేశామని మంత్రి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.మేము చేసిన అభివృద్ధి పనులను ప్రజల ముందుంచి, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ప్రజలను అడుగుతాం. ప్రజల కోసం చేసిన పనులే మా బలం. ప్రజలకు సేవ చేయడమే మా లక్ష్యం అని మంత్రి సవితమ్మ పేర్కొన్నారు.

# వినాయక నిమజ్జనంలో ఆరుగురు విద్యార్థులు మృతి!

- నేరేడు చెరువులో మట్టి గుంతలు గుర్తించక నీటిలోకి దిగిన విద్యార్థులు
- పండుగ వేళ విషాదం.. పెద్దకంజర్లలో దుఃఖఛాయలు





**పటాన్‌చెరు, సెప్టెంబర్ 16 (ప్రజావాణి):** వినాయక నిమజ్జనం ఆరుగురు విద్యార్థుల ప్రాణాలు కోల్పోయారు. పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలోని నేరేడు చెరువులో బుధవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. నిమజ్జనం కోసం చెరువులోకి దిగిన విద్యార్థులు లోతైన నీటిలో మునిగి మృతిచెందడంతో పండుగ వేళ విషాదఛాయలు అలుముకున్నాయి.సమాచారం మేరకు, వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు కొందరు విద్యార్థులు నేరేడు చెరువులోకి దిగారు. చెరువులో మట్టి తవ్వకాల కారణంగా ఏర్పడిన లోతైన గుంతలను గుర్తించకపోవడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈత రాకపోవడంతో ఒకరిని కాపాడేందుకు మరొకరు ప్రయత్నించగా, వరుసగా నీటిలో మునిగిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.మృతులు లినర్సింహ (21), తేజ (17), సిద్దంత్ (17), గణేష్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్‌కిరణ్ (22)లిగా గుర్తించారు. వీరంతా శివనగర్ చౌరస్తా సమీపంలోని శిరీష చారిటబుల్ ట్రస్ట్‌లో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులని అధికారులు తెలిపారు.ట్రస్ట్‌లోనే విద్యాభ్యాసంతల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఆశ్రయం కల్పిస్తూ శిరీష చారిటబుల్ ట్రస్ట్ సేవలందిస్తున్నట్లు సమాచారం. మొదటి తరగతి నుంచి పాలిటెక్నిక్, బీటెక్ వరకు సుమారు 70 మంది విద్యార్థులు అక్కడ విద్యనభ్యసిస్తున్నట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కృష్ణంరాజు తన కుమార్తె శిరీష పేరుతో ఈ ట్రస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు సమాచారం.ఘటన విషయం తెలుసుకున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రాచీన్ గ్లోబల్ ఆస్పత్రికి చేరుకుని మృతదేహాలకు నివాళులర్పించారు. తోటి విద్యార్థులను అడిగి ప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం ప్రక్రియను గురువారం ఉదయం పూర్తి చేసి, అనంతరం మృతదేహాలను స్వగ్రామాలకు తరలించేందుకు అంబులెన్సులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తన సొంత నిధులతో అంబులెన్సులు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.సైబరాబాద్ డీసీపీ శ్రీనివాస్ కూడా ఆస్పత్రికి చేరుకుని ఘటనపై వివరాలు సేకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు.వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన ఈ దుర్ఘటనతో విద్యార్థుల కుటుంబాలు, ట్రస్ట్ నిర్వాహకులు, తోటి విద్యార్థుల రోదనలు మిన్నంటాయి. పండుగ వేళ ఆరుగురు యువ విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం పెద్దకంజర్ల గ్రామంతో పాటు పటాన్‌చెరు ప్రాంతాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది.

# మందులను సక్రమంగా తీసుకుంటున్నా షుగర్ లెవల్స్ పెరుగుతున్నాయా.. అయితే అందుకు కారణాలు ఇవే..

మధుమేహం ఉన్నవారు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించేందుకు క్రమం తప్పకుండా మందులు వాడుతుంటారు. అయినప్పటికీ కొందరిలో అకస్మాత్తుగా రక్తంలో చక్కెర పెరగడం కనిపిస్తుంది. మందులు సక్రమంగా తీసుకుంటున్నా ఇలా ఎందుకు జరుగుతుందనే సందేహం చాలామందికి ఉంటుంది. ఆహారపు అలవాట్లు, భోజనం చేసే సమయం, తీసుకునే ఆహారం పరిమాణం, శారీరక శ్రమ, నిద్ర, ఒత్తిడి వంటి అనేక అంశాలు రక్తంలో చక్కెరపై ప్రభావం చూపుతాయి. జ్వరం, ఇన్ఫెక్షన్ వంటి అనారోగ్య పరిస్థితుల్లో కూడా చక్కెర స్థాయిలు తాత్కాలికంగా పెరుగుతాయి. అందుకే మందులతోపాటు జీవనశైలిపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టడం అవసరమని నిపుణులు చెబుతున్నారు.ఆహార పదార్థాలు..

శుద్ధి చేసిన కార్బొహైడ్రేట్లు, చక్కెర ఎక్కువగా ఉండే ఆహారాలు తీసుకోవడం రక్తంలో చక్కెరను వేగంగా పెంచుతాయి. తెల్ల బియ్యం, స్వీట్లు, చక్కెర కలిగిన పానీయాలు, బేకరీ పదార్థాలను అధికంగా తీసుకోవడం ఇందుకు కారణమవుతుంది. ఆరోగ్యకరమైన ఆహారమైనా పరిమాణం ఎక్కువగా ఉంటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. మందులను సూచించిన సమయానికి తీసుకోకపోవడం, మోతాదులు మర్చిపోవడం కూడా రక్తంలో చక్కెరలో హెచ్చుతగ్గులకు కారణమవుతుంది. అలాగే బరువు పెరగడం, శారీరక శ్రమ తగ్గడం వల్ల ఇన్సులిన్ నిరోధకత పెరిగి మధుమేహ నియంత్రణ కష్టమవుతుంది. భోజనాన్ని తరచూ మానేయడం వల్ల తరువాత ఎక్కువగా తినే అవకాశం ఏర్పడి చక్కెర ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంటుంది.

మానసిక సమస్యలు..నిరంతర ఒత్తిడి, ఆందోళన, సరైన నిద్ర లేకపోవడం కూడా రక్తంలో చక్కెర నియంత్రణను ప్రభావితం చేస్తాయి. శరీరంలో ఒత్తిడికి సంబంధించిన హార్మోన్లు పెరగడం వల్ల చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంటుంది. సాధారణంగా తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 8 గంటల మధ్య శరీరంలో సహజంగా కొన్ని హార్మోన్లు విడుదల కావడం వల్ల రక్తంలో చక్కెర పెరగడాన్ని డాన్ ఫినామినన్ గా పేర్కొంటారు. జ్వరం, ఇన్ఫెక్షన్ లేదా ఇతర అనారోగ్య పరిస్థితుల్లోనూ చక్కెర పెరుగుతుంది. శారీరక కదలికలు తక్కువగా ఉండడం, అధికంగా మద్యం తీసుకోవడం కూడా మధుమేహ నియంత్రణపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. తరచూ దాహం వేయడం, ఎక్కువసార్లు మూత్రవిసర్జన, అలసట, చూపు మసకబారడం, గాయాలు ఆలస్యంగా మానడం వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలి.

వైద్యుల సలహా తీసుకోవాలి..

రక్తంలో చక్కెర తరచూ లక్ష్య స్థాయికి మించి ఉంటే వైద్యులను సంప్రదించి కారణాన్ని గుర్తించాలి. మందుల మోతాదును స్వయంగా మార్చుకోవడం లేదా కొత్త మందులు ప్రారంభించడం చేయకూడదు. కార్బొహైడ్రేట్లతోపాటు ప్రోటీన్, పీచు పదార్థాలను తీసుకోవడం, భోజనం తర్వాత కొంత శారీరక చురుకుదనం పాటించడం, మందులను సూచించిన విధంగానే తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, ఒత్తిడిని నియంత్రించుకోవడం ఉపయోగకరంగా ఉంటాయి. ఇంట్లో రక్తంలో చక్కెరను పరిశీలిస్తూ ఎప్పుడు స్థాయిలు పెరుగుతున్నాయో గమనించడం కూడా ముఖ్యమే. తరచూ చక్కెర స్థాయిలు ఎక్కువగా నమోదవుతుంటే లేదా మూడు నెలల సగటు చక్కెర స్థాయి పెరుగుతుంటే వైద్యుల సలహాతో చికిత్సా ప్రణాళికను సమీక్షించుకోవాలని నిపుణులు తెలియజేస్తున్నారు.

# ఆసియా గేమ్స్‌లో టీమ్ఇండియాకు విప్రజ్ నిగమ్ ఎంపిక




ఒక ఆటగాడి గాయం కారణంగా ఇంకో ఆటగాడికి జట్టులో చోటు దక్కడం ఏ ఆటలోనైనా మామూలుగా జరిగేదే. తాజాగా టీమ్ఇండియా జాతీయ జట్టులోనూ అదే జరిగింది. అయితే ఈసారి జట్టులో చోటు దక్కించుకోనున్న ప్లేయర్‌కు మాత్రం ఇది అరంగేట్రం కానుండడం విశేషం. గతేడాది ఐపీఎల్‌లో టోర్నమెంట్‌లో రాణించిన 22ఏళ్ల ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్‌కు ఆసియా గేమ్స్‌లో ఆడే అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. మరో మూడు రోజుల్లో ఆసియా గేమ్స్ ప్రారంభం కానున్న నేపథ్యంలో టీమ్ఇండియాకు రీసెంట్‌గా ఎదురుదెబ్బ తగిలింది. ఢిల్లీ వేదికగా ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 'సైడ్ స్ట్రెయిన్' (పక్కటెముకల వద్ద కండరాల గాయం)కు గురయ్యాడు. దీంతో అతడు ఈ సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే ఈ సిరీస్‌తోపాటు వరుణ్ ఆసియా గేమ్స్ నుంచి కూడా దూరమయ్యాడు. దీంతో సెలక్టర్లు అతడి రిప్లేస్‌మెంట్‌గా ఐపీఎల్ స్టార్, స్పిన్ ఆల్‌రౌండర్ విప్రజ్ నిగమ్‌ను ఎంపిక చేసినట్లు ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ తమ రిపోర్ట్‌లో పేర్కొంది. "గాయం కారణంగా వరుణ్ కొద్దిరోజులు అందుబాటులో ఉండడు. అతడు గాయం నుంచి కోలుకోవాల్సి ఉంది. దీంతో అతడు ఈ పోటీలకు దూరమయ్యాడు. అయితే అతడి రిప్లేస్‌మెంట్ కోసం సెలక్టర్ల జాబితాలో విప్రాజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్ ఇద్దరి పేర్లు ఉన్నాయి. అయితే లెగ్ స్పిన్నర్ కమ్ ఆల్‌రౌండ్ విప్రజ్ నిగమ్ వైపే సెలక్టర్లు మొగ్గు చూపించారు. రాబోయే ఆసియా గేమ్స్‌లో వరుణ్ స్థానాన్ని విప్రజ్ నిగమ్ భర్తీ చేయనున్నాడు" అని బీసీసీఐ వర్గాలు చెప్పినట్లు పీటీఐ పేర్కొంది. విప్రాజ్ నిగమ్ బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్‌లోనూ మెరుపులు మెరిపించగలడు. 2025లో ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చిన అతడు ఆకట్టుకున్నాడు. ఈ టోర్నీలో తన బ్యాటింగ్ నైపుణ్యాన్ని కూడా ప్రదర్శించాడు. టీ20ల్లో స్ట్రైక్ రేట్ 176గా ఉండడం విశేషం. విప్రాజ్ బంతితో రాణించడమే కాకుండా, లోయార్డర్‌లో వేగంగా పరుగులు సాధించగల సామర్థ్యం అతడికి ఉంది. కాగా, ఆఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో 35 ఏళ్ల వరుణ్ చక్రవర్తి గాయపడ్డాడు. మ్యాచ్ తర్వాత అతను అసౌకర్యంగా ఉన్నట్లు తెలిపాడు. ఆ తర్వాత అతడికి ఎమ్ఆర్ఐ స్కాన్ చేయించగా, పక్కటెముకల్లో గాయం ఉన్నట్లు తేలింది. దీంతో అతడిని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'కు పంపించారు. అక్కడ కొన్ని రోజులు రిహాబిలిటేషన్ చేయనున్నాడు. ఇటీవలే హ్యామ్‌స్ట్రింగ్ సమస్య నుంచి కోలుకుని జాతీయ జట్టులోకి తిరిగి వచ్చిన వరుణ్ మళ్లీ తొలి మ్యాచ్‌లోనే గాయపడడం అతడికి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. కాగా, కుల్దీప్‌ను కాదని విప్రజ్‌ను ఎంపిక చేయడంపై ఓ కారణం ఉంది. ఈనెలలో ఆఖరి వారంలో భారత్ జట్టు వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ ఆడాల్సి ఉంది. ఇందులో కుల్దీప్ బరిలో దిగనున్నాడు. అందుకే విప్రజ్‌ను ఆసియా గేమ్స్‌కు పంపించారు. జపాన్‌లోని ఐచి- నగోయాలో సెప్టెంబర్ 19 నుంచి ఆసియా క్రీడలు ప్రారంభం కానున్నాయి. పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24న మొదలవుతాయి. అయితే భారత జట్టు నేరుగా క్వార్టర్-ఫైనల్ దశ నుంచే తన పోరాటాన్ని ప్రారంభిస్తుంది.

# కొచ్చి వేదికగా అక్టోబర్‌లో మెగా ఆక్షన్ నిర్వహణ..





## ● డబ్ల్యూపీఎల్ 2027 తేదీలు ఖరారు

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఐదో సీజన్ నిర్వహణకు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం కీలక ప్రకటన విడుదల చేసింది. డబ్ల్యూపీఎల్ 2027 ఎడిషన్ మ్యాచ్‌లను 2027 జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ కొత్త సీజన్ కోసం ఆటగాళ్ల మినీ వేలాన్ని ఈ ఏడాది అక్టోబర్ 28న కేరళలోని కొచ్చి నగరంలో జరుపుతారు. అయితే ఈ టోర్నీ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే వేదికల వివరాలను మాత్రం బీసీసీఐ ప్రస్తుతానికి వెల్లడించలేదు. మహిళల క్రికెట్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద టీ20 లీగ్‌గా అవతరించిన డబ్ల్యూపీఎల్, సరికొత్త ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తోందని బోర్డు తన అధికారిక ప్రకటనలో తెలిపింది. ఇండియా అంతర్జాతీయ స్టార్లతో పాటు వర్ధమాన క్రీడాకారిణులు తమ సత్తా చాటేందుకు ఈ లీగ్ గొప్ప వేదికగా నిలిచింది. రాబోయే సీజన్ కోసం ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లను సిద్ధం చేసుకోవడంపై కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న జట్ల నుంచి ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి బీసీసీఐ సెప్టెంబర్ 28ని ఆఖరి గడువుగా నిర్ణయించింది. ఈ గడువు లోగా ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను సమర్పించాల్సి ఉంటుందని తెలుస్తోంది. రాబోయే సీజన్‌కు సరిపడే అత్యుత్తమ కాంబినేషన్‌లను ఎంపిక చేసుకోవడానికి జట్లకు ఇది మంచి అవకాశం. 2026 ఎడిషన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సంచలన ఆటతీరుతో రెండోసారి డబ్ల్యూపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన సారథ్యంలో బరిలోకి దిగిన ఆర్సీబీ, అద్భుత ప్రదర్శనతో టైటిల్ నిలబెట్టుకుంది. ఆ సీజన్ మ్యాచ్‌లను నవీ ముంబై, బరోడాలలో విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు జరగబోయే ఐదో సీజన్‌లోనూ విజేతగా నిలిచి హ్యాట్రిక్ సాధించాలని ఆర్సీబీ బృందం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు తగిన కసరత్తు ముమ్మరం చేస్తోంది ఆ టీమ్ మేనేజ్మెంట్. 2023లో ఆరంభమైన డబ్ల్యూపీఎల్ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు చెరో రెండుసార్లు ఛాంపియన్లుగా నిలిచాయి. కొచ్చిలో జరిగే వేలం తర్వాత ఐదు ఫ్రాంచైజీలు కొత్త వ్యూహాలతో బరిలోకి దిగనున్నాయని తెలుస్తోంది. ఇక మిగతా జట్లు కూడా విజేతగా నిలిచేందుకు వ్యూహాలు పన్నుతున్నాయి.

# వైభవ్‌తో పోటీ బయటి ప్రపంచానికి మాత్రమే




అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండో టీ20 పోరులో 160 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమ్ ఇండియా ఏ దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా, ఆడుతూ పాడుతూ టార్గెట్ చేజ్ చేసింది. ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ తొలి వికెట్‌కు 88 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. కేవలం 22 బంతుల్లోనే 57 పరుగులు సాధించి సంజూ ఫామ్‌లోకి రావడంతో భారత్ 14.5 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో 15 ఏళ్ల వండర్‌కిడ్ వైభవ్ సూర్యవంశీతో పోటీ గురించి వస్తున్న ఊహాగానాలకు సంజూ తనదైన శైలిలో స్పందించాడు. ఫామ్ అనేది తాత్కాలికం, క్లాస్ ఎప్పటికీ శాశ్వతం అని మరోసారి నిరూపించాడు. మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఓపెనింగ్ స్థానం కోసం నెలకొన్న తీవ్ర పోటీపై అడిగిన ప్రశ్నకు సంజూ దీటుగా ఆన్సరిచ్చాడు. ఓపెనింగ్ బెర్త్‌ల వివాదంపై సంజూ శాంసన్ స్పందిస్తూ, "బయటి ప్రపంచానికి మాత్రమే వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ నాకు పోటీదారులుగా కనిపిస్తారు. కానీ డ్రెస్సింగ్ రూమ్‌లో మేమంతా ఒకే జట్టుగా దేశం కోసం ఆడుతున్నాం. మాకు జట్టు విజయం మాత్రమే ముఖ్యం, ఆ తర్వాతే వ్యక్తిగత ప్రదర్శనలు వస్తాయి. అతడికి అవకాశం ఇచ్చారు, నాకు ఎందుకు రాలేదు అని బాధపడుతూ నెగెటివ్ ఆలోచనలతో కూర్చోవడం మా జట్టు సంస్కృతిలో లేదు. అలాంటి మనస్తత్వాలు ఇక్కడ పనికిరావు" అని పేర్కొన్నాడు. సోషల్ మీడియాలో మాజీ క్రికెటర్లు చేసే వ్యాఖ్యల గురించి సంజూ శాంసన్ మాట్లాడుతూ, "సాధారణంగా నేను వైఫై ఆఫ్ చేసి నెగెటివిటీకి దూరంగా ఉంటాను. కానీ కొన్నిసార్లు ఆ కామెంట్లు నా కంట పడుతుంటాయి. ఇండియాలో ఆడుతున్నప్పుడు ఇలాంటి కామెంట్లు ఆటగాళ్లపై ప్రభావం చూపుతాయి. మేం రోబోలం కాదు, మాకు భావోద్వేగాలు ఉంటాయి. గతంలో విమర్శలు నన్ను కూడా బాధించాయి. అయితే అనుభవంతో వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నాను. ఒక షాట్ ఆడే ముందు బయట ఏమనుకుంటారో అని ఆలోచిస్తే నేను ఇలా బ్యాటింగ్ చేయలేను" అని తెలిపాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో సంజూ, అభిషేక్‌లు రాణించినప్పటికీ, బెంచ్‌పై ఉన్న వైభవ్ సూర్యవంశీకి మూడో టీ20లో అవకాశం ఇస్తామంటూ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సూచన ప్రాయంగా చెప్పాడు. దీంతో ఆఖరి పోరులో ఎవరికి విశ్రాంతి ఇస్తారనేది ఆసక్తిగా మారింది. ఇక ఈ ఈ సిరీస్ ను ఇప్పటికే 2-0తో ఇండియా కైవసం చేసుకోగా, స్వదేశంలో శ్రేయస్ కిదే తొలి సిరీస్ విక్టరీ కావడం విశేషం.

# భారత్‌లోనే జరగనున్న ఐపీఎల్ 2027 వేలం



గత కొన్ని ఏళ్లుగా విదేశాల్లో ఐపీఎల్ వేలాన్ని నిర్వహించే ట్రెండ్‌కు బీసీసీఐ బ్రేక్ వేసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కీలక సమావేశంలో 2027 ఐపీఎల్ మినీ వేలాన్ని మన భారతదేశంలోనే నిర్వహించాలని నిర్ణయించారు! 2023లో కొచ్చిలో జరిగిన వేలం తర్వాత దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో వేలాలు జరిగాయి. అయితే, 2028లో నిర్వహించే మెగా వేలాన్ని మళ్లీ విదేశాల్లో నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, ఈసారి మినీ వేలాన్ని మాత్రం స్వదేశంలోనే నిర్వహించనున్నారు. మినీ వేలం కోసం తమ యాజమాన్యం, విశ్లేషకుల బృందాలను విదేశాలకు తీసుకెళ్లడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫ్రాంచైజీలు బీసీసీఐకి విన్నవించాయి. గతేడాది అబుదాబి వేలం సందర్భంగానే టీమ్స్ ఈ అభ్యంతరాలను బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లాయి. ఫ్రాంచైజీల అభిప్రాయాలకు గౌరవమిస్తూ, వేలాన్ని భారతదేశంలోని ఏదో ఒక నగరంలో నిర్వహించాలని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయించింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలం భారతదేశంలో వివాహాల సీజన్ కావడంతో, వేలం వేదిక ఎంపిక కాస్త సవాలుగా మారింది. వేలం నిర్వహణతో పాటు 10 ఫ్రాంచైజీల బృందాలు, బీసీసీఐ అధికారుల వసతి కోసం కనీసం 100కి పైగా 5-స్టార్ హోటల్ గదులు రెండు రోజుల పాటు అవసరం అవుతాయి. హోటల్ గదుల లభ్యతను బట్టి ఏ భారతీయ నగరంలో వేలం నిర్వహించాలనేది త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. మరోవైపు ఐపీఎల్‌లో ఎంతో వివాదాస్పదమైన 'ఇంపాక్ట్ ప్లేయర్' నియమంపై బీసీసీఐ ఇంకా ఏటూ తేల్చలేదు. ఈ రూల్‌ను కొనసాగించాలా వద్దా అనే దానిపై ఫ్రాంచైజీలలో విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. జట్టు నిర్మాణాన్ని ఈ నియమాన్ని బట్టే రూపొందించుకున్నామని, కాబట్టి దీనిపై హడావుడిగా కాకుండా వచ్చే ఏడాది నిర్ణయం తీసుకోవాలని కొన్ని జట్లు కోరుతున్నాయి. దీనిపై స్పష్టత కోసం మరో నెల రోజుల్లో ప్రత్యేకంగా గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం కానుంది.

# స్విమ్మింగ్‌లో మెరిసిన మనీశ్ గౌడ్

## - ఓయూ ఇంటర్‌కాలేజ్ స్విమ్మింగ్ పోటీలు




**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ స్విమ్మింగ్ పోటీల్లో కె. మనీశ్ గౌడ్ (సెయింట్ జోసెఫ్ కాలేజ్) సత్తా చాటాడు. మెన్స్ 100 మీటర్ల, 200మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో పసిడి పతకం సాధించాడు. 50మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజత పతకం నెగ్గాడు. బద్రుకా కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు అంబర్‌పేట్ స్విమ్మింగ్‌పూల్‌లో జరుగగా.. ఎన్‌జిఐటి, ఎసీఎంఈ, కేశవ్ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజ్‌లు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాయి. ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ప్రొ.సునీల్ కుమార్, ఐయూటీ సెక్రటరీ ప్రొ. దీప్ల, బద్రుకా కాలేజ్ ప్రిన్సిపాల్ మోహన్ కుమార్‌లు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

# అనంత్ నాగ్‌కు ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం

**- ఈ నెల 22న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రధానం**



ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్‌ను సినీ రంగంలో అత్యున్నత ప్రతిష్టాత్మక పురస్కారం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. 2024 సంవత్సరానికి ఆయనకు ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భారతీయ సినిమాకు అనంత్ నాగ్ అందించిన సేవలు, విశిష్టమైన సినీ ప్రస్థానానికి గుర్తింపుగా ఈ పురస్కారం అందించినట్లు కేంద్రం తెలిపింది. గుజరాత్‌లోని కేవడియాలో ఈ నెల 22న జరగనున్న 72వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రధానోత్సవంలో అనంత్ నాగ్‌కు... రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారం అందజేయనున్నారు. కన్నడతో పాటు పలు భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు అనంత్ నాగ్. ఆయనకు అత్యున్నత పురస్కారం దక్కడం పట్ల కన్నడ ఇండస్ట్రీతో పాటు సినీ అభిమానులు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.నటుడు అనంత్ నాగ్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారంతో సత్కరించబడిన ప్రఖ్యాత నటుడు అనంత్ నాగ్ గారికి అభినందనలు. గత కొన్ని దశాబ్దాలుగా, ఆయన సహజ నటన, అద్భుతమైన బహుముఖ ప్రజ్ఞ, అసాధారణమైన కళా నైపుణ్యం భారతీయ సినిమాపై, ముఖ్యంగా కన్నడ చిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర వేశాయి. ఆయన పోషించిన ప్రతి పాత్రలోనూ సాటిలేని నటనను, జీవాన్ని నింపారు. ఒక గొప్ప కళాకారుడికి ఇది నిజంగా దక్కిన అర్హమైన గౌరవం.' అంటూ పోస్ట్ చేశారు. దాదాపు 5 దశాబ్దాల సినీ ప్రయాణంలో అనంత్ నాగ్... కన్నడతో పాటు తెలుగు, హిందీ, మరాఠీ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు. తన నటనతో ఎంతో మంది ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారు. థియేటర్ నటుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన... 1973లో కన్నడ మూవీ 'సంకల్ప'తో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత మంథన్, కొండుర, కల్‌యుగ్ తదితర చిత్రాలు ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి.ఆర్కే నారాయణన్ కథల ఆధారంగా తెరకెక్కించిన ఫేమస్ టీవీ సీరియల్ 'మాల్గుడి డేస్'లో అనంత్ నాగ్ మిఠాయి వాలా పాత్రతో దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు. అలాగే, రాజ కుమార, గాలిపట 2, కేజీఎఫ్, కన్నేశ్వర రామ వంటి మూవీస్ మరింత పేరు తీసుకొచ్చాయి. తెలుగులో భీష్మ, బాలు, అనుగ్రహం, శంఖారావం వంటి చిత్రాల్లో నటించారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 2025లో 'పద్మ భూషణ్'తో గౌరవించింది. ఇప్పుడు అత్యున్నత దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందించనుంది.

# వేగం పెంచిన 'ధర్మన్'




సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'ధర్మన్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మూడో షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని దర్శకుడు అశ్వత్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. షూటింగ్ సెట్స్ నుంచి ఒక ఆసక్తికరమైన బిహైండ్-ది-సీన్స్ (బీటీఎస్) వీడియో క్లిప్‌ను ఆయన పంచుకున్నారు. ఈ వీడియోలో సూపర్ స్టార్ రజనీకాంత్, నటి రాశి ఖన్నాతో ముచ్చటిస్తూ కనిపించారు. "ధర్మన్ మూడో షెడ్యూల్ కోసం మళ్లీ తలైవర్‌తో కలిశాను" అంటూ ఈ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. ఈ క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవలే సెప్టెంబర్ 4న ఈ చిత్ర రెండో షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్ర నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్.. రజనీకాంత్ ఒక సీనియర్ మెడికల్ ఫ్యాకల్టీగా జూనియర్ డాక్టర్లకు పాఠాలు చెబుతున్న సన్నివేశాలతో కూడిన వీడియోను విడుదల చేసింది. ఈ లుక్‌కు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రాన్ని లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్నారు. కమల్ నిర్మాణంలో రజనీ నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'ధర్మమే వెల్లుమ్' (ధర్మమే గెలుస్తుంది) అనే ట్యాగ్‌లైన్‌తో కమల్ హాసన్ స్వయంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఒక వైద్యుడి పాత్రలో నటిస్తూనే, సమాజంలోని నేరస్థులను శిక్షించే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో విడుదలైన టైటిల్ పోస్టర్‌లో ఆపరేషన్ థియేటర్‌లో స్కాల్‌పెల్ చేతిలో పట్టుకుని, ఒక రౌడీ మృతదేహంపై కాలు వేసి ఉన్న రజనీకాంత్ లుక్ సినిమాపై ఉత్కంఠను మరింత పెంచింది. ఈ చిత్రానికి యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీతలైన అన్బరివ్ ద్వయం స్టంట్స్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వరుస షెడ్యూళ్లతో సినిమాను వేగంగా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ప్రణాళికలు రచిస్తోంది.

# 'ది ప్యారడైజ్'కు సెన్సార్ పూర్తి..



నేచురల్ స్టార్ నాని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్' సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఏ సర్టిఫికేట్ జారీ చేసింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ సినిమా మొత్తం 2 గంటల 49 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం గురించి నాని మాట్లాడుతూ, తన 18 ఏళ్ల సినీ కెరీర్‌లో ఇంతగా శ్రమించిన సినిమా మరొకటి లేదని అన్నారు. "శారీరకంగా, మానసికంగా 'ది ప్యారడైజ్' నన్ను బాగా అలసిపోయేలా చేసింది. ఇంత కష్టపడి నేను మరో సినిమాకు పనిచేయలేదు" అని ఇటీవల మీడియా సమావేశంలో తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులపై కూడా ఆయన స్పష్టత ఇచ్చారు. "సినిమాలో నీటి అడుగున సన్నివేశాలు ఉన్నాయని, వెయ్యి మందితో ఫైట్ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. వాటిలో నిజం లేదు. ఇది ఒక వాస్తవిక కథ. యాక్షన్ సన్నివేశాలు చాలా ఉన్నాయి. హింసలో కూడా ఓ భావోద్వేగం ప్రేక్షకులకు కనపడుతుంది" అని వివరించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ, "సినిమా కాస్త ఆలస్యమైనా, విడుదలైన ప్రతి అప్‌డేట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇది ఒక విప్లవాత్మక, భావోద్వేగభరితమైన చిత్రం. తల్లీకొడుకుల కథతో పాటు, అణచివేతకు గురైన ఒక సమాజం కథ ఇది" అని అన్నారు. కాళోజీ మాటలను గుర్తుచేస్తూ, ""పుట్టుక మనది, చావు మనది, కానీ మన బతుకంతా దేశానిది' అనే వాక్యం ఈ కథకు స్ఫూర్తి. దేశం కోసం పోరాడిన ప్రజలకు, అదే దేశంలో చోటు లేనప్పుడు ఏం చేయాలో తెలియక తిరగబడటమే 'ది




# ఓటీటీలోనూ సత్తా చాటుతోన్న విశ్వనాథ్ అండ్ సన్స్

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, మమితా బైజు జంటగా నటించిన సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ ఫ్యామిలీ డ్రామా థియేటర్లలో భారీ విజయం సాధించింది. అనంతరం సెప్టెంబర్ 11న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ మూవీ థియేటర్ రన్‌లోనే కాదు.. ఓటీటీలోనూ తన సత్తా చాటుతోంది. ఈ క్రమంలో ముఖ్యంగా దళపతి విజయ్, ప్రభాస్ సినిమాల వ్యూస్‌ను అధిగమిస్తూ సూర్య మూవీ సరికొత్త రికార్డు సృష్టించింది. 'విశ్వనాథ్ అండ్ సన్స్' తొలి వారంలోనే రికార్డు స్థాయి వ్యూస్ సొంతం చేసుకుంది. నెట్‌ఫ్లిక్స్ వెల్లడించిన గణాంకాల ప్రకారం..

ఈ సినిమా తొలి వారం (సెప్టెంబర్ 7 నుంచి 13 వరకు)లోనే 5.5 మిలియన్ వ్యూస్ సాధించింది. మొత్తం 14.6 మిలియన్ వ్యూయింగ్ అవర్స్ నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా నెట్‌ఫ్లిక్స్ నాన్-ఇంగ్లిష్ మూవీస్ ట్రెండింగ్ జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. ఈ రికార్డు బట్టి చూస్తే ఈ సినిమాకు ఇండియాలోనే కాకుండా విదేశీ మార్కెట్లలోనూ ప్రేక్షకుల ఆదరణ లభిస్తోంది. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రస్తుతం ఈ సినిమా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులో ఉంది. 5.5 మిలియన్ వ్యూస్‌తో 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. 2026లో థియేటర్ల తర్వాత ఓటీటీలోకి వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో టాప్ లో నిలిచింది. అంతకుముందు విజయ్ మూవీ బ్లాస్ 4.4 మిలియన్ వ్యూస్‌తో టాప్ ఉండగా.. సూర్య సినిమా ఆ రికార్డును బ్రేక్ చేసింది. కరా 3.8 మిలియన్, జననాయగన్ 3.6 మిలియన్, ప్రభాస్ 'రాజాసాబ్ 3.4 మిలియన్ వ్యూస్‌తో తదుపరి స్థానాల్లో నిలిచాయి. అంటే సూర్య సినిమా థియేటర్లలో సాధించిన విజయాన్ని ఓటీటీ రిలీజ్ తర్వాత కూడా కొనసాగించిందని చెప్పొచ్చు. ఇదే సమయంలో మరో రికార్డు నమోదైంది. నెట్‌ఫ్లిక్స్‌లో థియేట్రికల్ రిలీజ్ తర్వాత స్ట్రీమింగ్‌కు వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఆల్‌టైమ్ ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో 'విశ్వనాథ్ అండ్ సన్స్' 5.5 మిలియన్ వ్యూస్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో అల్లు అర్జున్ పుష్ప 2 5.8 మిలియన్ వ్యూస్‌తో మొదటిస్థానంలో ఉండగా.. ఆ తర్వాత 'విశ్వనాథ్ అండ్ సన్స్' 5.5 మిలియన్‌తో నిలిచింది. ఇడ్లీ కాడాయి 5.2 మిలియన్, లక్కీ భాస్కర్ 5.1 మిలియన్, బాస్ట్ 4.4 మిలియన్ వ్యూస్‌తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# న్యూ ఏజ్ మ్యూజికల్ ఫిల్మ్




హెచ్.టీ సినిమాస్ ఎల్.ఎల్.పి బ్యానర్‌పై హేమల్ తుమ్మపూడి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కనున్న తొలి చిత్రం 'పాటకు ప్రాణం'. ఈ సినిమా బుధవారం ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి దర్శకులు సురేందర్ రెడ్డి, హీరో నిఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సంగీతానికి, భావోద్వేగాలకు ప్రాధాన్యతనిస్తూ తెరకెక్కనున్న ఈ చిత్రంలో సుదర్శన్, సాత్విక జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానుందని దర్శక, నిర్మాత హేమల్ తుమ్మపూడి తెలిపారు. వైవిధ్యమైన కథాంశంతో, సంగీతానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో, దర్శకుడు హేమల్ తుమ్మపూడి మాట్లాడుతూ , "ముందుగా మా లాంటి యువ ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇక్కడికి విచ్చేసిన మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన హీరో నిఖిల్ గారికి, దర్శకుడు సురేందర్ రెడ్డి గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు. మా చిత్రబృందాన్ని ఆశీర్వదించేందుకు వచ్చిన నటీనటులందరికీ ధన్యవాదాలు.సుమారు 60 ఏళ్లుగా వెనుకబడిపోయిన రామయ్య అనే వ్యక్తి, అలాగే 20 ఏళ్ల యువకుడు కలిసి ప్రారంభించే మ్యూజికల్ జర్నీ చుట్టూ మా సినిమా కథ సాగుతుంది. ఇది న్యూ ఏజ్ మ్యూజికల్ డ్రామా. సినిమాలో చాలా పాటలు ఉంటాయి. మా చిత్రానికి శేఖర్ చంద్ర అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.ఈ సినిమాను వచ్చే ఏడాది ద్వితీయార్థంలో మంచి తేదీని చూసుకుని థియేటర్లలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం అని తెలిపారు.తనికెళ్ల భరణి గారు మాట్లాడుతూ ,'ఈ సినిమాను 'శంకరాభరణం'తో పోల్చడం లేదు. అయితే ఆ సినిమాలో ఉన్న సంగీత స్ఫూర్తి ఈ సినిమాలో కూడా కనిపిస్తుంది. ఈ చిత్రంలో ఒక పాత తరం సంప్రదాయ సంగీత విద్వాంసుడికి, ఈ తరం జెన్-జెడ్ సంగీతకారుడికి మధ్య ఉండే ఆసక్తికరమైన కలయికను చూపించబోతున్నారు' అని అన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com